www.andhrajyothy.com పేజీలు: 12
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 234

సోమవారం | 9-12-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ. 8.03 తదుపరి నవమి తె. 6.01; నక్షత్రం: పూర్వాభాద్ర మ. 2.56 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 11.57-1.27; దుర్ముహూర్తం: మ. 12.29-1.13, మ. 2.41-3.25; అమృతఘడియలు: ఉ. 7.18-8.49, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 5.37

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అధికారంతో అరాచకం

ఐదేళ్ల జగన్ పాలనలో యథేచ్ఛగా ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు, ప్రకృతి వనరుల దోపిడీ

చేతులు మారిన వేల ఎకరాల భూములు

ఇసుక, గనులు, రేషన్‌లో భారీ అక్రమార్జన

నంబర్ టూ పెద్దిరెడ్డి వేల కోట్ల ఆర్జన

పల్నాడులో పిన్నెల్లి సంపాదన రూ.1000 కోట్లు

కార్మికుల శ్రమ దోచుకున్న శంకరనారాయణ

రోజా ఇలాకాలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి బేరం

కడప జిల్లాలో 3500 ఎకరాల ఆక్రమణ

వైసీపీ హయాంలో స్వాహా పర్వం


అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం, విస్సన్నపేట ప్రాంతాల్లో వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న భూములు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఐదేళ్ల కాలంలో అంతులేని దందాల కథ ఇది! సినిమాలుగా తీస్తే పది సీక్వెల్‌లు అవుతాయి! సీరియల్‌గా తీస్తే వందల ఎపిసోడ్లు కావాల్సిందే! రాష్ట్ర స్థాయిలో వైసీపీ పెద్దలు దున్నేయగా... జిల్లాల స్థాయిలో అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు కుమ్మేశారు. జగన్ 'ఘనత' రాష్ట్రం, దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు చేరగా... ఆయన పార్టీ నేతలు తమకు చేతనైనంతగా చెలరేగిపోయారు. గత ఐదేళ్లలో ఒక్క మద్యంలోనే తాడేపల్లికి 3,100 కోట్ల ముడుపులు అందగా... కింది స్థాయి నేతలూ అధికారం అండతో కోట్లకు పడగలెత్తారు. అడ్డగోలుగా జనమ్మీద పడి దోచుకున్నారు. ప్రకృతి వనరులను చెరబట్టారు. ప్రతి పనిలోనూ వాటాలు, ముడుపులు పిండుకున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ భూములు అన్నతేడా లేకుండా బెదిరించి మరీ వేలాది ఎకరాలు సొంతం చేసుకున్నారు. ఒక్క కడప జిల్లాలోనే

మిగతా 11వ పేజీలో...

దందాల ద్వారంపూడి

ఐదేళ్లలో అడ్డగోలుగా అక్రమార్జన

నాటి సీఎం జగన్ అండతో బరితెగింపు

ఎన్నో బెదిరింపులు, దౌర్జన్యాలు, కబ్జాలు

బినామీని అద్దె అడిగినందుకు యజమాని నుంచే రూ.3 కోట్లు వసూలు

కాకినాడలో 100 కోట్ల విలువైన హోటల్ స్థలం రూ.12 కోట్లకే సొంతం 12

సొంత రొయ్యల ఫ్యాక్టరీకి వంతెన

వెనక'బడి'ంది!

ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్

నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే

ఎక్కువగా రెండు, మూడు స్టార్లకే పరిమితం

ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్

సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి 6

అంతంతమాత్రంగానే అభ్యసన ఫలితాలు

జగన్ ప్రభుత్వ నిర్వాకంతో దీనస్థితిలోకి


సిరియా స్వాధీనం తర్వాత డమాస్కస్‌లో తిరుగుబాటుదారుల సంబరాలు

సిరియా.. రెబెల్స్ వశం

రాజధాని డమాస్కస్ స్వాధీనం.. తిరుగుబాటుదార్ల విజయం

13 ఏళ్ల పోరాటం.. 54 ఏళ్ల అసద్ కుటుంబ పాలన అంతం

ముగిసిన అధ్యక్షుడు అసద్ శకం.. కుటుంబం సహా పరారీ

సంబరాలు జరుపుకొన్న దేశ ప్రజలు.. అధ్యక్ష భవనం లూటీ

సెంట్రల్ బ్యాంకులోనూ దోపిడీ.. మిలటరీ కోర్టుకు నిప్పు



కూల్‌గానే క్రూరత్వం

14 ఏళ్ల బాలిక గ్రాఫిటీతో అసద్ పతనం షురూ

నేడో రేపో సిరియాలో కొత్త ప్రభుత్వం!

డమాస్కస్, డిసెంబరు 8: మొన్న అఫ్ఘానిస్థాన్, నిన్న శ్రీలంక, బంగ్లాదేశ్ ప్రజాగ్రహానికి గురవ్వగా.. తాజాగా సిరియా కూడా అదే బాటలో రెబెల్స్ హస్తగతమైంది. అప్పటి అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు మహమ్మద్ అష్రఫ్ ఘనీ, శ్రీలంక అధినేత గొటబాయ రాజపక్స, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా మాదిరిగా.. ఆదివారం సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ కూడా దేశాన్ని వీడారు. గత నెల 27 నుంచి క్రమంగా సిరియాలోని నగరాలు, గ్రామాలను ఆధీనంలోకి తెచ్చుకుంటున్న హయాత్ తహ్రీర్ అల్ షమ్(హెచ్‌టీఎస్) నేతృత్వంలోని రెబెల్స్.. శనివారం కీలకమైన అలెప్పో, హమా,

మిగతా 2వ పేజీలో...

ఆర్వోఆర్ అప్పీళ్ల బాధ్యత మళ్లీ ఆర్డీవోలకే!

జిల్లా రెవెన్యూ అధికారులపై భారం పెరుగుతున్నందునే!

ఇతర బాధ్యతలతో అప్పీళ్లను పట్టించుకోని వైనం 3

ఆ అధికారాన్ని వారి నుంచి తప్పించాలని రెవెన్యూ యోచన

సైబర్ నేరాలకు చెక్!

12

జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు

ఎస్పీల గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల పరిష్కారం

ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం

ప్రభుత్వానికి పోలీస్ శాఖ ప్రతిపాదనలు

రహదారులు రక్తసిక్తం

రెండు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం

పల్నాడు జిల్లాలో చెట్టును ఢీకొన్న కారు

'బాపట్ల'లో స్కూటర్‌ను ఢీకొట్టిన టిప్పర్ 12

సిరియా.. రెబెల్స్ వశం

(మొదటి పేజీ తరువాయి)

హోమ్స్, అల్-కమల్, డెయిర్ ఎజోర్ నగరాలతోపాటు.. ఉత్తర సిరియాను ఆక్రమించిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి డమాస్కస్‌కు 10 కిలోమీటర్ల దూరం వరకు చేరుకున్న రెబెల్స్.. ఆదివారం ఉదయం రాజధాని నగరాన్ని పూర్తిస్థాయిలో ఆధీనంలోకి తెచ్చుకుంది. దీంతో ప్రజలు సంబురాలు జరుపుకోగా.. సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ దేశాన్ని వీడారు. ఆ వెంటనే రెబెల్స్ తమ విజయాన్ని ప్రకటించారు.

అసద్ ఎక్కడ


అసద్ ఆదివారం ఉదయమే తన కుటుంబంతో సహా రష్యా తయారీ ఐఎల్-76 విమానంలో సురక్షిత ప్రాంతానికి బయలుదేరారు. మధ్యాహ్నానికి ఆ విమానం నుంచి రాడార్‌కు సంబంధాలు తెగిపోవడంతో.. ప్రమాదం జరిగి ఉంటుందని, అసద్ చనిపోయి ఉంటాడని సోషల్ మీడియాలో వార్తలు వెల్లువెత్తాయి. సిరియా అధికారులు ఈ విషయాన్ని నిర్ధారించలేదు. ఆయన విమానం 3,650 మీటర్ల ఎత్తు నుంచి ఒక్కసారిగా 1,070 మీటర్లకు పడిపోయినట్లు తేలిందని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్లు చెబుతున్నాయి. ఆ ప్రదేశం లెబనాన్ గగనతలం పరిధిలో ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే.. సురక్షిత ప్రాంతానికి వెళ్లే క్రమంలో రాడార్‌కు అందకుండా జాగ్రత్తలు తీసుకుని ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసద్ ఎక్కడున్నాడనే విషయం శనివారం రాత్రి నుంచే తెలియదని సిరియా ప్రధాని మహమ్మద్ అల్-జలాలీ పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకునే నాయకత్వంపై దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

నేడో రేపో కొత్త సర్కారు!

రెబల్స్ ఒకట్రెండ్రోజుల్లో కొత్త ప్రభుత్వాన్ని ప్రకటించే అవకాశాలున్నట్లు సిరియా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అంతర్యుద్ధంతో 70% సిరియా దెబ్బతిన్నదని, పునర్నిర్మాణానికి చాలా సమయం పడుతుందని వివరించాయి. పశ్చిమదేశాలు, అమెరికా సాయం లేనిదే అది సాధ్యం కాదని, ఒకవేళ కొత్త సర్కారు ఇస్లామిక్ అతివాద ధోరణులను ప్రదర్శిస్తే.. ఆ దేశాలు సహకరించే అవకాశాలు అంతంతమాత్రమేనని పేర్కొన్నాయి. సౌదీ అరేబియా, ఇతర అరబ్ దేశాలు ఒకవేళ సాయం చేసినా.. పరిమితంగానే ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశాయి. తిరుగుబాటు నాయకుడు అబూ మహమ్మద్ అల్-గోలానీని ప్రభుత్వాధినేతగా ప్రకటించే అవకాశాలున్నట్లు తెలిపాయి. మరోవైపు.. తాము ఇంతకాలం ప్రభుత్వం చెప్పినట్లు వార్తలు రాశామని, అది తమ తప్పు కాదని సిరియా పత్రికలు, వార్తాసంస్థలు రెబెల్స్‌కు సందేశాన్ని పంపాయి. తాము ప్రజల పక్షాన ఉంటూ.. నవ సిరియా నిర్మాణానికి సహకరిస్తామని, గత సర్కారు హయాంలో వార్తలు రాసిన జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలు వద్దని విజ్ఞప్తి చేశాయి.

జైళ్లలో అరాచకాలు

సొంత ప్రజలపైనే రసాయన, సిలిండర్ దాడులు చేయించిన అపఖ్యాతిని మూటగట్టుకున్న అసద్.. జైళ్లలో అమానుషంగా మరణ శిక్షలను విధించేవాడని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2016లోనే ఆరోపించింది. అమ్నెస్టీ తమకు 2011-15 మధ్యకాలానికి సంబంధించిన అరాచకాల వివరాలే అందాయని, ఆ తర్వాత డేటా దొరకలేదని పేర్కొంది. ఈ మధ్యకాలంలోనే అధికారికంగా లక్ష మందికి మరణ శిక్షలు విధించినట్లు పేర్కొంది. అనధికారికంగా ఈ సంఖ్య 3 లక్షల దాకా ఉంటుందని అంచనా. ఒక్క సాయ్‌డాన్‌యా జైలులోనే.. అధికారికంగా 30 వేల మంది ఖైదీలు మరణశిక్షకు గురయ్యారు. ఈ దారుణాలకు మారుపేరు సాయ్‌డాన్‌యా జైలు అని మాజీ ఖైదీలు చెబుతుంటారు. ముఖ్యంగా.. ఈ జైలులో రెండు భవనాలు ఉంటాయి. వాటిల్లో ఒకదానికి ఎరుపు రంగు, రెండోదానికి తెలుపు రంగు ఉంటుంది. సాయుధ తిరుగుబాటుదారులను ఎరుపు రంగు భవనంలో.. విచారణ కొనసాగుతున్న, తిరుగుబాటుదారుల సానుభూతిపరులను తెలుపురంగు భవనంలో పెట్టేవారు. రెండు వారాలకు ఓ సారి జడ్జితో విచారణ జరిపిస్తారు. 3-4 నిమిషాల్లోనే విచారణ పూర్తిచేస్తారు. ఎలాంటి వాదనలను వినకుండానే.. 30-50 మంది ఖైదీలకు మరణశిక్ష విధించేవారు. అదికూడా వెంటనే కాదు..! వారికి విషయం కూడా చెప్పేవారు కాదు..! వారిని వైట్ బిల్డింగ్‌కు తీసుకెళ్లి.. కళ్లకు గంతలు కట్టి, నానా చిత్రహింసలు పెట్టి, ఆ తర్వాత మరణశిక్షను అమలు చేసేవారని అమ్నెస్టీ వెల్లడించింది. ఇక జైలు అధికారులు బ్యారక్‌లకు వచ్చినప్పుడు.. తమ కళ్లకు గంతలు కట్టేవారని మాజీ ఖైదీలు చెబుతున్నారు. అర్ధరాత్రి పూట మరణశిక్షలు అమలు చేసేవారని, తుపాకీతో కాల్పుల శబ్దాలు వినిపించేవారని, జైలులో ఉన్నన్ని రోజులు బిక్కుబిక్కుమంటూ గడిపామని వివరించారు.





భారతీయులంతా క్షేమం

సిరియాలో ఉన్న భారతీయులంతా క్షేమంగానే ఉన్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డమాస్కస్‌లోని భారత రాయబార కార్యాలయం యథావిధిగా పనిచేస్తోందని పేర్కొన్నాయి. సిరియాలో ఉన్న భారతీయులతో ఎంబసీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపాయి. అధికారిక లెక్కల ప్రకారం సిరియాలో 90 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో 14 మంది ఐరాస సంస్థల్లో పనిచేస్తున్నారు.

రాజధానిలో లూటీ

అసద్ దేశాన్ని వీడి పారిపోయాడన్న వార్తతో.. ఆదివారం మధ్యాహ్నం ప్రజలు డమాస్కస్ వీధుల్లోకి వచ్చి సంబరాలు జరుపుకొన్నారు. దేవుడి కరుణతో నిరంకుశ పాలన నుంచి తమకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. అదే సమయంలో.. రాజధాని నగరంలో లూటీలు కూడా జరిగాయి. అధ్యక్ష భవనంలోకి చొరబడ్డ ప్రజలు..దొరికిన వస్తువును దొరికినట్లు దోచుకున్నారు. రక్షణ శాఖ ఆఫీసులో కూడా లూటీ జరిగినట్లు వార్తలొచ్చాయి. సిరియా సెంట్రల్ బ్యాంక్‌లో కరెన్సీ కట్టలున్న డబ్బాలను కూడా పౌరులు ఎత్తుకెళ్లడం కనిపించింది. తర్వాత తిరుగుబాటుదారులు డబ్బులకు కాపలాగా ఉన్నారు.

గోలన్‌హైట్స్‌లో ఇజ్రాయెల్ పాగా

సిరియా అధ్యక్షుడు అసద్ పరారీతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. ఇజ్రాయెల్-సిరియా సరిహద్దుల్లో తన సైన్యాన్ని మోహరించింది. 1974 కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా.. గోలన్‌హైట్స్‌లో 2/3వ వంతు ఇజ్రాయెల్, మిగతా భూభాగం(బఫర్‌జోన్) సిరియా ఆధీనంలో కొనసాగుతున్నాయి. అయితే ఆదివారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్వయంగా సరిహద్దులకు వెళ్లి.. సైనికులకు దిశానిర్దేశం చేశారు. గోలన్‌హైట్స్ పూర్తిగా తమ ఆధీనంలో ఉన్నట్లు ప్రకటించారు. అక్కడి ప్రజల(క్రిస్టియన్లు అధికం)ను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.




14 ఏళ్ల బాలిక గ్రాఫిటీతో మొదలైన పతనం

అసద్ అణచివేత విధానాలతో విసిగిపోయిన ఓ 14 ఏళ్ల బాలిక దక్షిణ సిరియాలోని దారా అనే ఊళ్లో గోడపై 'డాక్టర్ ఇక నీ వంతు' అనే అర్థం వచ్చేలా గ్రాఫిటీ చిత్రాలు వేసింది. ఇందుకుగాను ఆ బాలిక, ఆమె స్నేహితురాళ్లని అరెస్టు చేసిన పోలీసులు 26 రోజులపాటు చిత్రహింసలకు గురి చేశారు. దీంతో దారాలో మొదలైన ప్రజాతిరుగుబాటు 2011 మార్చి 15 నాటికి దేశ వ్యాప్తంగా అంతర్యుద్ధానికి దారి తీసి అసద్ పతనానికి కారణమైంది.


సిరియాలో కొత్త శకం: రెబెల్స్

అసద్ పలాయనంతో.. తిరుగుబాటుదారులు సిరియా తమ వశమైందంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. "నిరంకుశ పాలకుడు అసద్ దేశాన్ని వీడాడు. సిరియాకు విముక్తి లభించింది. సిరియా ఇప్పుడే స్వేచ్ఛావాయువులను పీల్చనుంది. సిరియాలో కొత్త శకం ప్రారంభమైంది. విదేశాల్లో తలదాచుకుంటున్న సిరియన్లు 'స్వేచ్ఛాయుత సిరియా'కు తిరిగి రావాలని కోరుతున్నాం" అని సోషల్ మీడియాలో పిలుపునిచ్చారు. నిజానికి హెచ్‌టీఎస్ నేతృత్వంలోని తిరుగుబాటు దళాల ప్రతినిధి హసన్ అబ్దుల్ ఘనీ డమాస్కస్‌ను చుట్టుముట్టడం ద్వారా ఆపరేషన్‌ను చివరి దశకు తీసుకొచ్చామని శనివారమే ప్రకటించారు. ఆదివారం ఉదయమే ఆయన తాము డమాస్కస్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.


డమాస్కస్‌లోని ప్రసిద్ధ ఉమయ్యద్ మసీదులో తిరుబాటుదారుడి ప్రార్థన



లోకం తీరు



అసద్ పనైపోయింది: ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 8: సిరియా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం విడిచి పారిపోయిన సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పనైపోయినట్టేనని పేర్కొన్నారు. ఆయనను కాపాడడంలో పుతిన్‌కు ఇక ఏ మాత్రం ఆసక్తి లేదన్నారు. ఇన్నాళ్లూ అసద్‌కు పుతిన్ రక్షకుడిగా నిలిచారన్న ట్రంప్.. ఇక సిరియా యుద్ధానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని తెలుసుకున్నారని వ్యాఖ్యానించారు.

సిరియా... ఊపిరి పీల్చుకో: జర్మనీ

అసద్ ప్రభుత్వ పతనంతో సిరియా ప్రజలకు ఉపశమనం లభించిందని జర్మనీ వ్యాఖ్యానించింది. అయితే సిరియా రాడికల్స్ చేతిలో పడకూడదని జర్మనీ విదేశాంగ మంత్రి అన్నాలెనా బెర్బాక్ ఆకాంక్షించారు. దేవుడు తమకు ఊరటనిచ్చాడని లెబనాన్ రాజధాని బీరుట్‌లోని సిరియా శరణార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో సిరియా శరణార్థులు రోడ్లపైకి వచ్చి సంబురాలు జరుపుకున్నారు.

'పుష్ప 2' తొక్కిసలాట కేసులో ముగ్గురి అరెస్టు

చిక్కడపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'పుష్ప 2' ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో బాధ్యులైన ముగ్గురు వ్యక్తులను చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. థియేటర్ యజమానుల్లో ఒకరైన సందీప్, సీనియర్ మేనేజర్ నాగరాజు, థియేటర్ బాల్కనీ ఇన్‌చార్జ్ విజయచందర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఏసీపీ ఎల్.రమేష్ కుమార్ విలేకరులకు తెలిపారు. నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించామన్నారు.

13 ఏళ్లుగా తిరుగుబాటు

సిరియాలో 2011 నుంచి తిరుగుబాట్లు తీవ్రమయ్యాయి. అంతర్యుద్ధం మొదలైంది. అసద్ కుటుంబం షియాలోని అల్లవీట్ వర్గానికి చెందినది. సిరియాలో ఈ వర్గం జనాబా 12% మాత్రమే. దేశంలోని టార్టస్, లకాటియా ప్రాంతాల్లో వీరు అత్యధికంగా ఉండగా.. విఎగతా ప్రాంతాల్లో సున్నీలదే మెజారిటీ. అసద్ షియాకు చెందిన వ్యక్తి కావడంతో.. ఇరాన్ మద్దతిస్తూనే.. లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లాను రంగంలోకి దింపింది. రష్యా కూడా అసద్‌కు సహకరించింది. అసద్ తండ్రి హయాం నుంచి కూడా అధికార వర్గాల్లో షియాలనే నియమించడం, సున్నీలను అణగదొక్కడం రివాజుగా ఉండేది. అంతర్యుద్ధానికి ఈ అణచివేతే ప్రధాన కారణం. 2015లో తిరుగుబాటుదారుల ధాటికి అసద్ పతనం అంచులదాకా వెళ్లారు. అయితే.. ఇరాన్, హిజ్బుల్లా సహకారం.. రష్యా వాయుసేన రంగంలోకి దిగడంతో.. తిరుగుబాటుదారులు వెనక్కి తగ్గారు. అసద్ గట్టెక్కారు.


అసద్ దేశాన్ని విడిచిపోవడంతో విజయ సంకేతం చూపుతున్న కర్దు తెగకు చెందిన మహిళ

54 ఏళ్ల కుటుంబపాలనకు అంతం

సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశాన్ని వీడి పారిపోవడంతో 54 ఏళ్ల అతని కుటుంబపాలన అత్యంత నాటకీయంగా ముగిసింది. 1970ల్లో అసద్ తండ్రి హఫెజ్ అల్ అసద్ అధ్యక్షుడైనప్పటి నుంచి ఆదివారం దాకా ఆ కుటుంబమే సిరియాను శాసించింది. తండ్రి మరణం తర్వాత 2000 సంవత్సరంలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అసద్ తన అధికారాన్ని కాపాడుకునేందుకు 2011 నుంచి 13 ఏళ్లుగా రకరకాల ప్రయత్నాలు చేశారు. సిరియాను దేశ, విదేశీ శక్తులకు యుద్ధ భూమిగా మార్చేసిన అసద్.. చివరికి అంతర్యుద్ధానికి తలొగ్గి పారిపోయారు.

సున్నీల కోటలో హఫెజ్ సామ్రాజ్యం

సున్నీలు మెజార్టీ వర్గమైన సిరియాలో ఒకప్పుడు వారి ఆధిపత్యమే ఉండేది. దేశంలో రాజకీయ అనిశ్చితి, ప్రజాతిరుగుబాటులు అధికమైనప్పుడు అసద్ తండ్రి హఫెజ్ అల్ అసద్ 1970లో అనూహ్యంగా అధ్యక్షుడు అయ్యారు. షియా పద్ధతులను ఆచరించే అలావీట్ అనే మైనార్టీ వర్గానికి చెందిన హఫెజ్.. సిరియా రక్షణ మంత్రిత్వ శాఖ, వాయుసేన కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉండేవారు. అధ్యక్షుడయ్యాక విభజించి పాలించు విధానంతో దేశంలో వర్గపోరుకు తెరలేపి తన అధికారాన్ని నిలబెట్టుకున్నారు. సైన్యం, సెక్యూరిటీ సర్వీసెస్ సహా ప్రభుత్వంలోని కీలక పదవుల్లో అలావీట్లు, తన కుటుంబసభ్యులను నియమించి సున్నీల ప్రాబల్యాన్ని క్రమంగా తగ్గించేశారు.


హఫెజ్ అసద్ తలపై రెబెల్ కాలు

దీంతో దేశ జనాబాలో 12 నుంచి 15 శాతం మాత్రమే ఉన్న అలావీట్‌లు హఫెజ్ అధికారానికి అండగా నిలబడ్డారు. హఫెజ్ 30 ఏళ్లకు పైగా సిరియాను ఓ నియంతలా శాసించారు. ఎంతలా అంటే.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్నేహితుల దగ్గర మాట్లాడేందుకు కూడా ప్రజలు వణికిపోయేవారు.

అనుకోకుండా అధ్యక్షుడైన డాక్టర్ సాబ్

బషర్ అల్ అసద్ దేశ అధ్యక్షుడు అవ్వడం అత్యంత నాటకీయంగా జరిగింది. నిజానికి, హఫెజ్ తన పెద్ద కుమారుడు, అసద్ అన్నయ్య బసిల్‌ను తన వారసుడిగా ప్రకటించారు. అయితే, 1994లో జరిగిన ఓ కారు ప్రమాదంలో బసిల్ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో లండన్‌లో కంటి వైద్యుడిగా పని చేస్తోన్న అసద్ తెరమీదకి వచ్చారు. ఉన్నపళంగా అసద్‌ను స్వదేశానికి రప్పించి సైనిక శిక్షణ ఇప్పించి, కల్నల్ హోదా కల్పించి.. భవిష్యత్తు నాయకుడు అసద్ అని సందేశం ఇచ్చారు. అయితే, హఫెజ్ 2000లో మరణించే నాటికి అసద్ వయస్సు 34 ఏళ్లు. కానీ దేశ అధ్యక్షుడు అవ్వాలంటే ఓ వ్యక్తికి కనీసం 40 ఏళ్లు ఉండాలి. అయితే, అసద్ కోసం ఈ కనీస వయస్సు పరిమితిని 40 నుంచి 34కు తగ్గిస్తూ పార్లమెంట్ చట్టం చేసేసింది. దాంతో డాక్టర్ సాబ్ తన తండ్రి వారసుడిగా అధ్యక్షుడు అయిపోయారు.

ప్రజా వ్యతిరేకతకు తలొగ్గి

ప్రజా వ్యతిరేకతకు తలొగ్గి 2011లో ఈజిప్టు అధ్యక్షుడు ముబారక్ తన పదవికి రాజీనామా చేశారు. ఈజిప్టు నేతల ఈ నిర్ణయాన్ని ఎగతాళి చేస్తూ అసద్ అప్పట్లో ఓ ఈ-మెయిల్ పంపారు. ఇప్పుడు అదే ప్రజావ్యతిరేకతతో అసద్ తన పదవిని కోల్పోవడం, దేశాన్ని వదిలి వెళ్లిపోవడం యాదృచ్ఛికం.

కూల్‌గా కనిపించి క్రూరత్వం చూపిన అసద్



హఫెజ్‌తో పోలిస్తే పాలనపై ఏమాత్రం అనుభవం లేని అసద్ అధికారం చేపట్టిన తొలినాళ్లలో ప్రజానాయకుడిగా వ్యవహరించారు. రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేశారు. హఫెజ్ నిరంకుశత్వానికి అల్లాడిపోయిన ప్రజలు అసద్ శైలి చూసి తమకు ఓ మంచి నాయకుడు దొరికాడని భావించారు. క్రమంగా దేశంలో ప్రజాస్వామ్య విధానాల అమలుకు డిమాండ్లు పెరగ్గా, రాజకీయ పార్టీలు కూడా ఏర్పాటయ్యాయి. దీంతో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు అసద్ 2001లో తన అసలు రంగుని బయటపెట్టారు. ప్రభుత్వ వ్యతిరేకులను కటకటాల్లోకి నెట్టారు. తన తండ్రి లాగే కీలక పదవులను తన భార్య, తమ్ముడు, మరికొందరు సన్నిహితులకు కట్టబెట్టారు. 2010 నాటికి దేశ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. 2011లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు మొదలయ్యాయి. ఈ ఉద్యమాలపై అసద్ ఉక్కుపాదం మోపారు. సొంత ప్రజలపై రసాయన దాడులు, బాంబు దాడులు చేయించి ప్రజాఉద్యమాలను అణిచివేశారు. ఈ క్రమంలో 5లక్షల మందికిపై ప్రజల ప్రాణాలు తీశారు. ఇంత చేసినా దేశంలోని చాలా భాగాలు రెబల్స్ అధీనంలోనే ఉండిపోయాయి. 2015లో అధికారాన్ని కోల్పోయే స్థితికి వచ్చిన అసద్.. రష్యా, ఇరాన్, లెబనాన్‌కు చెందిన హిజ్బుల్లా అండతో ఇన్నాళ్లూ నిలదొక్కుకున్నారు.

కేంద్ర మంత్రుల ర్యాంప్ వాక్

న్యూఢిల్లీ, డిసెంబరు 8: కేంద్రమంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, సుకాంత మజుందార్ ర్యాంప్ వాక్ చేశారు. శనివారం ఢిల్లీలోని భారతమండపంలో జరిగిన 'అష్టలక్ష్మి మహోత్సవ్' ఫ్యాషన్ షో ఇందుకు వేదికైంది. ఇద్దరు కేంద్రమంత్రులు ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేలా కోట్లను ధరించి ఈ షోలో పాల్గొన్నారు. ఈశాన్య భారత సాంస్కృతిక వారసత్వ ప్రదర్శన కోసం ఈ ఫ్యాషన్ షోను ప్రధాని మోదీ ఈ నెల 6న ప్రారంభించారు. 8ఈశాన్య రాష్ట్రాల(అసోం, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, మణిపూర్, మేఘాలయా, సిక్కిం) సంఖ్య వచ్చేలా ఈ ఫ్యాషన్ షోకు అష్టలక్ష్మి అని పేరు పెట్టారు.



శబరిమలలో పంపా నుంచి సన్నిధి వరకు సీసీ కెమెరాలు

శబరిమల, డిసెంబరు 8: శబరిమలలో మొట్టమొదటి సారిగా.. పంపా బేస్ క్యాంప్ నుంచి సన్నిధానం వరకు ప్రతి అంగుళం కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పంపా నుంచి శరణ్‌గుత్తి వరకు రెండువైపులా మార్గాలతోపాటు.. నడపండల్, పదునెట్టాంబడి, సన్నిధానం, భస్మకులం ప్రాంతాల్లో మొత్తం 258 హెచ్‌డీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వీటిని రేయింబవళ్లు పర్యవేక్షించేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

'సొరోస్' నిధులిస్తున్న సంస్థతో సోనియాకు సంబంధం: బీజేపీ

న్యూఢిల్లీ: జార్జి సొరోస్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న సంస్థతో సోనియాగాంధీకి సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. కశ్మీర్‌ను స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలనే ఆలోచనకు సోనియా కో-చైర్‌గా ఉన్న ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా పసిఫిక్ (ఎఫ్‌డీఎల్-ఏపీ) ఫౌండేషన్ మద్దతు ఇచ్చిందని పేర్కొంది. ఈ సంబంధం దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ సంస్థల ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందని ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేసింది.

అట్టుడికిన శంభు

అన్నదాతల 'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

» కొందరికి గాయాలు.. పాదయాత్ర నిలిపివేత

న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నదాతల ఆందోళనలతో పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతం శంభు ఆదివారం అట్టుడికింది. కనీస మద్దతు ధర సహా 12 డిమాండ్ల సాధనకు పిలుపునిచ్చిన 'ఢిల్లీ చలో' ఉద్రిక్తంగా మారింది. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా హరియాణా ప్రభుత్వం శంభూ సరిహద్దులో భారీగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించింది. పోలీసులు పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు రైతులు పాదయాత్ర మొదలు పెట్టేందుకు సిద్ధం కాగా అనుమతి ఉంటే చూపించాలని పోలీసులు కోరారు. రైతులు బారికేడ్లు దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో కొందరు రైతులు గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం 'ఢిల్లీ చలో' పాదయాత్రను నిలిపివేస్తున్నట్టు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంతో ఎనిమిది మందికిపైగా రైతులు గాయపడ్డారు. "పోలీసులు 101 మంది రైతులకు అనుమతి ఇస్తామని చెప్పారు. కానీ అక్కడికి వచ్చిన తర్వాత అనుమతి లేదని లాఠీచార్జ్ చేశారు" అని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు.



పాక్‌కు బంగ్లా మరింత చేరువ!

సెక్యూరిటీ క్లియరెన్స్ లేకుండానే పాక్ పౌరులకు వీసా

కరాచీ నుంచి చిట్టగాంగ్‌కు నేరుగా రవాణా నౌకలకు అనుమతి

న్యూఢిల్లీ/ఢాకా, డిసెంబరు 8: పాకిస్థాన్ మారణహోమాలను అడ్డుకుని.. తన ఆవిర్భావానికి సహకరించిన భారత్ భద్రతకే బంగ్లాదేశ్ ఇప్పుడు ముప్పు తలపెడుతోంది. పాక్‌కు నానాటికీ చేరువవుతూ దానిని సంతృప్తిపరిచేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్ వీసా కోసం దరఖాస్తు చేసుకునే పాక్ పౌరులు భద్రతాపరమైన నిరభ్యంతర పత్రాన్ని తీసుకోవాలన్న నిబంధనను తీసివేసింది. పాక్‌లోని కరాచీ నుంచి బంగ్లాలోని చిట్టగాంగ్ వరకు సరుకు రవాణా నౌకలను నేరుగా అనుమతించాలని కూడా బంగ్లాదేశ్ నిశ్చయించింది. దీనివల్ల పాక్ ఉగ్రవాద సంస్థల నేతలు యథేచ్ఛగా బంగ్లాలోకి అడుగుపెట్టి.. తనను నష్టపరిచే కార్యకలాపాలు చేపడతారని భారత్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. కాగా, ఇస్కాన్ భక్తులకు ఇస్లామిక్ ఛాందసవాదుల నుంచి బెదిరింపులు పెరుగుతున్నాయని ఇస్కాన్ ప్రతినిధి రాధారామ్ దాస్ అన్నారు.

సరిహద్దుల్లో త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక వ్యవస్థ

జోధ్‌పూర్, డిసెంబరు 8: సరిహద్దుల్లో భద్రతను పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఆదివారం రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లోని బీఎస్ఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌లో నిర్వహించిన బీఎస్ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేజర్ యాంటీ డ్రోన్ గన్ మౌంటెడ్ మెకానిజం మంచి ఫలితాలు ఇచ్చిందని, దీని వల్ల పంజాబ్‌లో పాకిస్థాన్‌తో సరిహద్దు ప్రాంతంలో శత్రు డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతలు 3 శాతం నుంచి 55 శాతానికి పెరిగాయని అన్నారు. రాబోయే రోజుల్లో శత్రువుల నుంచి డ్రోన్ల ముప్పు మరింత పెరగనుందని, దాన్ని ఎదుర్కొనేందుకు బీఎస్ఎఫ్‌లో సమగ్ర డ్రోన్ విధ్వంసక విభాగాన్ని తీసుకురానున్నట్లు అమిత్ షా వెల్లడించారు.

శబరిమలకు 34 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల రద్దీ మేరకు వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో శబరిమలకు వెళ్లి రావడానికై వేర్వేరు స్టేషన్ల నుంచి 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 2025 జనవరి 7, 14, 21, 28 తేదీల్లో హైదరాబాద్- కొట్టాయం(07065), 8, 15, 22, 29 తేదీల్లో కొట్టాయం- సికింద్రాబాద్ (076066), 3, 10, 17, 24, 31 తేదీల్లో మౌలాలి- కొట్టాయం(07167), 4, 11, 18, 25, ఫిబ్రవరి1 తేదీల్లో కొట్టాయం- సికింద్రాబాద్(07168), జనవరి 5, 12, 19, 26 తేదీల్లో కాచిగూడ- కొట్టాయం(07169), 6, 13, 20, 27 తేదీల్లో కొట్టాయం- కాచిగూడ(07170), 4, 11, 18, 25 తేదీల్లో మౌలాలీ- కొల్లం(07171), 6, 13, 20, 27 తేదీల్లో కొల్లం-మౌలాలి..లకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. మరోవైపు అయోధ్య, కాశీ తదితర పుణ్య క్షేత్రాలను దర్శించుకోవాలనుకునే యాత్రికుల కోసం ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) ఈనెల 11వ తేదీన సికింద్రాబాద్ స్టేషన్ నుంచి భారత్ గౌరవ్ రైలును ఏర్పాటు చేసింది. పది రోజుల్లో పూరి, గయ, కాశీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ తీర్థ క్షేత్రాలను దర్శించుకుని తిరిగి వచ్చేందుకు అనువుగా ఈ ప్రత్యేక టూరిస్ట్ రైలును నడపనుంది. ఈ భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో ఆగుతుందని ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు.



రెండో స్థానంలో నిలిచిన ఏపీఎస్‌ఆర్టీసీ కార్పొరేషన్ క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసానికి
క్రీడలు దోహదం

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు
- ముగిసిన ఆర్టీసీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు

విశాలాక్షి నగర్ (విశాఖ సిటీ), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. విశాఖ పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహించిన అఖిల భారత రవాణా సంస్థల క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలకు 19 రాష్ట్రాల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు హాజరయ్యారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్‌తో పాటు పరుగు పోటీలు నిర్వహించారు. ఓవరాల్ చాంపియన్‌గా కర్ణాటక క్రీడాకారులు నిలవగా, రెండో స్థానంలో బెంగళూరు (బెస్ట్), ఏపీఎస్ ఆర్టీసీ క్రీడాకారులు (ఉమ్మడిగా) నిలిచారు. విజేతలకు చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీజీపీ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జోన్-1 చైర్మన్ ఎస్ దొన్నుదొర తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీకి 15 పతకాలు

క్రీడా పోటీల్లో ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు 15 పతకాలు సాధించారు. వాటిలో ఐదు పసిడి, మూడు రజత, ఏడు కాంస్య పతకాలు ఉన్నాయి. మహిళల 1,000 మీటర్ల రేస్ వాక్ (50 ఏళ్లలోపు)లో జి.ఫణిచక్రతేజ, 100 మీటర్ల పరుగు పందెంలో ఎ.మంజుల, పురుషుల 100 మీటర్ల రేస్ వాక్‌లో కె.రమేశ్, పురుషుల 100 మీటర్ల పరుగు పందెంలో హేమంత్, పురుషుల 400 మీటర్ల రిలే పరుగు పందెంలో కె.రాంబాబు, ఎన్.ప్రసాదరావు విజేతలుగా నిలిచారు. పోటీల్లో కర్ణాటక ఆర్టీసీ 14పతకాలు, తెలంగాణ ఆర్టీసీ 2, బెస్ట్ ఆర్టీసీ ఏడు పతకాలు, ఎంటీసీ చెన్నై ఒక పతకం కైవశం చేసుకున్నాయి.

ఆర్వోఆర్ అప్పీళ్ల బాధ్యత
మళ్లీ ఆర్డీవోలకే!

జిల్లా రెవెన్యూ అధికారులపై భారం పెరుగుతున్నందునే!

- వారికి ఇతర బాధ్యతలు ఉండడంతో అప్పీళ్లను పట్టించుకోవడం లేదు
- దీంతో ఆ అధికారాన్ని వారి నుంచి తప్పించాలని రెవెన్యూ శాఖ యోచన
- త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారు(డీఆర్‌వో)లపై పనిభారం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వారి వద్ద ఉన్న కొన్ని కీలక అధికారాలను దిగువ స్థాయికి బదలయించాలని రెవెన్యూ శాఖ యోచిస్తోంది. అందులో కీలకమైనది అప్పీళ్ల అంశం. జగన్ జమానాలో భూముల సర్వే సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారు(ఆర్డీవో)ల వద్ద ఉన్న అప్పీళ్ల అధికారాన్ని తొలగించి డీఆర్‌వోలకు అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పాస్‌పుస్తకాల చట్టం(ఆర్వోఆర్ యాక్ట్)-1971లో సవరణ చేసి రూల్స్ మార్చి మరీ అమల్లోకి తెచ్చారు. అయితే దానివల్ల కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి ఆర్వోఆర్ చట్టం ప్రకారం.. రైతులు, ప్రజలు భూములు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మ్యుటేషన్ కోసం తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటారు. డాక్యుమెంట్లన్నీ పక్కాగా ఉంటే రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేస్తారు. భూముల తనఖా, వ్యాపార లీజు ఒప్పందాలకు కూడా ఇదే విధానం వర్తిస్తోంది. అప్పట్లో ఆర్‌వోఆర్ రికార్డుల సవరణపై తహశీల్దారే నిర్ణయం తీసుకునేవారు. ఆ నిర్ణయం నచ్చనివారు ఆర్డీవో వద్ద అప్పీల్ చేసుకునేవారు. అయితే జగన్ సర్కారు భూముల సర్వే సందర్భంగా 2022 అక్టోబరులో ఆ చట్టాన్ని సవరించింది. ఏదైనా భూమిపై రిజిస్ట్రేషన్, తనఖా, లీజు ఒప్పందాలు జరిగిన తర్వాత వాటికి సరైన పత్రాలు లేవనో, లేక ఇతర కారణాలతో తిరస్కరించే అధికారాన్ని తహశీల్దార్‌కు దఖలుపరచింది. తహశీల్దార్ నిర్ణయంపై భిన్నాభిప్రాయం ఉంటే.. ఆ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆర్డీవోకు పంపితే.. 30 రోజుల వ్యవధిలో కేసు విచారణ చేసి ఉత్తర్వులు ఇస్తారని పేర్కొన్నారు. వీటిపై కూడా దరఖాస్తుదారులకు భిన్నాభిప్రాయాలు ఉంటే డీఆర్‌వో వద్ద అప్పీల్ చేసుకునేలా చట్టసవరణ చేశారు. అయితే ఆచరణలో దీని వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. డీఆర్‌వో జిల్లా కలెక్టరేట్‌లో ఉంటారు. ప్రొటోకాల్, ఇతర కీలక విధులు ఆయనకే ఉన్నాయి. దీంతో పాటు కలెక్టర్ అప్పగించే ఇతర బాధ్యతలూ ఉంటాయి. ఫలితంగా ఆర్వోఆర్ అప్పీళ్ల పరిష్కారంపై వారు దృష్టిసారించడం లేదని, ఆరు నెలల వ్యవధిలో ఈ కేసులను పరిష్కరించాల్సి ఉండగా.. కొన్నింటిని ఏళ్ల తరబడి విచారణకే స్వీకరించడం లేదన్న ఫిర్యాదులు ఇటీవలికాలంలో ప్రభుత్వానికి వచ్చాయి. 16 జిల్లాల పరిధిలో ఆరు నెలలపైన పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు 2,800పైనే ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై రైతులు, సామాన్యులు నిరంతరం జిల్లా కేంద్రానికి వచ్చిపోవడం, సమయానికి డీఆర్‌వో అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఆరు నెలల కాలంలో ఒక్క రెవెన్యూ శాఖ సెటిల్ చేయాల్సిన అంశాలపైనే 67వేల విన్నపాలు అందాయి. వీటిలో 20,840 ఒక్క ఆర్వోఆర్ చట్టానికి సంబంధించినవే. వీటిలోనూ 60 శాతానికిపైగా వినతులు డీఆర్‌వో వద్ద ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న అప్పీళ్లపైనే కావడం గమనార్హం. రైతులు, భూ యజమానుల వినతులను పరిష్కారం కోసం ప్రభుత్వం మళ్లీ డీఆర్‌వోలకే పంపుతోంది. అయినా పరిస్థితిలో మార్పు రావడం లేదు, అప్పీళ్లపై కొందరు డీఆర్‌వోలు ఏమాత్రం దృష్టిపెట్టలేకపోతున్నారని రెవెన్యూ శాఖ గుర్తించింది. గత నెల 29వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలోనూ ఈ అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. దరిమిలా అప్పీళ్ల బాధ్యతను డీఆర్‌వోల నుంచి తప్పించి తిరిగి ఆర్డీవోలకు పంపాలని రెవెన్యూ శాఖ త్వరలో ప్రతిపాదనలు పంపనుంది.

సీఎంతో చర్చించాక తుది నిర్ణయం: మంత్రి అనగాని

పాలనాకారణాలు, ప్రొటోకాల్ డ్యూటీల వల్ల డీఆర్‌వోలు బిజీగా ఉంటూ అప్పీళ్లను సరిగా చూడడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. దీనికి సరైన పరిష్కారం అప్పీళ్ల బాధ్యతను తిరిగి ఆర్డీవోలకు అప్పగించడమేనని భావిస్తున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 'ఆర్డీవో స్థానికంగా డివిజన్ కేంద్రంలో అందుబాటులో ఉంటారు. ప్రజలు కూడా అప్పీళ్లపై విచారణకు హాజరవడానికి సులభంగా ఉంటుంది. దూరప్రయాణాల భారం ఉండదు. ఇదే విషయంపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపాదనలు పంపిస్తాం. ఆయనతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటాం' అని పేర్కొన్నారు. ఇటీవల మొదలైన రెవెన్యూ సదస్సుల్లో కూడా ఆర్వోఆర్ అప్పీళ్ల పరిష్కారంపైనే ఎక్కువ ఫిర్యాదులు, విన్నపాలు వస్తున్నాయని వివరించారు.

'మనబడి' మాస పత్రిక ఆవిష్కరణ

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగపడేలా 'మన బడి' పేరుతో మాసపత్రికను అందుబాటులోకి తెచ్చినట్లు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాజాగా జరిగిన పేరెంట్- టీచర్స్ సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ మాసపత్రికను ఆవిష్కరించారని తెలిపారు. విద్యార్థులు వేసిన బొమ్మలు, రాసిన కథలు, కవితలు, పాటలు, చేసిన వినూత్న ప్రయోగాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, విద్యార్థుల విజయ గాథలకు ఇందులో ఎక్కువ ప్రాధాన్యతనిస్తామని వెల్లడించారు.

కొండపై కుప్పిగంతులు..!

- తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న యువత
- లైక్‌లు, సబ్‌స్క్రైబ్‌ల కోసం సినిమా పాటలతో రీల్స్



శ్రీవారి ఆలయం ముందు ఇటీవల రీల్స్ తీసిన యువతి




శ్రీవారి ఆలయం ముందు రీల్స్ చేస్తున్న యువకులు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లైక్‌లు, సబ్‌స్క్రైబ్‌లు, ఫాలోవర్ల కోసం కొందరు యువతీయువకులు కొండపై కుప్పిగంతులు వేస్తూ తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారు. తిరుమల, ఘాట్‌రోడ్లు, అలిపిరి వద్ద ఇష్టానుసారం సినిమా పాటలు, డైలాగ్‌లతో రీల్స్, షార్ట్స్, ప్రాంక్ వీడియోలు చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. తిరుమలలో రీల్స్, ఫొటోషూట్ చేస్తే కేసులు పెట్టడంతో పాటు కెమెరాలు సీజ్ చేస్తామని టీటీడీ హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు లెక్కచేయడం లేదు. తాజాగా ఓ యువతి అలిపిరి చెక్‌పాయింట్ ముందు 'పుష్ప2' చిత్రంలోని 'కిస్సిక్' పాటకు డ్యాన్స్ చేసి తన ఇన్‌స్టా పేజ్‌లో పోస్ట్ చేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. అలాగే.. కొందరు శ్రీవారి ఆలయం ముందు, నడక దారుల్లో డ్యాన్సులతో రీల్స్ చేస్తూ తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూనే ఉన్నారు. అలిపిరిలోని టూరిజం భవనం కూడా రీల్స్ చేసేవారికి అడ్డాగా మారిపోయింది. ఇకనైనా ఈ రీల్స్, షార్ట్స్ చేసే వారి విషయంలో టీటీడీ కఠిన చర్యలు తీసుకోకపోతే ఏడుకొండల ప్రతిష్ఠ మరింత దిగజారిపోయే అవకాశముందని భక్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

11, 12 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల సదస్సు షెడ్యూల్ మారింది. ఈ నెల 11, 12 తేదీల్లో అమరావతిలోని సచివాలయంలో రెండు రోజుల పాటు కలెక్టర్ల సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం తొలుత ఈ నెల 3, 4, ఆ తర్వాత 10, 11వ తేదీలను ప్రకటించింది. అయితే ఇప్పుడు మళ్లీ షెడ్యూల్ మార్చింది. 11, 12 తేదీల్లో సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో సదస్సులు నిర్వహించనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.



శ్రీవారి ఆలయంలో విజయేంద్ర సరస్వతితో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

గ్రామాల్లో ధర్మ ప్రచారం జరగాలి: విజయేంద్ర సరస్వతి

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని గ్రామగ్రామాన ధర్మ ప్రచారం జరగాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆకాంక్షించారు. ఆ దిశగా టీటీడీ కృషి చేస్తోందని చెప్పారు. ఆదివారం ఆయన తిరుమల శ్రీవారిని పెద్దమర్యాదతో దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దేశంలో ధర్మప్రచారానికి టీటీడీ ముఖ్య కేంద్రంగా ఉందన్నారు. తిరుమల పవిత్రంగా, స్వచ్ఛంగా ఉండేలా కూడా టీటీడీ నూతన బోర్డు ప్రయత్నాలు చేస్తోందని విజయేంద్ర సరస్వతి తెలిపారు. ధర్మప్రచారం సరైన రీతిలో జరిగితే వ్యవసాయం, వ్యాపారం అన్నీ బాగుంటాయన్నారు.

చికెన్, పొట్టేలు కోసి పెట్టాలా..?

- పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ప్రభుత్వంపై టీచర్ అశోక్‌రెడ్డి ఫైర్
- ఆయన వైఎస్ఆర్ ఉపాధ్యాయ సంఘం నాయకుడు
- అనంతపురం జిల్లాలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి



స్కూల్‌లో అశోక్‌కుమార్‌రెడ్డిని చుట్టుముట్టిన విద్యార్థులు, తల్లిదండ్రులు

అనంతపురం విద్య, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'పేరెంట్స్‌కు అన్నం పెట్టేకి రూ.పది వేలు ఇచ్చారా..? యా గవర్నమెంట్ ఇచ్చింది.? ఎంత ఇచ్చింది.. చెప్పండి. ఇచ్చిన రూ.3 వేలతో చికెన్, పొట్టేలు కోసి పెట్టాలా..?' అంటూ అనంతపురం జిల్లాకి చెందిన వైఎస్ఆర్ ఉపాధ్యాయ సంఘం (టీఏ) నాయకుడు, టీచర్ అశోక్‌కుమార్ రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వంపై నోటి దురుసు ప్రదర్శించారు. కూటమి సర్కారు శనివారం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేయగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనంతపురం రూరల్ మండలంలోని తాటిచెర్ల ఆదర్శ పాఠశాల ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అశోక్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయనతోపాటు మరో టీచర్ సరిగ్గా విధులకు రాకపోవడంపై గ్రామస్థులు, విద్యార్థులు ఆయనను ప్రశ్నించారు. నాడు-నేడు పనుల్లో అవినీతి, ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఇప్పటి వరకూ బిగించకపోవడంపైనా అసహనం వ్యక్తంచేశారు. ఇదే సమయంలో తరగతి గదిలో విద్యార్థులు మధ్యాహ్నమైనా ఇంత వరకు భోజనం పెట్టలేదనీ, తమ తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. అప్పటికే కూటమి సర్కారుపై అక్కసుతో ఉన్న అశోక్‌కుమార్‌రెడ్డి ఒక్కసారిగా రెచ్చిపోయారు. 'పేరెంట్స్‌కు అన్నం పెట్టేందుకు రూ.10 వేలు ఇచ్చారా..? యా గవర్నమెంట్ ఇచ్చింది.? ఎంత ఇచ్చింది చెప్పండి. ఆ హెడ్‌మాస్టర్‌ను పిల్చుకురాపోండి..? ఎంతిచ్చారో.. ఏమిచ్చారో.. పెద్ద కృష్ణన్లు వేస్తున్నారు. అన్నింటికీ కలిసి రూ.3 వేలు వేశారు. అది తీసుకొచ్చి ఇచ్చా. ఇంకా ఎక్కడన్నా ఎత్తుకొత్తారా..? ఏందో గవర్నమెంట్ నుంచి వచ్చిందంటా.. ఏం చికెన్లు, పొట్టేళ్లు కోసి పెడతారా.? అంతా ఓవరాక్షన్ చేస్తున్నారు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. అశోక్‌కుమార్ రెడ్డి కొంతకాలంగా పాఠశాలకు రాకుండా ఒక వలంటీర్‌తో చదువు చెప్పిస్తున్నారు. పీటీఎం సందర్భంగా పాఠశాలలో ఘర్షణ తలెత్తడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత భోజనాలు పెట్టారని తెలిసింది.

బొమ్మలు: అక్బర్

నజ్రుల్ విప్లవ ప్రేమతత్వం



"**నేను** ఆర్ఫియస్ (రాత్రి అంధకార దేవత) వేణువును. జ్వర పడిన ప్రపంచానికి నేను నిద్ర తెప్పిస్తాను. ఆయాసపడుతున్న నరక దేవాలయం భయంతో మరణించేలా చేస్తాను. నేను భూమికీ, ఆకాశానికీ విప్లవ సందేశం తెస్తాను. నేను సదా విద్రోహిని. నేను ఈ ప్రపంచానికతీతంగా శిరసు ఎత్తుతాను. చాల ఉన్నతంగా, ఒక్కణ్నే, స్థిరంగా." – కాజీ నజ్రుల్ ఇస్లాం 'విద్రోహి', 1922

భీమా కోరేగావ్ ఎల్గార్ పరిషత్ కేసులో రెండవ ఐదుగురు 28 ఆగస్టు 2018న అరెస్ట్ అయినప్పుడు రోమిలా థాపర్‌తో పాటు ఐదుగురు ప్రముఖులు, ఈ కేసు శోధించడానికి స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ వేయాలని, అందాకా అరెస్టయినవారికి బెయిల్ ఇవ్వాలని సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను 2-1 మెజారిటీతో నిరాకరిస్తూ మా హౌజ్ అరెస్టుకు మరేదయినా సముచితమైన న్యాయావకాశాలు వెతుక్కోమ్మని రెండు నెలల వ్యవధి యిచ్చిన పుడు, 'ఈ రెండు నెలలు ఇంటి నుంచి కదలలేరు కదా మా కోసం ఏదైనా పుస్తకం రాయండి' అని ఫోన్ మీద కోరింది గీతా రామస్వామి (హైదరాబాద్ బుక్ ట్రస్ట్ తరఫున). అపుడామె నాలుగు ప్రత్యామ్నాయాలు సూచించింది. వాటిలో రెండే స్పష్టంగా గుర్తున్నాయి. సుభాష్ చంద్రబోస్‌పై లేదా కాజీ నజ్రుల్ ఇస్లాంపై. నేను వెంటనే కాజీ నజ్రుల్ ఇస్లాంపై రాస్తానని ఒప్పుకున్నాను.

ఒక విద్రోహి కవిగా నజ్రుల్ ఇస్లాం గురించి ఎప్పుడు మొదటిసారి విన్నానో చెప్పలేను గానీ నక్సల్బరీతో పాటే అప్పటి తూర్పు పాకిస్తాన్‌గా ఉన్న బాంగ్లాలో కూడ ఆ ప్రభావంతో ఏర్పడిన ఎం.ఎల్. పార్టీ గురించి విన్నాను. ఆ పార్టీ బాంగ్లా విప్లవ సంప్రదాయానికి దోహదం చేసిన తొలి విప్లవ తత్వవేత్తలుగా మౌలానా భషానీ, కాజీ నజ్రుల్ ఇస్లాంలను గుర్తించడం విన్నాను.

1971లో బాంగ్లా జాతీయోద్యమాన్ని సృజన, విరసం తొలి దశలో (ముక్తి ఫౌజ్ ప్రవేశం దాకా) సమర్థించినప్పుడు సాహిత్య అకాడమీ ప్రచురించిన 'నజ్రుల్ ఇస్లాం జీవితం – సాహిత్యం' ఆధారంగా సృజనలో పరిచయం ప్రచురించాం. ఎస్.కె. సంపాదకత్వంలో వెలువడిన 'బాంగ్లాదేశ్‌లో మార్చింగ్ గీతం' కవితానువాదం ప్రచురించాం. నజ్రుల్ ఇస్లాంపై రాయడానికి ఒప్పుకోవడానికి ఆ నేపథ్యం ఉంది.

నేను పూణే ఎరవాడ జైలుకు పోయాక కవిత్వాను వాదం మొదలుపెట్టి, కరదీపికగా ఆమె ఇచ్చిన పీటర్ కస్టర్స్ నజ్రుల్‌పై ప్రసంగ వ్యాసాలు చదివాక – కమ్యూనిస్టు విప్లవకారుని నుంచి, విప్లవధార అంత స్రోతస్విని గానే ఉంటూ 1921 నుంచి 41 దాకా ఈ దేశం సంపూర్ణ స్వాతంత్ర్యం పొందాలంటే కార్మిక వర్గ రాజకీయ దృక్పథంతోపాటు హిందూ ముస్లిం మత సామరస్యం లక్ష్యాన్ని తీవ్రమైన వ్యగ్రతతో కాజీ నజ్రుల్ ఇస్లాం ఎంచుకున్నాడని అర్థమైంది.

అయనకన్నా ముందు ఈ అవసరాన్ని గాంధీ గుర్తించినా ఆయనకు కార్మిక వర్గ దృక్పథం లేదు. ఆయన చేపట్టిన సహాయ నిరాకరణోద్యమంతోపాటు ప్రపంచ రాజకీయాల్లో వచ్చిన ఒక కుదుపు వల్ల 'ఖిలాఫత్ ఉద్యమానికి మద్దతివ్వడంతో భారత స్వాతంత్ర్యోద్యమంలో హిందూ ముస్లింలు కలిసి పని చేసే అవకాశం వచ్చింది. కానీ గాంధీకి అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యంగా లేకపోవడం, సహాయ నిరాకరణకు అహింస అనే ఒక పరిమితి ఉండడం రెండూ నజ్రుల్ ఇస్లాంకు అసంతృప్తినే కలిగించాయి. 1926లో కృష్ణనగర్‌లో గాంధీ పాల్గొన్న జాతీయ కాంగ్రెస్ సభలో నజ్రుల్ 'కంధహారీ హోషియార్' (కర్ణధారీ జాగ్రత్త) కవిత ద్వారా అసంతృప్తినే చూపాడు.

నజ్రుల్ దేశ స్వాతంత్ర్యం కోసం కలగని అందుకు సైనిక శిక్షణ పొందడానికి 18ఏళ్ల వయసు లోనే సైన్యంలో చేరి కరాచీ పోయాడు. అక్కడ కవిగా మారి, 1917 రష్యాలో బోల్షివిక్ విప్లవ ప్రభావంతో ఉద్యోగం వదిలి, ముజఫర్ అలీ ఆహ్వానంతో కలకత్తా వచ్చి అక్కడే పూర్తి కాలం సాహిత్య రాజకీయోద్యమానికి అంకితమయ్యాడు. అప్పటికింకా పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ గానే పని చేస్తున్న కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడై ఆ పార్టీ కోసం ముజఫర్ అలీ స్థాపించిన 'లంగల్' పత్రికకు సంపాదకుడయ్యాడు. ఇప్పుడు అస్సాంలోని బ్రాహ్మణీయ హిందుత్వ రాజకీయాలు ఈసడింపుగా పిలిచే 'మియా' కవిత్వోద్యమం ఈ లంగల్ (నాగలి)ని, లుంగీని తమ అస్తిత్వ చిహ్నాలుగా ఎంచుకుంది.

ఇంక 'విద్రోహి' కవితతో, 'ధూమకేతు' పత్రికతో నజ్రుల్ బాంగ్లా సాహిత్యాకాశంలోనే కాదు, రాజకీయ భూమికలో కూడ ఒక రాజీలేని 'విద్రోహి' సంప్రదాయానికి ప్రతీక అయ్యాడు.

నజ్రుల్ 5, 6 ఏళ్ల వయసప్పుడే బ్రిటిష్ పాలకులు 1905 బాంగ్లా విభజనకు పూనుకున్నారు. ఈ దేశప్రజలను, ప్రజల ఆయువుపట్టయిన రైతాంగాన్ని హిందూ ముస్లింలుగా చీల్చే కుట్రలో 1857లో చేసిన ఒక ప్రయత్నమే మళ్లీ బాంగ్లాలో చేసారు. మొదటి ప్రయత్నంలో బ్రిటిష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బహదూర్ షా నాయకత్వంలో ఏర్పడిన విశాల ఐక్యసంఘటనను ఓడించి సంస్థానాలను, ఫ్యూడల్ శక్తులను తమకు తాబేదార్లుగా మార్చుకున్నారు గానీ, బ్రిటిషిండియా ఏర్పడి బాంగ్లా రైతాంగాన్ని హిందూ ముస్లింలుగా చీల్చాలన్న కుట్ర మాత్రం విఫలమైంది. దేశ విభజనలో అది సాధ్యమైనా, బాంగ్లా జాతీయ భావన తూర్పు పాకిస్తాన్ ఏర్పడినా అంతర్గతంగా కొనసాగుతూనే ఉన్నది. అందుకు ముఖ్య కారణం 'యుగంతర్' కాలం నుంచి బాంగ్లాలో ఉన్న విప్లవ సంప్రదాయమే. అది తెభాగా, చిటగాంగ్ పోరాటాల్లో నిప్పురవ్వలు ఎగజిమ్మి నాయకత్వ వైఫల్యంతో అణగారి పోయినా మళ్లీ నక్సల్బరీతో స్పష్టమైన రూపాన్ని తీసుకున్నది. అందుకే తెలంగాణలో 1948లో సైనిక జోక్యం వలె బాంగ్లాదేశ్ జాతి విముక్తి పోరాటాన్ని 'ముక్తిఫౌజ్' ప్రధాన స్రవంతి (బూర్జువా) రాజకీయాల్లోకి మళ్లించింది పొరుగు దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ. అయితే ఈ కాలమంతా రవీంద్రుని 'సోనార్ బంగ్లా' వలెనే, నజ్రుల్ ఇస్లాం 'విద్రోహి' భావజాలం బాంగ్లా సాహిత్య, సాంస్కృతిక రంగాలపై తమ ప్రభావాన్ని కొనసాగించాయి. భౌతికంగా నజ్రుల్ 'క్విట్ ఇండియా' ఉద్యమానికన్నా ముందే మాట పడిపోయి, మతిస్థిమితం కోల్పోయిన స్థితిలోకి వెళ్లినప్పటికీ.

చివరకొక ఆవేదన వంటి ఫిర్యాదుతో నజ్రుల్ ఇస్లాంకు మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో దక్కవలసిన స్థానం గురించి ప్రస్తావిస్తాను.

వచనం కన్నా కూడా శ్రవణ సంగీతంతో ఉత్తేజపరిచే నజ్రుల్ బాంగ్లా కవిత్వం ఇంగ్లీషు నుంచి తెలుగులోకి వచ్చినపుడు ఎంత మౌలికత కోల్పోతుందో 'ప్రళయోల్లాస్' వంటి కవితను అనువదించినపుడు నాకే అనిపించింది. అయినా ఒక సాహసం చేసాను. నజ్రుల్ నుంచి నేను నేర్చుకున్న విప్లవ ప్రేమతత్వం నాలో ఎంత జీర్ణమైందో పాఠకులకు ఎంత అందివ్వగలుగుతున్నానో కాలానికి వదిలేస్తాను.



మతసామరస్యం కోసం ఆయన సాహిత్యం, సంగీతం, రాజకీయాల్లో చేసిన కృషి రవీంద్రుడికీ, గాంధీకీ తీసిపోనిది. మతసామరస్యం కోసం ఆయన ద్వేషం స్థానంలో ప్రేమను నిలపాలని ఎన్నో ప్రయోగాలు చేశాడు. ఈ ప్రేమతత్వాన్ని స్థాపించడంలో రూమీ, హఫీజ్‌ల నుంచి, కశ్మీరీ సూఫీ కవిత్వం నుంచి తనకన్నా ముందున్న బాంగ్లా సూఫీ కవుల దాకా అందరినీ ఆకళింపు చేసుకొని బాంగ్లా భక్తి ఉద్యమంలోని సారాన్నంతా గ్రహించి చివరకు వేణువు విరిగిపోయినా పాట ఆగకూడదనే సందేశంతో ఒక ప్రేమభావనతో తన వ్యక్తినే రద్దు చేసుకున్నాడు.

వచనం కన్నా కూడా శ్రవణ సంగీతంతో ఉత్తేజపరిచే నజ్రుల్ బాంగ్లా కవిత్వం ఇంగ్లీషు నుంచి తెలుగులోకి వచ్చినపుడు ఎంత మౌలికత కోల్పోతుందో 'ప్రళయోల్లాస్' వంటి కవితను అనువదించినపుడు నాకే అనిపించింది. అయినా ఒక సాహసం చేసాను. నజ్రుల్ నుంచి నేను నేర్చుకున్న విప్లవ ప్రేమతత్వం నాలో ఎంత జీర్ణమైందో పాఠకులకు ఎంత అందివ్వగలుగుతున్నానో కాలానికి వదిలేస్తాను.

■ **వరవరరావు**

(కాజీ నజ్రుల్ ఇస్లాం సాహిత్యం నుంచి ఎంపిక చేసిన కవితలను, వ్యాసాలను వరవరరావు అనువదిస్తే ఆ పుస్తకాన్ని 'విద్రోహి' పేరుతో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ అచ్చు వేసింది. ఈ సందర్భంగా ఈ పుస్తకానికి వరవరరావు రాసిన ముందుమాట నుంచి ఎంపిక చేసిన భాగమిది.)



I'll call you later

సరే
తర్వాతే మాట్లాడుకుందాం
ఈ క్షణం నిర్జీవమైందే

చేతులు ఖాళీగా ఉండి ఉండవు
చుట్టూ జతగాళ్ళు మూగి ఉంటారు
రెండుకాళ్ళపై నిలబెట్టే పని
జీవితాన్నంతా నంజుకు తినేస్తూంటుంది

ఆకలి–
రోజూ టైముకు రాని రైలు బండి
నిద్ర–
నీటిలో కన్నార్పని చేపపిల్ల
ఆశల బహు సుందరమైన దినచర్య–
పులి నోట్లో మెలిపడ్డ బెదురుజింక

చవిచూసేందుకో
రవ్వంత బ్రతుకుతీపి కావాలిప్పుడు

నిజమే
అస్సలు తీరిక లేదు
ఇనుప చువ్వలపై పాకే మనీ ప్లాంట్ తీగ
నాజూగ్గా అల్లుకుంటున్న పక్షుల తావు
ఎప్పటిదో చాలా పాత ఉత్తరం
ఇవన్నీ పేరు చెప్పలేని ప్రేమ పాశాలు
ఎన్నో ఊర్లు తిరిగొచ్చాక తీరే
ఇంటి బెంగ వర్ణించేది కాదు
ఊసుల్ని దోసిలి పట్టలేం

మొబైల్ నంబర్లో అంకెలన్నింటికీ
ఎదురుచూపు అలసట తెలుసు
ఉండబట్టలేకే అవి
మళ్ళీ మళ్ళీ గుండె సవ్వళ్లై
మోగుతాయి

పోనీలే ఏం పర్వాలేదు
కలబోసుకుంటే కడుపు నిండుతుంది

కన్నీళ్ళలోంచి ఒంటరితనం ఒడ్డున పడుతుంది
ఉప్పుసముద్రం రుచిదేలి
ఇసుకలోని గవ్వలన్నీ
పలుకు నేర్చిన చిలుకలవుతాయి

కలవడం-విడిపోవడం
బొమ్మాబొరుసులయ్యాక
ఆదుర్దానే అసలు దిగులు
మాటలు చాలని మాటలుండిపోతాయ్
అక్కరపడి మాట్లాడ్డమే అబ్బురపు పని

వశపడది గానీ,
జర అయినంకే, మనసు కొమ్మకు
తంగేడు పువ్వుల ముదుపు గట్టు
అంతే, అంతకు మించింకేం లేదు

■ **శ్రీరామ్ పుప్పాల**
✆ 99634 82597

స్థానికతే మా బడి పిల్లల కవిత్వ వస్తువు

తగుళ్ళ గోపాల్





అజిలాపూర్ బడిలో మీరు చదువు చెప్పే పిల్లల చేత కవిత్వం రాయించి, ఆ కవితల్ని 'దేవగన్నేరు' పేరుతో పుస్తకంగా వేశారు. బడి పిల్లల్ని కవిత్వ వ్యక్తీకరణ వైపు మళ్ళించటం సులువైందా, కష్టమైందా?

బడిపిల్లలతో, అందులోను ప్రైమరీ స్కూల్ పిల్లలతో కవిత్వం రాయించడం కొంచెం కష్టమైనదే. నేను అజిలాపూర్ బడి లోనే పన్నెండేళ్ళు పని చేయడం వలన ఇది సాధ్యమైంది. మొదట తప్పులు లేకుండా తెలుగు రాయడం, బాలగేయాలు నేర్పించడం, ఏడవ తరగతికి వచ్చేవరకు వంద పద్యాలు నేర్పించడం చేశాను. దీని ద్వారా ఊర్లో కూడా 'బడిలో బాగా చదువు చెబుతున్నారు, మా పిల్లలను ప్రభుత్వ బడికే పంపాలీ' అన్న చైతన్యం వచ్చింది. పిల్లల చేత కవితలు రాయించాలని అనుకున్నపుడు 'కవిసంగమం' ఫేస్‌బుక్ గ్రూప్‌లో విమర్శకుడు జి. లక్ష్మీనరసయ్య సార్ చెప్పిన కవిత్వ నిర్మాణ విషయాలను పిల్లలకు చెప్పేవాడిని. ఒక మాములు విషయాన్ని ఎట్లా కవిత్వం చేయాలో అనేక ఉదాహరణలతో సందర్భం వచ్చినపుడల్లా చెప్తుండేవాడిని.

"పంట చూస్తే/ పచ్చగానే ఉంది.

ఆ పంట వేసిన రైతు చేతులే/ ఎందుకో ఏడుస్తున్నాయి." – అని కాలె యశ్వంత్ లాంటి పిల్లలు ప్రాసను దాటి కవితలు రాసిన కవిత్వాన్ని ఎక్కువగా వినిపించేవాడిని. ఏదైనా ఒక అంశం ఇచ్చి, వాళ్ళు ఏమనుకుంటున్నారో రాయమని చెప్పి, వాళ్ళ ముందటనే సరిచేసి, 'ఇలా కూడా ఊహ చేయొచ్చు' అనే దానిని బలంగా చెప్పగలిగినాను. ఇది ఒక రోజులో అయ్యే పని కాదు. దీని వెనుక ఆరేడేండ్ల శ్రమ ఉంది. ప్రధానోపాధ్యాయులు డేవిడ్ రాజు, అలివేలు, పూలమ్మ, శ్రీనివాసులు, కట్ట జంగయ్య... ఇంకా ఇక్కడ పని చేసిన టీచర్లందరి సహకారం లేనిది ఈ పుస్తకం లేదు.

పిల్లలు తమ కవిత్వంలో ఎలాంటి ఇతివృత్తాల వైపు ఎక్కువ మొగ్గు చూపటం గమనించారు?

అమ్మ, నాయిన, రైతు, వాన, గురువులు, పల్లె – ఇదే మా దేవగన్నేరుల ప్రపంచం. అమ్మ ప్రేమ దగ్గరనే ఆగిపోలేదు. ఆడపిల్లలను కడుపులనే చిదిమేస్తున్న సమాజాన్ని చూసి దుఃఖపడ్డారు. ప్రశ్నగా నిలబడ్డారు. రైతు గొప్పతనాన్ని వర్ణించడమే కాదు, అన్నం మెతుకు మీద రైతు బొమ్మను కలగంటున్నారు. అజిలాపురంలో తాటిచెట్ల మధ్య నుంచి సూర్యుడు ఉదయిస్తాడు. గౌడన్నలు మోకుముస్తాదు విడిచినంకనే పొద్దు గూట్లో పడుతుంది. ఇక్కడి స్థానికతే మా బడి పిల్లలకు కవిత్వ వస్తువు.

3? మూడు ప్రశ్నలు

ఈ మొత్తం పనిలో మీకు గుర్తుండిపోయే అంశాలు...

అజిలాపూర్ బడిలో ఏ విద్యార్థిని కదిపినా కవితలు అలవోకగా చెబుతూంటారు. మూడవ తరగతిలో ఉన్నప్పుడే కేశమోని అక్షిత, మహమ్మద్ సోను కవితలు రాయడం నా లోపల ధైర్యం నింపింది. బడిని చూడడానికి వచ్చిన అతిథుల, పిల్లల తల్లి తండ్రుల కళ్ళలో మెరుపును చూసిన ప్రతి క్షణం గుర్తుండిపోయేదే. కవి యాకూబ్, ఎస్.సి.ఈ.ఆర్.టి సంచాలకులు గాజర్ల రమేశ్ గార్లు మా బడి పిల్లల కవితలు విని మెచ్చుకోవడం ఎప్పటికీ మరిచిపోలేని క్షణాలు.

ఈ 'దేవగన్నేరు' మా నాగర్ కర్నూల్ జిల్లాలోనే ప్రాథమిక పాఠశాల నుంచి వస్తున్న మొదటి కవిత్వ సంకలనం కావడం చాలా ఆనందం. ఊరి వాళ్ళంతా కలిసి దాదాపు యాభై వేల ఖర్చుతో ఊరి పండుగగా 'దేవగన్నేరు' ఆవిష్కరణ సభ గొప్పగా జరిపారు.

✆ 95050 56316



అపురూపం

ఉండాల్సిన దృష్టి ఉండాలే గానీ
సృష్టిలో ఏ మనిషైనా సౌందర్య శిల్పమే
మానవ దేహ నిర్మాణమే
జవ జవలాడే జీవకణజాలం

ఎర్రటి బొగ్గుల మీద చక చకా
కంకులు కాల్చి ఆకలి తీర్చుతున్న
ఆమె నుదురు మీది తడి తడి స్వేదం
మనోహరమై మెరుస్తున్న ప్రతిబింబం

ఒక చేత్తో విసురుతున్న విసనకర్ర
మరొక చేత్తో నిప్పుల మీద మర్లేస్తున్న కంకి
అంటుకున్న బొగ్గుల వేడి విస్తరించి

చిప్పిరి చిప్పిరైన తల వెంట్రుకల మీదా
చెమట పట్టిన చామనఛాయ ముఖమ్మీదా
ఎగిరి పడుతున్న తెల్లని బూడిద నుసి
వెండి పువ్వుల నవ్వుల్లా మెరుస్తున్నాయి

రగ రగ బొగ్గుల మీద బొర్లిచ్చిన
మక్కుంకిని చేతికందిస్తూ నవ్విన నల్లని నవ్వు
సహజ సుందర ఫోటోజెనిక్ సొగసు

ఆమె పెదవులకు లిప్‌స్టిక్ పూతా లేదు
ఆమె చెక్కిళ్లకూ పౌడర్ దట్టించిన దాఖలా లేదు
కనుబొమ్మల కత్తిరింపులూ కనపడలేదు
శ్రమించే చలాకీ రూపమే అపురూప సౌందర్యం.

■ **అన్నవరం దేవేందర్**
✆ 94407 63479

త్రిపురనేని శ్రీనివాస్ నాలుగు పేజీల ఉత్తరంతో నన్ను ఒప్పించాడు

నా మొదటి పుస్తకం

గాలి నాసరరెడ్డి

ఏప్రిల్ 1990. ఒకరోజు శివారెడ్డిగారు నా చేతికి ఒక ఉత్తరం ఇచ్చారు. అది ఆయనకు త్రిపురనేని శ్రీనివాస్ రాసిన ఉత్తరం. అందులో శ్రీనివాస్ నా ఆచూకీ అడుగుతూ, నా కవితలు పద్నాలుగింటిని ఒక బుక్‌లెట్‌గా వేయాలని అనుకుంటున్నట్టుగా రాశాడు. "అతను నాకు చిక్కకపోయినా నా అంతట నేనే నిర్ణయం తీసుకుని బుక్‌లెట్ వేసేద్దామని అనుకుంటున్నాను" అని కూడా రాశాడు. శ్రీనివాస్ అంతకుముందే 'క్రితం తర్వాత' అనే సంయుక్త కవితను బుక్‌లెట్‌గా ప్రచురించాడు. అది పొడుగ్గా odd size లో ఉంటుంది. శ్రీనివాస్ నాకు ప్రియ మిత్రుడే కానీ నా పుస్తకం ఎలా వేస్తాడో అనే సందేహంతో వద్దని ఉత్తరం రాశాను. అప్పుడు శ్రీనివాస్ "నీ కవిత్వాన్ని అచ్చువేద్దామని నాకు ఎంతగానో అనిపించింది. ఇప్పటికీ అనిపిస్తోంది. నీ కవిత్వం అంటే నాకిష్టం. ప్రేమ" అంటూ నాలుగు పేజీల పెద్ద ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం చదివాక ఒప్పుకోకుండా ఉండలేకపోయాను. శ్రీనివాస్‌కి కొన్ని కవితలూ, కొన్ని హైకూలూ పంపాను. 'స్వాప్నికమేఘం' అనిగానీ, కవితల సంఖ్యతో గానీ పేరు పెడదామని రాశాను. తర్వాత విజయవాడ వెళ్లి రెండు మూడు రోజులు ఉన్నాను. కవితల సంఖ్యతో పేరు పెట్టడానికే శ్రీనివాస్ ఇష్టపడ్డాడు. '19 కవితలు' అని పుస్తకానికి పేరు పెట్టాలనుకున్నాం. నిజానికి '19 కవితలు' పుస్తకంలో 19 కవితలతో పాటు 5 హైకూలు కూడా ఉన్నాయి. ముఖచిత్రం ఎలా ఉండాలో నేనే చెప్పాను. ఆ విధంగానే టి.వి. ప్రసాద్ చేత ముఖచిత్రం వేయించాడు శ్రీనివాస్.

'19 కవితలు' పుస్తకం 1990 జూన్‌లో విజయవాడలో శ్రీకృష్ణా ప్రింటర్స్‌లో అచ్చయింది. శ్రీనివాస్ కొన్ని కాపీలు మా ఊరికి పంపించాడు. అయితే అప్పుడు నేను హైదరాబాదులో ఉన్నాను. ఒక సభలో నేను దగ్గరికి వెళ్లగానే కె.కె. రంగనాథాచార్యులుగారు "నీ పుస్తకం చదివాను. చాలా కాలం తర్వాత హాయిగా కవిత్వం చదువుకున్నానని పించింది" అన్నారు. అదే ఆ పుస్తకానికి నేను పొందిన తొలి ప్రశంస. అప్పటికి ఇంకా నేను పుస్తకం చూడనే లేదు. తర్వాత 'ఉదయం' పత్రికాఫీసుకు వెళ్లి కూచిమంచి ఉదయ్ దగ్గర చూశాను. పుస్తకం ఎంతో అందంగా కనిపించింది. ఆ తర్వాత నా కాపీలు నాకు అందాక, ముందుగా నా చిన్నచెల్లెలు మాధవీలతకు ఒక కాపీ పోస్టులో పంపాను.



'19 కవితలు' పుస్తకానికి నేను ఊహించని ప్రశంస లభించింది. తల్లావజ్ఝల శివాజీ, వాడ్రేవు చినవీరభద్రుడు సమీక్షలు ఎంత బాగా రాశారో! చేకూరి రామారావు 'చేరాతలు'లో పెద్ద వ్యాసం రాశారు. ఆరుద్ర, శేషేంద్ర, ఇస్మాయిల్ ప్రభృతులు అభినందిస్తూ ఉత్తరాలు రాశారు.

ఇటీవల 2020లో పసునూరు శ్రీధర్‌బాబు '19 కవితలు' గురించి రాసిన వ్యాసం లోని మాటలు ఇవి: "త్రిపురనేని శ్రీనివాస్ ప్రారంభించిన కవిత్వం ప్రచురణల్లో మూడో పుస్తకంగా 1990లో అచ్చయిన ఈ పుస్తకం అప్పట్లో ఒక సెన్సేషన్. గాలి నాసరరెడ్డి అంటే అప్పటికే ఏర్పడిన ఇష్టంతో ఈ పుస్తకాన్ని ప్రేమగా చేతుల్లోకి తీసుకున్నాను. ఆ ఇరవై పేజీల పుస్తకాన్ని అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ ఎన్నిసార్లు చదివానో! శ్రీశ్రీ 'మహాప్రస్థానం' చదివాక తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' చదవకుండా ఉంటే ఏమైపోయే వాడినో కవిత్వంలో అనిపిస్తుంది ఇప్పటికీ నాకు. అలాగే, ఎనభైల తరువాత వచ్చిన ఆధునిక కవిత్వంలో ఈ '19 కవితలు' నా జీవితంలోకి రాకుంటే ఎలా ఉండేదో అన్న ప్రశ్న కూడా నన్ను వెంటాడుతుంటుంది."

'పడమటి' గాలిపై వ్యాసాల సంపుటి

పాటిబండ్ల ఆనందరావు రచన 'పడమటి గాలి' (సంక్షిప్త) నాటక ప్రదర్శన సందర్భంగా 'పడమటి గాలి'పై జన సాహితి అధ్యక్షులు దివి కుమార్ రాసిన వ్యాసాల సంపుటి ఆవిష్కరణ డిసెంబర్ 10 సా.6:30 గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్, అన్నమయ్య కళావేదికలో జరుగుతుంది. ఆవిష్కర్త కందిమళ్ళ సాంబశివరావు (నాటక రంగ పరిశోధకులు).

జనసాహితి

'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' కవిత్వ సంపుటి

కుందుర్తి కవిత రాసిన కవిత్వ సంపుటి 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్'తో పాటు ఫ్రీవర్స్ ఫ్రంట్ వాట్సాప్ సమూహం పోటీ కవితల సంకలనం 'ఆనవాళ్ళు' పుస్తకాల ఆవిష్కరణ డిసెంబరు 14న రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో శివారెడ్డి, శిఖామణి, శీలా సుభద్రాదేవి, అనిల్ డ్యానీ, శ్రీరామ్, సమత పాల్గొంటారు.

ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రచురణలు

రాయలసీమ మహాకవిసమ్మేళనం


రాయలసీమ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ మహాకవిసమ్మేళనం డిసెంబరు 15 తేదీన అనంతపురం లోని యస్.యస్.బి.యన్ కాలేజి ఆడిటోరియంలో జరుగుతుంది. రాయలసీమ ప్రముఖులపై 140 మంది కవులు కవితాగానం చేస్తారు. తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి, మెట్టుపల్లె సుదర్శనరెడ్డిల స్మారకంగా ఈ కార్యక్రమం జరుగుతున్నది. వివరాలకు: 99639 17187.

అప్పిరెడ్డి హరినాథరెడ్డి

ఉమ్మడిశెట్టి అవార్డు 2024

37వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు – 2024 కోసం కవుల నుండి కవితా సంపుటాలు ఆహ్వానిస్తున్నాము. 2024లో ప్రచురింప బడిన కవితా సంపుటాలు నాలుగు ప్రతులను జనవరి 10, 2025లోగా ఈ చిరునామాకు పంపాలి: రాధేయ, చైర్మన్, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్, 13-1-606-1, షిర్డీ నగర్, రెవిన్యూ కాలనీ, అనంతపురం – 515001, ఫోన్: 9985171411. అవార్డు విజేతకు రూ.ఆరువేల నగదు, షీల్డ్ తో సత్కారం ఉంటుంది.

రాధేయ



మల్లవల్లిలో కామన్ సైట్ రగడ

మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్ కామన్ సైట్ విషయమై మల్లవల్లి గ్రామస్తులు, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం చిలిచిలికి గాలీవానగా మారింది. వందెకరాల కామన్‌సైట్‌ను జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకోవటానికి ఆదివారం చేసిన ప్రయత్నాలను మల్లవల్లి గ్రామస్తులు అడ్డుకుని తీవ్రంగా ప్రతిఘటించారు. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఆర్డీవో దూకుడుగా వ్యవహరించటంతో మల్లవల్లి గ్రామస్తులు ఆగ్రహంతో రగిలిపోతూ ఆయన్ను చుట్టుముట్టారు. దీంతో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గ్రామస్తులతో చర్చించారు. చర్చలు విఫలం కావడంతో మల్లవల్లి గ్రామం తరఫున ఒక కమిటీ ఏర్పడితే చర్చించటానికి కలెక్టర్ ఆసక్తి చూపారు. రైతుల ప్రతిఘటనతో తాత్కాలికంగా కామన్‌సైట్ స్వాధీనం వాయిదా పడింది.



గుడివాడ ఆర్డీవో సుబ్రహ్మణ్యాన్ని చుట్టుముట్టిన మల్లవల్లి గ్రామస్తులు

వంద ఎకరాల కామన్ సైట్ స్వాధీనానికి రెవెన్యూ అధికారుల యత్నం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ హనుమాన్‌జంక్షన్ రూరల్) : మల్లవల్లిలో మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం రెవెన్యూ ఫారెస్ట్ (అడవి పోరంబోకు)గా ఉన్న 1300 ఎకరాల భూములను గత టీడీపీ ప్రభుత్వం హయాంలో సేకరించారు. ఈ భూములను సేకరించే క్రమంలో మల్లవల్లి గ్రామస్తుల కోసం కామన్‌సైట్‌గా 100 ఎకరాలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 1200 ఎకరాలను మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌కు కేటాయించారు. మల్లవల్లి గ్రామస్తులకు ఇచ్చిన కామన్‌సైట్‌కు ఆ తర్వాత ఫెన్సింగ్ వేశారు. అప్పట్లో మౌఖికంగా ఏపీఐఐసీ అధికారులు ఈ కామన్‌సైట్‌ను మల్లవల్లి గ్రామస్తులకు కేటాయించినట్టు చెప్పారు. దీంతో అప్పటి నుంచి మల్లవల్లి గ్రామస్తులు ఈ కామన్‌సైట్‌కు కాపలాదారుడిని పెట్టుకుని సంరక్షించుకుంటున్నారు.

వైసీపీ హయాంలో కబ్జాకు యత్నం

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ 100 ఎకరాల కామన్‌సైట్‌ను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరగ్గా మల్లవల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో రూటు మార్చి ఇళ్ల స్థలాలు ఇస్తామని లే అవుట్ వేశారు. లే అవుట్ అయితే వేశారు కానీ ఇళ్ల పట్టాలు కానీ, ఇళ్లు కానీ మంజూరు చేయలేదు. ఇళ్ల స్థలాల పేరుతో కామన్ సైట్ కబ్జా కాకుండా మల్లవల్లి గ్రామస్తులు అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఈ క్రమంలో కామన్‌సైట్‌పై ఏపీఐఐసీ అధికారుల కన్ను పడింది. పారిశ్రామి కవేత్తలకు కేటాయింపులు చేయటానికి ఈ కామన్‌సైట్‌ను ఎంచుకున్నారు. వాస్తవానికి మల్లవల్లి రెవెన్యూ ఫారెస్ట్ కింద మరో 1500 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. అటు వైపు వెళ్లకుండా ఏపీఐఐసీ అధికారులు కామన్‌సైట్ పైనే దృష్టి సారించారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం, జిల్లా యంత్రాంగం కూడా మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌నే టార్గెట్ చేయటంతో మల్లవల్లి గ్రామస్తులు ప్రతిఘటిస్తూ వస్తున్నారు.

ఊరంతా కదిలొచ్చి ఆందోళన.. తీవ్రంగా ప్రతిఘటన

- దూకుడుగా వ్యవహరించిన ఆర్డీవో సుబ్రహ్మణ్యం
- ఆయన్ను చుట్టుముట్టి నిరసనాగ్రహం తెలిపిన గ్రామస్తులు
- తహసీల్దార్ కార్యాలయం నుంచి వీసీలో రైతులతో కలెక్టర్ చర్చలు
- గ్రామ కమిటీ ఏర్పడితే చర్చలను ముందుకు తీసుకెళ్దామని సూచన
- తాత్కాలికంగా స్వాధీనం ఆపిన జిల్లా యంత్రాంగం

పతాక స్థాయికి వివాదం

కామన్‌సైట్ వివాదం పతాక స్థాయికి చేరింది. కామన్‌సైట్‌ను ఎట్టి పరిస్థితుల్లో తీసుకుంటామని జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఒకవైపు.. మమ్మల్ని కాదని తీసుకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని మల్లవల్లి గ్రామస్తులు మరోవైపు మొహరించటంతో ఆదివారం మల్లవల్లి పారిశ్రామికవాడ రణరంగాన్ని తలపించింది. కామన్‌సైట్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు చేసిన ప్రయత్నాలను మల్లవల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. గుడివాడ ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో రైతులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఆయన కరాఖండిగా ఆ స్థలం తమదేనని, కామన్‌సైట్ కోసం వేరేచోట ప్రత్యామ్నాయంగా ఇవ్వటం జరుగుతుందని చెప్పటంతో చుట్టుముట్టారు. కామన్‌సైట్ గురించి ఈ రోజు కొత్త పల్లవి ఎత్త వద్దని తమను అన్యాయం చేసే విధంగా వ్యవహరించవద్దని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవో, మల్లవల్లి గ్రామస్తుల మధ్యన సుమారు పావు గంట పాటు మాటల యుద్ధమే జరిగింది. దీంతో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడారు. ఈ చర్చలు విఫలం కావడంతో మల్లవల్లి గ్రామం తరఫున ఒక కమిటీ ఏర్పడితే చర్చించటానికి కలెక్టర్ ఆసక్తి చూపారు. రైతుల ప్రతిఘటనతో తాత్కాలికంగా కామన్‌సైట్ స్వాధీనం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో మల్లవల్లి సందర్శనకు రావాల్సిన కలెక్టర్ బాలాజీ అర్ధంతరంగా పర్యటన రద్దు చేసుకున్నారు.

సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం



మల్లవల్లికి 13 ఏళ్లు సర్పంచ్‌గా పనిచేశా. జీవో నెం 456 ప్రకారం 2016లో 1,460 ఎకరాల్లో పారిశ్రామికవాడకు 1,360 ఎకరాలు, గ్రామ అవసరాలకు 100 ఎకరాలు కేటాయించారు. ఆ భూమిని విడగొట్టి ఫెన్సింగ్ కూడా వేయించాం. ఇప్పుడు మళ్లీ అది ప్రభుత్వ భూమి అనడం సరికాదు. గ్రామ అవసరాలకు కేటాయించిన భూమిని వదిలే ప్రసక్తేలేదు. ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తాం.

– యనమదల వెంకయ్యరావు, మాజీ సర్పంచ్, టీడీపీ అధ్యక్షుడు

ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు



పంచాయతీకి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ అవసరాలకు కేటాయించిన భూమిని ఏపీఐఐసీకి ఎలా కేటాయించారో అర్థం కావడంలేదు. గ్రామానికి కేటాయించిన భూమిలో హైస్కూల్ నిర్మాణం కూడా జరుగుతోంది.. గ్రామావసరాలకు కేటయించిన భూమిని గ్రామ పంచాయితీకి ఎటువంటి సమాచారంగానీ, నోటీసు గానీ ఇవ్వకుండా ఏపీఐఐసీకి కేటాయించడంలో రెవిన్యూశాఖ ఏదో మతలబు జరిగిందనిపిస్తోంది.

– కట్టుబోయిన నాగమణి, సర్పంచ్, మల్లవల్లి




ఎక్స్‌కవేటర్‌తో తవ్వేసిన వంతెన

పురాతన సాగునీటి వంతెన కూల్చివేత

ఇరిగేషన్ స్థలం ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు, ఇరిగేషన్ సిబ్బంది



పురాతన వంతెన

తోట్లవల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుపాలెం వద్ద కృష్ణానది కరకట్ట పక్కన ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాన్ని కబ్జా చేసేందుకు ఓ వ్యక్తి అతి పురాతన సాగునీటి వంతెనను సగం కూల్చేశాడు. సెలవు దినమైన ఆదివారం ఎక్స్‌కవేటర్ తెచ్చి ఈ పురాతన వంతెనను పడగొడుతున్న సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు చెన్నుపాటి శ్రీధర్, కొనకాల వాసు, ఆచంట నాగసతీష్ తదితరులు వచ్చి అడ్డుకుని ఇరిగేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. గ్రామస్తుల రాకతో ఎక్సకవేటర్ డ్రైవర్ పలాయనం సాగించటంతో ఘటనా స్థలం నుంచి బయటకు వెళ్లకుండా నిలిపివేశారు. ఆ తరువాత ఇరిగేషన్ సిబ్బంది రహంతుల్లా, వి.నాగరాజు, ఎల్.శ్రీనివాసరావు వచ్చి ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆర్సీ జేఈ జనార్ధన్ వచ్చి ధ్వంసమైన వంతెనను పరిశీలించారు.

వంతెనను తొలగించి పొలంలో కలిపేందుకు..

1935కు పూర్వం కృష్ణానది నుంచి వల్లూరుపాలెం పక్కగా ఆగాకోడు చానల్ ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాలకు సాగునీటిని అందించేవారని పెద్దలు, ఇరిగేషన్ సిబ్బంది చెప్పారు. అప్పుడు నదిలో నుంచి వంతెన ద్వారా నీరు ప్రవహిస్తుండగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు దానిపై రహదారి కూడా నిర్మించారని, 1935లో కేఈబీ కెనాల్ తవ్విన తరువాత దీని ప్రాధాన్యత తగ్గిపోయిందని అన్నారు. ఈ వంతెన చుట్టూ పలువురు రైతులకు పట్టా భూములున్నాయి. విజయవాడకు చెందిన ఓ వ్యక్తి ఇక్కడ పొలం కొనుగోలు చేసి ఈ అతి అపురాతన వంతెనను తొలగించి పొలంలో కలిపేందుకు ఈ దారుణానికి ఒడిగట్టాడని గ్రామస్తులు చెపుతున్నారు. ఆర్సీ ఈఈ, డీఈ సోమవారం వచ్చి పరిశీలించే అవకాశం ఉందని తెలిసింది. ఉన్నతాధికారులు పరిశీలించి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.



సంగీత నీరాజనం.. పులకించిన కృష్ణాతీరం!

- వీనులవిందుగా కృష్ణవేణి సంగీత నీరాజనం

6లో


ఎక్సైజ్‌లో వసూల్ రాజా!



నెలకు రూ.అర కోటి జేబులో పడాల్సిందే!

- ఎక్సైజ్ శాఖ మంత్రి ఇలాకాలోనే వసూళ్లు..
- ఎన్‌ఫోర్సుమెంట్ విభాగానికి మామూళ్ల మత్తు
- అంతా తానై చక్రం తిప్పుతున్న సీఐ స్థాయి అధికారి

ఆయన ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్సుమెంట్ విభాగంలో సీఐ స్థాయి అధికారి. ఆయన పేరు చెబితే కృష్ణాజిల్లాలో మద్యం దుకాణదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఓ వైపు మద్యం విక్రయాలపై కమీషన్ గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్న మద్యం వ్యాపారుల నుంచి సదరు అధికారి నెలవారీ టార్గెట్లు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. ఈయన నెలవారీ వసూళ్ల టార్గెట్ తెలిస్తే కళ్లు తిరిగాల్సిందే.! నెలకు రూ.అరకోటి వసూలు చేయాలన్న లక్ష్యంతో ఈయన తమను వేధింపులకు గురిచేస్తున్నారని మద్యం దుకాణదారులు వాపోతున్నారు.



(విజయవాడ - ఆంధ్రజ్యోతి) కృష్ణాజిల్లాలో 123 మద్యం దుకాణాలు, 32 బార్లు ఉన్నాయి. మద్యం దుకాణాల్లో మద్యం పక్కదారి పట్టకుండా, బెల్టు షాపుల ద్వారా విక్రయాలు జరగకుండా, నిర్ణీత వేళల్లోనే మద్యం విక్రయాలు జరిగేలా చూసేందుకు ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్సుమెంటు విభాగం ఉంటుంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నడిచే ఈ విభాగంలో ఏఈఎస్, సీఐ ఉంటారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్(సెబ్)లో పనిచేసిన ఓ సీఐ ప్రస్తుతం కృష్ణాజిల్లా ఎన్‌ఫోర్సుమెంటు విభాగంలో పనిచేస్తున్నారు. ఈయన ఇటీవల మద్యం దుకాణదారులందరికీ తన వద్ద పనిచేసే సిబ్బంది ద్వారా ఓ సందేశం పంపారు. నెలకు ఎక్సైజ్ కార్యాలయం ఖర్చులకు గాను ప్రతి మద్యం దుకాణం యజమాని రూ.30వేలు ఇవ్వాలని, బార్ యజమానులు రూ.50 వేలు ఇవ్వాలనేది ఈ సందేశం సారాంశం. ఈ లెక్కన 123 మద్యం దుకాణల నుంచి నెలవారీ రూ.36.90 లక్షలు, బార్ల నుంచి రూ.16 లక్షలు నెలవారీ మామూళ్ల రూపంలో వసూలు చేస్తున్నారు. నెలవారీ మామూళ్లు ఇవ్వని దుకాణదారులను కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తానని బెదిరిస్తున్నట్లు సమాచారం. గతంలో సెబ్‌లో పనిచేసే సమయంలో నాటి డీసీపీ మోకా సత్తిబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరుబడిన ఈయన సెబ్‌లోనూ భారీగా వసూళ్ల దందా నడిపించారనే విమర్శలు ఉన్నాయి.

పైసలు ఇవ్వకపోతే కేసులే..

- మచిలీపట్నంలో 8 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఓ దుకాణదారుడు తమకు కమీషన్ 20 శాతం రావాల్సింది 10 శాతం కూడా గిట్టుబాటు కావడం లేదని మామూళ్లు అంత ఇచ్చుకోలేమని చెప్పడంతో ఆయనపై మద్యం దుకాణం వద్దే అనధికార బార్ నిర్వహిస్తున్నారంటూ కేసు పెట్టారు. దీన్ని 9సీ కేసు లేదా లూజ్ కేసు అంటారు.
- గన్నవరం నియోజకవర్గంలో 23 మద్యం దుకాణాలు ఉండగా సగం మంది మామూళ్లు ఇవ్వడానికి విముఖత చూపడంతో ఆరుగురిపై లూజ్ కేసులు పెట్టడంతో మిగిలిన వారు మామూళ్లు ఇచ్చుకునేందుకు సిద్ధమయ్యారు.

కృష్ణా జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని చోట్లా ఇదే తంతు నడుస్తోంది. మామూళ్లు ఇవ్వకుంటే కేసులకు సిద్ధపడాలని స్వయంగా సదరు సీఐ హెచ్చరికలు జారీ చేస్తుండటం గమనార్హం. ఎన్‌ఫోర్సుమెంటు వారికే నెలకు రూ.30వేలు ఇచ్చి మళ్లీ ఎక్సైజ్ స్టేషన్ల వారీగా మరో రూ.30వేలు మామూళ్లు, ఈఎస్, ఏసీ ఇలా అందరికీ మామూళ్లు ఇచ్చుకుంటూ పోతే తమకు మిగిలేది ఏమీ ఉండదని, ఇలాగైతే మద్యం దుకాణాలను నిర్వహించుకోలేమని దుకాణదారులు వాపోతున్నారు. సదరు సీఐ తంతుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని మద్యం దుకాణదారులు భావిస్తున్నారు.

వామ్మో ఫ్లైఓవర్!

అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నాలుగు లక్షల మంది జనాబా నగరంలోకి ప్రవేశించడానికి ఒక్కగానొక్క రోడ్డు మార్గం. ఒక పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాలే కాదు నున్న, నూజివీడు మొదలుకుని విస్సన్నపేట, తిరువూరు, ఖమ్మం, సత్తుపల్లి వరకు ఊరు ఏదైనా నగరంలోకి ప్రవేశించాలంటే ఈ ఫ్లైఓవర్ ఒక్కటే మార్గం. సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు ఉండే ఈ ఫ్లైఓవర్ మీదుగా రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య రోజు లక్ష పైమాటే. అటు రామవరప్పాడు ఫ్లైఓవర్, ఇటు పాలఫ్యాక్టరి ఫ్లైఓవర్ ఉన్నా అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌కు ప్రత్యామ్నాయం కాలేకపోతున్నాయి. దీంతో అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ రద్దీ నానాటికీ పెరిగిపోతుంది. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఫ్లైఓవర్ దాటి నగరంలోకి ప్రవేశించడం పెద్ద సాహసమే అవుతుంది. గతంలో ఈ ఫ్లైఓవర్ మీదుగా నిమిషాల వ్యవధిలో నగరంలోకి ప్రవేశించిన వాహనదారులు నేడు ఫ్లైఓవర్‌ను దాటాలంటేనే వామ్మో ఫ్లైఓవర్ అంటూ భయపడిపోతున్నారు.



అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ దాటాలంటే సాహసమే

- నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్
- ప్రత్యామ్నాయం లేక వాహనదారులు అగచాట్లు
- నగరంలోకి వెళ్లాలంటే గంట ముందే బయలుదేరాల్సిన దుస్థితి
- 2వ ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు అనివార్యం

వీటి కోసం ఎమ్మెల్యే బొండా, ఎంపీ కేశినేని కసరత్తు

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూడు దశాబ్దాల కిందట అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో లక్ష లోపు జనాభా ఉండేది. అప్పట్లో వాహనాల సంఖ్య కూడా చాలా తక్కువ. అనేక మంది సైకిళ్లు, రిక్షాలు, ఆర్టీసీ బస్సుల్లోనే నగరానికి ప్రవేశించేవారు. అదికూడా అజిత్‌సింగ్‌నగర్ రైల్వే ట్రాక్‌ను దాటుకుని రావాల్సి వచ్చేది. అయితే అప్పట్లో రైల్వే ట్రాక్ వద్ద గేటు పడిన సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సమస్యను అధిగమించేందుకు మూడు దశాబ్దాల కిందట అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో స్థానిక ప్రజలు సులువుగా నగరంలోనికి రాకపోకలు సాగించేవారు. అయితే ముప్పై ఏళ్లల్లో ఇక్కడి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. జనాభా నాలుగు లక్షలకు చేరుకుంది. ప్రతి ఇంటికి ఒకటి, రెండు వాహనాలు వచ్చి చేరాయి. దీనికి తోడు ఆగిరిపల్లి, నూజివీడు, విస్సన్నపేట, తిరువూరు, సత్తుపల్లి, ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి లెక్కకు మించిన వాహనాలకు ఫ్లైఓవర్ కీలకమైంది. దీంతో ఫ్లైఓవర్‌పై వాహనాలరద్దీ విపరీతంగా పెరిగిపోయి ఫ్లైఓవర్ దాటాలంటేనే కష్టసాధ్యంగా తయారయింది. నిత్యం దాదాపు లక్ష వాహనాలు ఈ ఫ్లైఓవర్ మీదుగా వెళ్తున్నాయంటే ఇక్కడి ట్రాఫిక్ సమస్య ఎంతలా ఉందో అర్థమవుతోంది. ఫ్లైఓవర్ కింద ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసిన ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది.

ప్రత్యామ్నాయం లేకపోతే కష్టమే!

అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో ప్రత్యామ్నాయదారులు ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో వాహనాల రద్దీని తట్టుకోవడం కష్టమయ్యేలా కనిపిస్తుంది. అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌కు పక్కనే రెండవ ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చాలాకాలంగా ఉంది. పదేళ్లుగా రెండవ ఫ్లైఓవర్ డిమాండ్ ఉన్నా నేటికి ఆ దిశగా అడుగులు పడలేదు. అలాగే ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యామ్నాయంగా వాంబేకాలనీ, మధురానగర్, గుణదల వద్ద అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.


ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో మరింత ఇబ్బంది

స్కూళ్లు, ఆఫీసులు, ఇతర పనుల నిమిత్తం నగరంలోకి వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఉదయం, సాయంత్రం రాత్రి వేళల్లో ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్య అంతా ఇంతా కాదు. ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో ఫ్లైఓవర్‌ను దాటాలంటే అరగంట సమయం తీసుకుంటుంది. అదే ఫ్లైఓవర్‌పై వాహనాలు మోరాయించినా, రోడ్డు ప్రమాదాలు జరిగినా ఇక ఫ్లైఓవర్ దాటడం అనేది సాధారణ విషయం కాదు. గంటల సమయం పడుతుండటం ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. మిగతా 6లో..

త్వరలో ట్రాఫిక్ సమస్యకు చెక్

అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. రెండవ ఫ్లైఓవర్ నిర్మాణం, మూడు ప్రాంతాల్లో ఆర్‌యూబీలు, గుణదల ఫ్లైఓవర్ తదితర అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లా. వివిధ శాఖల అధికారులు, మంత్రులతో చర్చించాం. ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు అతి త్వరలో పరిష్కారాన్ని చూపిస్తాం.

– బొండా ఉమా, సెంట్రల్ ఎమ్మెల్యే



రెండవ ఫ్లైఓవర్ నిర్మాణ విషయమై సీఎం చంద్రబాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బొండా ఉమా (ఫైల్)

పశ్చిమ బైపాస్‌పై రైతుల నిరసన!

- విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల అడ్డగింత
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

6లో

మహోజ్వల శక్తి అల్లూరి

- విగ్రహావిష్కరణ సభలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

6లో



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, చండీహోమం, ఖడ్గమాల, తదితర ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు, అర్చకులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తికి ప్రత్యేక అర్చనలు చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న నందమూరి రామకృష్ణ



స్వర్గీయ ఎన్టీ రామారావు కుమారుడు రామకృష్ణ ఆదివారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తితో కలిసి ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతించి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత పాలకుల వైఫల్యాలు రాష్ట్రానికి శాపంగా మారాయని, కూటమి ప్రభుత్వం సమగ్ర అభివృద్ధికి అడుగులు వేయటం ముదావహమన్నారు. ప్రజలందరి విశ్వాసం, మద్దతుతో రాష్ట్రం తిరిగి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీరంకి వెంకటగురుమూర్తి, పి.ఈశ్వర్, శొంఠి శివరామప్రసాద్, వల్లూరి కిరణ్, సాయిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



పశ్చిమ బైపాస్ రోడ్డుపై రైతుల ఆందోళన, అడ్డుకున్న పోలీసులు

పశ్చిమ బైపాస్‌పై రైతుల నిరసన!

- విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల అడ్డగింత
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

విజయవాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ బైపాస్ నిర్మాణ పనుల్లో భాగంగా పంట పొలాల్లో జరుగుతున్న విద్యుత్ హైటెన్షన్ వైర్ల డైవర్షన్ పనులను నిరసిస్తూ విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామ రైతులు ఆందోళనను ఉధృతం చేశారు. ఆదివారం స్తంభాల ఏర్పాటు పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. గొల్లపూడి నుంచి చిన్న అవుటపల్లి వరకు పలు గ్రామాలను కలుపుకుని పశ్చిమ బైపాస్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు ఎత్తు పెరగడంతో విద్యుత్ హైటెన్షన్ వైర్లు భారీ వాహనాలకు తాకే ప్రమాదం ఉండటంతో కాంట్రాక్ట్ సంస్థ వైర్ల డైవర్షన్ పనులను చేపట్టింది. రెండునెలలుగా జరుగుతున్న పనుల్లో పలుచోట్ల పంట పొలాల్లో కొత్తగా హైటెన్షన్ వైర్లకు సంబంధించి విద్యుత్ స్తంభాలను కాంట్రాక్ట్ సంస్థ ఏర్పాటు చేస్తోంది. అయితే అనుమతి లేకుండా తమ భూముల్లో స్తంభాల ఏర్పాటు పనులు చేపడుతున్నారంటూ రైతులు 20 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం జక్కంపూడి పంచాయతీ పరిధిలోని పొలాల్లో స్తంభాల ఏర్పాటు పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడ మోహరించిన కొత్తపేట సీఐ కొండలరావు సిబ్బంది ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించి అనంతరం విడిచిపెట్టారు.

కూటమి విజయంతో కాపుల సత్తా రుజువైంది

- వనసమారాధనలో సినీనటుడు పృథ్వీరాజు



మాట్లాడుతున్న పృథ్వీరాజు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని కాపుల సత్తా ఏమిటో రుజువు చేశారని సినీ నటుడు బాలిరెడ్డి పృథ్వీరాజు అన్నారు. ఆదివారం జంక్షన్‌లో నిర్వహించిన కాపు వన సమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజకీయంగా కాపులు వెనుకబడి ఉన్నారన్నారు. కూటమి విజయంతో కాపులకు ఒక ఊపు వచ్చిందని.. ఇదే ఊపును కొనసాగించాలన్నారు. మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఆర్టీసీ విజయవాడ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అను హాస్పటల్ చైర్మన్ గాజుల రమేష్, వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు, రాష్ట్ర తూర్పు కాపు సంఘం డైరక్టర్ లావేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



స్వాములకు భోజనం వడ్డిస్తున్న ఫరూఖ్ షుబ్లీ

వెల్లివిరిసిన మత సామరస్యం

పాయకాపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కండ్రిక కాలనీలో మత సామరస్యం వెల్లివిరిసింది. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కాలనీలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం స్వాములు, భవానీలకు చద్ది(భోజనం) ఏర్పాటు చేశారు. 150 మంది అయ్యప్ప, భవానీ మాలధారులు హాజరయ్యారు. కులమతాలకు అతీతంగా స్వాములు మైనార్టీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫరూఖ్ షుబ్లీ మాట్లాడుతూ, ప్రజలు శాంతి మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమ ఏర్పాటుకు సహకరించిన గురుస్వాములు, అప్పారావు, పరుచూరి రాములకు ధన్యవాదాలు తెలిపారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు బ్రెయిన్ ఫీడ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

ప్రసాదంపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 'ఈటీ టెక్ ఎక్స్ స్కూల్ ఎక్సలెన్సీ అవార్డు 2024-25'లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బ్రెయిన్ ఫీడ్ అవార్డు కైవసం చేసుకుందని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ అన్నారు. బ్రెయిన్ ఫీడ్ మ్యాగజైన్ డైరెక్టర్స్ నుంచి ఆయన అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌చంద్ మాట్లాడుతూ, ఉన్నత ప్రమాణాలతో ఉత్తమ ఫలితాలను సాధించినందుకు లభించిన ఈ అవార్డు భవిష్యత్తులో మరిన్ని విద్యా, వైజ్ఞానిక, క్రీడ, సాంస్కృతిక రంగాల్లో అత్యుత్తమ ఫలితాలకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎం.ఎస్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియాలు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



'కృష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రి కళావేదికపై సంగీత కచేరీలు నిర్వహిస్తున్న పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు

సంగీత నీరాజనం..



డాక్టర్ శేషులత, విశ్వనాథ శిష్యుల బృందగానం



హంస నాగరాజన్ | పార్థసారథి గానం | నేన్మార్ బ్రదర్స్ నాదస్వరం

పులకించిన కృష్ణా తీరం!

విజయవాడ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగీత ప్రియులకు మధురానుభూతి కలిగించిన 'కృష్ణవేణి సంగీత నీరాజనం' రసానుభూతిని కలిగించి సంగీత సాగరంలో మునకలు వేయించింది. భారత పర్యాటక మంత్రిత్వశాఖ, ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, పర్యాటక సంస్థల సంయుక్త అధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కృష్ణవేణి సంగీత నీరాజనం' కార్యక్రమంలో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సంగీత కచేరీలు నిర్వహించారు. కచేరీ ప్రారంభం ఎస్.సి.హెచ్.పార్థసారథి గానంతో జరిగింది. డాక్టర్ శేషులత, విశ్వనాథ శిష్యులు బృంద గానం ద్వారా ముక్తిప్రియరాగంలో ఆదితాళంతో 'ఏమయ్యా రామయ్య' పాటకు జీవం పోశారు. అలాగే మాలవ రాగంలో ఆదితాళంతో 'రామ రామయ్య' అనే భక్త రామదాసు కీర్తనతో భక్తి భావాన్ని రేకెత్తించారు. కామకోటి పీఠాధిపతి ఆస్థాన సంగీత విద్వాంసుడు వినయ్ శౌర్య కైవార తాతయ్య రచన 'శ్రీగణాధిపా'...ను గంబీర నాట రాగంలో, ఖండచాపు తాళంలో ఆలపించి శ్రోతలను మైమరిపించారు. చెన్నైకు చెందిన నందిక, దీపికలు 'శివ శివయనరాదా' అనే కీర్తనను స్వరాల సవ్వడితో అద్భుతంగా వినిపించారు. ప్రముఖ మాండలీన్ వాద్యకళాకారుడు ఎస్.ఎం.సుభాని ముత్తుస్వామి దీక్షితార్ రచన 'వాతాపి గణపతిం భజే' (హంసధ్వని రాగం, ఆదితాళం)ను మాండలీన్ వాయిద్యంతో అలరించారు. చెన్నైకి చెందిన విఘ్నేష్ ఈశ్వర్, మల్లాది బ్రదర్స్, మల్లాది సూర్యనారాయణ గాత్ర త్రయం తమ గానంలో త్యాగరాజ స్వామి కృతులను ఆవిష్కరించగా, మల్లాది రంజని-గాయత్రి ద్వయం మోహనరాగం, ఖండచాపు తాళంలో 'సకలేం ద్రియములారా'ను గానం చేసి ప్రశంసలు అందుకున్నారు. రీతిగౌళ రాగంలో 'పీ పద్య ధ్యానము కలిగిన నాది నిత్యానందం'ను ఆలపించారు. తదుపరి నాదస్వరం నేన్మార్ బ్రదర్స్ తమ విన్యాసంతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టుకున్నారు. తచ్చూరు సింగరాచార్యులపై వై.ఎస్.బాలసుబ్రమణ్యం సాహిత్య సంగతులపై ప్రసంగించారు. సంగీత సంగతి, సాహిత్య భావ సంగతి సంవాద సంగతిల విశిష్టతను సవివరంగా వినిపించారు. కనకదుర్గాదేవి కొండపైకి ప్రతిధ్వనించినట్టు అనిపించింది. గాయకులు దేవీ కృతులు ఆలపించి, భక్తి, సంగీతం కలిసి మేళవించిన అద్భుత ప్రదర్శన అందించారు. కళాకారులను దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అధికారులు, ప్రధాన అర్చకులు సన్మానించి సత్కరించారు.

వామ్మో ఫ్లైఓవర్!

(5వ పేజీ తరువాయి)

పోలీసుల ఆంక్షలతో మరిన్ని సమస్యలు

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకుగాను నగర పోలీసులు ఆదివారం నుంచి ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలతో ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ రద్దీ కొంత మేర తగ్గినా అనేక మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఫ్లైఓవర్ మీదుగా సిటీ బస్సులు మినహా ప్రైవేట్, ఆర్టీసీ బస్సులు, స్కూల్, కాలేజీల బస్సులకు ఫ్లైఓవర్‌పై ప్రవేశాన్ని నిలిపివేశారు. సదరు వాహనాలు పాయకాపురం కండ్రిక మీదుగా రామవరప్పాడు ఫ్లైఓవర్ మీదుగా నగరంలోకి రాకపోకలు సాగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆంక్షలతో ట్రాఫిక్ సమస్య తగ్గినా బస్సుల్లో స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవనున్నాయి. రామవరప్పాడు ఫ్లైఓవర్ మీదుగా నగరంలోకి ప్రవేశించాలంటే విద్యార్థులు అదనంగా గంటకుపైగా విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వస్తుంది.

రెండవ ఫ్లైఓవర్, ఆర్‌యూబీలపై ఎమ్మెల్యే, ఎంపీల కసరత్తు

అజిత్‌సింగ్‌నగర్ రెండవ ఫ్లైఓవర్ అలాగే ఫ్లైఓవర్‌కు ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జిల నిర్మాణాలపై సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. ఫ్లైఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలను కోరుతూ ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యేలు రైల్వే శాఖ అధికారులను కలవగా ఎంపీ చిన్ని రైల్వే శాఖా మంత్రికి సమస్యను విన్నవించనున్నారు. అలాగే ఎమ్మెల్యే బొండా ఉమా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇటీవల సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు.

అభ్యుదయ సాహిత్యానికి బాటలు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగంలో భావ కవిత్వంతో పాటు అభ్యుదయ కవిత్వాన్ని తీసుకొని వస్తూ నేటి రచయితలు తనదైన ముద్ర వేసుకొన్నారని, అటువంటి వాటికి తగిన ప్రోత్సాహం కల్పించాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. అరసం ఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్వర్యంలో ప్రచురించిన కవితా సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం శిఖామణి సెంటర్‌లోని శిఖర పాఠశాల ఆవరణలో నిర్వహించారు. బండ్ల మాధవరావు సంపాదకత్వంలో వెలువరించిన 'దేవీప్రియ కవితలు' పుస్తకాన్ని ప్రముఖ రచయిత ఖాదర్ మొహిద్దీన్, 'రేవతి దేవి కవితలు' పుస్తకాన్ని ప్రముఖ రచయిత పి.సత్యవతి ఆవిష్కరించారు. అధ్యక్షత వహించిన పెనుగొండ మాట్లాడుతూ సాహిత్య రంగంలో దేవీప్రియ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, తెలుగు సాహిత్యం భాష విషయంలో అరుదైన ముద్ర వేసుకొన్నారని, నేటి పాత్రికేయరంగానికి ఆయన సాహిత్యం ఒక గొప్ప స్ఫూర్తి అని అన్నారు. ఖాదర్ మొహిద్దీన్, బాలాంత్రపు రజని మాట్లాడుతూ దేవీ ప్రియ, రేవతీ దేవి సాహిత్యంలో కుటుంబంలో సమాజాన్ని సమాజంలో కుటుంబాన్ని చూసేవారని అన్నారు. తెలుగుతో పాటు ఆంగ్లంలో మంచి పట్టు వుందని, ఒక తపస్సు లాగా సాహిత్యం కొనసాగేది అని అన్నారు. వారి రచనల్లో వామపక్ష భావజాలం అభ్యుదయ కవిత్వం సమకాలీన కవుల్లో నిర్మలమైన కవిత్వం, స్త్రీ వాద సాహిత్యం, స్త్రీ జాతికి ప్రతీకగా వుండేవని అన్నారు. స్త్రీ జీవితంలో సంఘర్షణ, వేదన, కనిపిస్తాయని అన్నారు. సభకు అరసం జిల్లా కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ స్వాగతం పలుకగా అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్, బండ్ల మాధవరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు, లలితా నంద్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి విగ్రహావిష్కరణలో కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి

మహోజ్వల శక్తి అల్లూరి

- విగ్రహావిష్కరణ సభలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

కాటూరు(ఉయ్యూరు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు మహోజ్వల శక్తి అని కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కీర్తించారు. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామపంచాయతీ పరిధి రాజుపేటలో బోరుకాటి రామరాజు జ్ఞాపకార్థం ఆయన సతీమణి బోరుకాటి జయప్రద ఆధ్వర్యంలో రత్నాగ్రూప్ ఫౌండర్, చైర్మన్ చిందా వెంకటేశ్వర్లు రాజు ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇతర ప్రముఖులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ, సాయుధపోరాటం ద్వారానే ఆంగ్లేయుల నుంచి దేశానికి విముక్తి అని గిరిజనులను చైతన్యపరచిన సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి అన్నారు. స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన సీతారామరాజు విగ్రహాన్ని భీమవరంలో ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించి అల్లూరి కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటారన్నారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, రాజు పేటలో అలూరి విగ్రహం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. అల్లూరిది నిస్వార్థ పోరాటమని మంత్రి సారథి కొనియాడారు. దేశం కోసం అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకమని బోడె ప్రసాద్ అన్నారు. విజయవాడలో దివంగత సినీహీరో కృష్ణంరాజు విగ్రహం ఏర్పటుచేయనున్నట్టు ఆయన సతీమణి శ్యామలాదేవి అన్నారు. అనంతరం అల్లూరి మనవడు శ్రీరామరాజును సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కొనకళ్ల బుల్లయ్య, క్షత్రియసేవా సంఘం చైర్మన్ పీవీ గిరి, యుపీఏ సభాపతి రఘురామ కృష్ణంరాజు, సోము వీర్రాజు, అప్పలరాజు, బోరుకాటి ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలి

- ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శి ఉద్యోగాన్ని టెక్నికల్ పోస్టుగా చూపి ఉద్యోగుల ఆశలపై నీళ్ల చల్లిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ అన్నారు. కృష్ణలంక మెట్లబజారులోని వాసవి సేవా సంఘ భవన్‌లో ఆదివారం జరిగిన వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శుల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూర్యనారాయణ మాట్లాడుతూ, పై పోస్టుకు గత ప్రభుత్వం నోటిఫికేషన్‌లో జాబ్‌కు అర్హత సైన్స్‌లో డిగ్రీ లేదా ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్, అంతకంటే ఎక్కువ వుండాలని తెలిపిందన్నారు. అలాగే శిక్షణలో టెక్నికల్, హుందా గల ఉద్యోగమని ఊదరగొట్టారన్నారు. పేరు గొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా వుందని మండిపడ్డారు. అత్యధిక మహిళా ఉద్యోగులు (మహిళా పోలీసులు మినహా) వున్న ఉద్యోగం వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శి, మహిళా కార్యదర్శులు అని చూడకుండా, ఎటువంటి రక్షణ కల్పించకుండా ఉదయం 5 గంటలకే బెదిరింపులతో రప్పిస్తూ పబ్లిక్ హాలిడేస్, ఫెస్టివల్ హాలిడేస్ లేకుండా రోజుకు 10 గంటలకు పైగా రోడ్ల వెంబడి, చెత్తకుప్పల వెంబడి, కాలువల వెంబడి తిప్పారన్నారు. ప్రస్తుతం అదే విధానం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఉద్యోగులు వత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. లీడ్ వర్కర్ పనులను చేయిస్తూ ఉన్నత విద్యను అవమానించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి పదోన్నతులు కల్పించాలని, జీవో 423ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్డీఏ డిజైన్‌పై ప్రజల ఓటింగ్ వారం పొడిగింపు


వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీసు డిజైన్‌పై ప్రజల ఓటింగ్ మరో వారం రోజులు పొడిగించినట్టు సీఆర్డీఏ కమిషనర్ కె.భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు ఆఫీసు బిల్డింగ్ ఎలా ఉండాలన్నదానిపై అధికారులు వెబ్‌సైట్ ద్వారా నవంబరు 30 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు నిర్వహించగా ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. అయితే మరింత మందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేందుకు మరో 7 రోజుల పాటు ఓటింగ్ కల్పించినట్టు పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ వరకు ప్రజలు వారి అభిప్రాయాలను తెలపవచ్చన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన షష్టి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి కల్యాణ మహోత్సవాలు ఆదివారం మహాపూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలతో వైభవంగా ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి ప్రాతాహ కాల్పారన, గోపూజ, నిత్యహోమం, బలిహరణ, పంచామృత స్నపన, వసంతోత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. అర్చక బృందం వేదమంత్రోచ్చరణల నడుమ మహా పూర్ణాహుతిని ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు పూర్తి గావించారు. స్వామి, అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనులను గావించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. పుర ప్రజలు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. కానుకల లెక్కింపు ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

ఎంఎస్‌ఎంఈతో పేద వర్గాల అభివృద్ధి

- కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్




మాట్లాడుతున్న శివశంకర్

వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) పథకం పేద, మధ్యతరగతి వర్గాల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తిమ్మారెడ్డి శివశంకర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం మెగాసేన, ఉమ్మడి కృష్ణాజిల్లా చిరంజీవి యువత, జనసైనికుల ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో 'నిరుద్యోగ యువత-పారిశ్రామికవేత్తలు' అంశంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివశంకర్ తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ ఎంఎస్‌ఎంఈపై అవగాహన ఉండాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నవారికి ముందుగా పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి కేంద్రం రుణాలు మంజూరు చేయటంతో పాటు శిక్షణ, మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. పథకం గురించి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కృషి, పట్టుదల, ఆలోచన ఉన్నప్పుడే అనుకున్న రంగంలో ముందుకు వెళతామని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని, వీరికి 35 శాతం సబ్సిడీని కేంద్రప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దళిత బహుజన అధ్యక్షుడు మేశం భాగ్యారావు మాట్లాడుతూ, ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి వైసీపీ ప్రభుత్వంలో సరైన సహకారం అందలేదన్నారు. తొలుత సొంత నిధులతో చిన్న పరిశ్రమలు నెలకొల్పిన పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.ఎస్.ప్రసాద్, ఎస్.కె.ప్రసాద్, ఈ.ఎస్.బాబు, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ట్యాలీప్రైమ్ కోర్సులో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, స్వర్ణభారత్‌ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ గ్రామీణ కంప్యూటర్ శిక్షణా సంస్థలో ఈనెల 16నుంచి ట్యాలీప్రైమ్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ ఇన్‌చార్జి జి.అంకమ్మరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటురంగ సంస్థల్లో ఫైనాన్షియల్ అకౌంటింగ్ సెక్టార్‌లో ట్యాలీప్రైమ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయన్నారు. ఇప్పటివరకు తమ సంస్థద్వారా 91బ్యాచ్‌ల్లో 2851 మంది యువతకు శిక్షణ ఇవ్వగా 1413 మందికి 41ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్లు లభించాయన్నారు. ఈ కోర్సులో శిక్షణపొందేందుకు బీకామ్, ఎంకామ్, బీబీఏ, ఎంబీఏ చదివి, 18నుంచి 35సం.ల మధ్య వయసు వుండి ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన యువతీయువకులు అర్హులని తెలిపారు. రెండునెలల శిక్షణ కాలవ్యవధితో అభ్యర్థులకు శిక్షణతోపాటు భోజన, వసతి సదుపాయాలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణపత్రాలు,ఇ-కోర్సుమెటీరియల్ అందజేయడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో సంస్థ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9100033552, 9440630051 నెంబర్లలో సంప్రదించాలని అంకమ్మరావు సూచించారు.



ట్రోఫీ అందుకుంటున్న విజేత కెప్టెన్ అభిలాష్

ఎల్ఐసీ ఉద్యోగుల క్రికెట్ విజేత జీవీఎస్ మణి ఎలెవన్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర లయోలా కళాశాల ప్రాంగణంలో నాలుగువారాలుగా సెలవురోజుల్లో జరుగుతున్న మచిలీపట్నం ఎన్ఎఫ్ఐఎ ఫడబ్ల్యుఐ డివిజన్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగుల క్రికెట్(కామ్రేడ్ ఎస్‌డబ్ల్యు కల్పిత్ సెంటినరీ మెమోరియల్) ఫైనల్ జీవీఎస్ మణి ఎలెవన్ టీమ్ దండావతి ఎలెవన్‌పై 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ట్రోఫీని వశం చేసుకుంది. మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.సుధాకర్‌బాబు కెప్టెన్ అభిలాష్(గుంటూరు సిటీ-1 బ్రాంచ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)కు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ ప్రతినిధులు ఎం.సురేష్‌బాబు, ఎన్.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, ప్రతాపరెడ్డి, మచిలీపట్నం ఎస్‌బీఏ మాగంటి కృష్ణప్రభులు పాల్గొన్నారు.

కృష్ణాలో ప్రశాంతంగా ఎన్ఎంఎంఈ పరీక్షలు

మచిలీపట్నం టౌన్ : ఎన్ఎంఎంఎస్ పరీక్షలు కృష్ణాజిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. మూడు డివిజన్ల పరిధిలోని 18 పరీక్షా కేంద్రాల్లో 3760 మంది అభ్యర్థులకు 3402 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 358 మంది గైర్హాజరయ్యారు. మచిలీపట్నంలో ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో 1641 మందికి 1483 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మచిలీపట్నంలోని చిలకలపూడి మునిసిపల్ హైస్కూలు, నిర్మల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు మచిలీపట్నం రాంజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను సందర్శించారు. గుడివాడలోని 6 పరీక్షా కేంద్రాల్లో 1107 మంది అభ్యర్థులకు 992 మంది హాజరయ్యారు. ఉయ్యూరులో నాలుగు పరీక్షా కేంద్రాలలో 1012 మందికి 927 మంది హాజరయ్యారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104,112, 123
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

రైల్వేస్టేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ వాటర్ ఫైపు సమీపంలోని రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి రైల్వేట్రాక్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని రైల్వే అధికారులకు సమాచారం అందింది. అధికారులు, రైల్వే పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతదేహం వద్ద గుర్తింపు నకు ఆధారాలు లేవు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి దేహంపై తెలుపు టీషర్ట్, బ్లూ ప్యాం ట్ ఉన్నాయి. ముప్పై ఏళ్ల వయస్సు ఉండొచ్చని చెన్నై సెంట్రల్ దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు తెలిపారు.



ఒకవైపు వెలుగుతున్న లైటు, సరిగా పనిచేయని సెంట్రల్ లైటు, వరలక్ష్మి నగర్ లైటు లేని స్తంభం

సెంట్రల్ లైట్ల వెలుగులు సగమే..!

భారతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంధకారంగా మారిన 5వ నెంబరు రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని ప్రధానరోడ్లలో ఇదొకటి. ఈ రోడ్డు నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాంటి ప్రధాన రోడ్‌లో రమేష్ ఆసుపత్రి జంక్షన్ నుంచి ఐటీఐ కళాశాల వరకు 5వ నెంబరు రోడ్‌లో సెంట్రల్ డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన లైటు సగం మాత్రమే వెలగడంతో వెలుతురు సరిపోక చీకటిగా మారింది. రాత్రి సమయంలో రోడ్డంతా అంధకారంగా మారుతోంది. ఈ ప్రాంతంలో పలు ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలు, వైద్యశాలలున్నాయి. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో ప్రయాణించాలంటే భయంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ ఫీజ్ బాక్స్

భారతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా మారిన విద్యుత్ ఫీజ్ బాక్స్‌లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4వ డివిజన్ వరలక్ష్మినగర్ సమీపంలోని 5వ నెంబర్ రోడ్డుకు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫామ్‌ను ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్డు కావడంతో ప్రమాదాలను నివారించడానికి రక్షణగా ఇనుప తీగలతో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇవి ఏర్పాటు చేసి ఏళ్లు గడిచిపోవడంతో ప్రస్తుతం ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. ప్రధానరోడ్డు కావడంతో ప్రజలు ఈప్రాంతంలో రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విద్యుత్ ఫీజ్ బాక్స్‌కు చుట్టూ ధ్వంసమైన ఇనుప తీగలు

పెరుగుతున్న డ్రెయిన్ల ఆక్రమణలు

● జలమయమవుతున్న రోడ్లు ● దుర్గంధం వెదజల్లడంతో స్థానికుల ఆవేదన ● అధికారులు స్పందించాలని వినతి



విజయనగర్ కాలనీలో పూడికతో నిండిన డ్రైనేజీ, సెంటర్‌లో వరుసగా ఏర్పాటు చేసిన దుకాణాలువెటర్నరీ కాలనీ సెంటర్ సమీపంలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన దుకాణం

భారతీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గ పరిధిలోని విజయనగర్ కాలనీలోని డ్రైనేజీలు ఆక్రమణలకు గురయ్యాయి. లయోలా కళాశాల రోడ్డులోని వెటర్నరీ కాలనీ సెంటర్ నుంచి గుణదల 77 రోడ్డు మీదుగా గుణదల పాత పంచాయతీ సెంటర్ సుమారు 2 కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు వెంబడి ఉన్న డ్రైనేజీని కొందరు ఆక్రమించి వ్యాపారులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కొందరు డ్రైనేజీపై అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. వీటి గురించి అధికారులు పట్టించుకుపోవడంతో ఈ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇందుకు నిదర్శనంగా ఇటీవల 77 రోడ్‌లోని పాత పంచాయతీ సెంటర్ సమీపంలో డ్రైనేజీని ఆక్రమించుకోవడమే కాక దుకాణాలు నిర్మించి వాటిని అద్దెకిస్తున్నారని స్థానిక పెద్దలు తెలియజేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వలన డ్రైనేజీ పూడిక తీయడానికి వీలులేకపోవడంతో శానిటరీ కార్మికులు నామమాత్రంగా పూడిక తీసుకొని వెళ్లిపోతున్నారు. దీంతో చిన్న వర్షం కురిసినా రోడ్డు జలమయం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో రోడ్డంతా దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డ్రైనేజీపై ఏర్పాటు చేసిన అద్దెకిచ్చిన దుకాణం, రోడ్డుపై నిలిపి ఉంచిన వాహనాలు

లక్ష గోవులతో గోశాల ఏర్పాటుకు అనుమతివ్వండి

సీఎం చంద్రబాబుకు బీసీ యువజన పార్టీ అధినేత లేఖ

ఆటోనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రత, పరిరక్షణ కోసం తాను ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నానని బీసీ యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆదివారం ఓ లేఖ రాశారు. తిరుమలలో డెయిరీ కోసం తన వంతుగా వెయ్యి గోవులను ఉచితంగా ఇవ్వడంతో పాటు లక్ష గోవులను సమీకరించే బాధ్యతను తీసుకుంటానన్నారు. తిరుమల పవిత్రత కోసం, పరిరక్షణ కోసం వెయ్యి గోవులను, 22 ఎకరాల భూమిని ఉచితంగా ఇస్తానన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 20 జిల్లాల్లో.. ఒక్కో జిల్లాలో 5వేల గోవులకు ఒక డెయిరీ చొప్పున మొత్తం లక్ష గోవులను పెంచేలా 20 డెయిరీలను ఏర్పాటు చేయవచ్చని సూచించారు. పుంగనూరులోని తన 22 ఎకరాల మామిడి తోటను గోశాల కోసం టీటీడీకి ఉచితంగా రాసిస్తానన్నారు. 20 డెయిరీల ఏర్పాటుకు కావాల్సిన భూసేకరణ బాధ్యతను తానే తీసుకుంటానని, దీనిపై ఏ నిర్ణయం తీసుకోకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు.



అభ్యర్థుల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జేసీ నిధి మీనా

వీఆర్వో గ్రేడ్-2
సప్లిమెంటరీ పరీక్షలు

కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం రాష్ట్రంలోని 615 మందికి వీఆర్వో గ్రేడ్-2 అభ్యర్థుల సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ నిధి మీనా పరిశీలించారు. వీరికి గతంలో 15 రోజుల పాటు సర్వే శిక్షణ, సామర్లకోటలోని ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీ చేత ఇప్పించడం జరిగిందని, సర్వే, భూమి రికార్డుల కార్యాలయ జిల్లా సహాయ సంచాలకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీ, సామర్లకోట జాయింట్ డైరెక్టర్, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.వి.ఎస్.ఎన్ కుమార్, ఎక్స్‌టర్నల్ అబ్జర్వర్ కె.శ్రీనివాసరావు, జిల్లా సర్వే సహాయ సంచాలకులు టి.త్రివిక్రమరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో
ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



కృష్ణలంక గంగానమ్మ గుడి వీధిలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె, జనసేన నేత వాసు

ఉచిత వైద్య శిబిరాలను
వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అమ్మిశెట్టి వాసు

కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తెలిపారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని గంగానమ్మ గుడి వీధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శంకర నేత్ర చికిత్సాలయ పర్యవేక్షణలో స్థానిక జనసేన డివిజన్ అధ్యక్షుడు తోట శ్రీను ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన గద్దె, వాసు మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. పేదలు ఏ చికిత్సకైనా రూ.వేలకు వేలు ఖర్చుపెట్టలేరని, అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాల్లో పాల్గొంటే మరికొందరు ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించాలనే తలంపు వస్తుందన్నారు. తోట శ్రీను ఇలాంటి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించడం ముదావహమన్నారు. గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి, జనసేన డివిజన్ అధ్యక్షుడు తోట శ్రీను, నేతలు రామారావు, శ్రీను, అనిల్, అశోక్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు, పెద్ది అన్నారావు, మాధవి, నర్సి పాల్గొన్నారు.

కోటి సభ్యత్వాల నమోదుతో గిన్నిస్ రికార్డ్

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యయుతంగా సభ్యత్వ నమోదు నిర్వహించడమే కాకుండా కోటిమందికి సభ్యత్వాలిచ్చి త్వరలో టీడీపీ గిన్నీస్ రికార్డులో పేరు నమోదు చేసుకోబోతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 11వ డివిజన్‌లో జరుగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే ఆదివారం స్వయంగా పరిశీలించారు. సభ్యత్వం తీసుకున్న వారికి ఆయన స్వయంగా సభ్యత్వ కార్డులను అందజేశారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ 45 రోజుల్లో కోటిమందికి సభ్యత్వాలు పూర్తి చేసి గిన్నిస్ రికార్డులో పేరు నమోదు చేసుకోబోతున్నామన్నారు. ఈ ప్రక్రియ ముగియటానికి ఇంకా నెలరోజుల సమయం ఉందని, ఈ నెలలో కోటి మందికి పైగా సభ్యత్వాలు తీసుకుంటారన్నారు. కిందస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుంటున్నామని, ఒక్క తెలుగుదేశం పార్టీలోనే ఈ విధానం కొనసాగుతుందని వివరించారు. టీడీపీలో సభ్యత్వం ఉన్నందుకు గర్విస్తున్నాన్నారు. తూర్పులో 30వేలకు పైగా సభ్యత్వాలు పూర్తయ్యాయని, 20 మంది రూ.లక్ష చెల్లించి టీడీపీ జీవిత కాల సభ్యత్వం నమోదు తీసుకున్నారన్నారు. పార్టీ డివిజన్ నేతలు కోనేరు రాజేష్, పామర్తి కిషోర్, వై ప్రసాద్, జే సురేష్, కే మాలతి పాల్గొన్నారు.



9వ డివిజన్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న గద్దె రామ్మోహన్

సంక్షేమ పథకాలు అందజేస్తాం

ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేయడంతో పాటు ప్రజా సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఆదివారం 9వ డివిజన్‌లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మసీదు రోడ్డు కాల్వగట్టు రోడ్డు చివర వీధిలైట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కాల్వగట్టుపై రాకపోకలు సాగించడానికి ప్రమాదకరంగా ఉందని, అందువల్ల రెయిలింగ్ కావాలని అడగ్గా వెంటనే రెయిలింగ్ ఏర్పాటుకు గద్దె హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం ఇళ్లను, కొత్తగా రేషన్‌కార్డులు, పింఛన్లు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వం చిన్నపాటి కారణాలతో ప్రభుత్వ పథకాలు తొలగించేదని, అలా తాము చేయమన్నారు. చెన్నుపాటి గాంధీ, చెన్నుపాటి కాంతి శ్రీ, సీహెచ్ లక్ష్మి నరసింహారావు, ఎస్ సురేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

● ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు సూచన

వన్‌టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు రోడపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించొద్దని, ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు సూచించారు. వన్‌టౌన్ పరిధిలోని ఆటోడ్రైవర్లకు ఆదివారం వన్‌ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా కాకి యూనిఫాం ధరించాలని ఆయన ఆదేశించారు. ఆటోకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవర్ లైసెన్స్ ఉండాలని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఆటోపై సీరియల్ నెంబరు, ఫోన్ నెంబరు తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు. మద్యం తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేస్తామని, ఎవరైనా ప్రయాణికులు ఆటోల్లో వస్తువులు మర్చిపోతే వాటిని దగ్గరలోని పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలని లేదా 112కు కాల్ చేసి తెలపాలని సూచించారు. మైనర్లకు ఆటోలను అద్దెకిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఆటోల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు ఉంటే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ఆయన సూచించారు. కేఆర్ మార్కెట్, గద్దబొమ్మ సెంటర్లలో ఆటోలను నిలుపుదల చేయకుండా ప్రయాణికులను ఎక్కించుకున్న వెంటనే వెళ్లిపోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జి.లక్ష్మణ్, ట్రాఫిక్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు సూచనల కరపత్రం అందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు

పిన్ని మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

వన్‌టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పిన్ని మందలించిందని కంసాలిపేటకు చెందిన బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై ఆదివారం కొత్తపేట పోలీసుస్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. కంసాలిపేటలో కుందుర్తి నిర్మల కుటుంబసభ్యులతో ఉంటోంది. ఆమె అక్క, బావ పదహారేళ్ల క్రితం చనిపోయారు. వారి కుమారుడు కుందుర్తి చరణ్(16) నిర్మల పెంచుతోంది. చరణ్ స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నాడు. ఈనెల 7వ తేదీన నిర్మల స్టౌపైన కూర వండుతూ పని ఉండడంతో బయటకు వెళ్లింది. చరణ్‌ను జాగ్రత్తగా చూస్తూ ఉండమని చెప్పింది. చరణ్ కూరను చూడకుండా గోళ్లకు రంగువేసుకుంటున్నాడు. కూర మాడిపోయింది. బయట నుంచి వచ్చిన నిర్మల కూర మాడిపోయిందేంటని చరణ్‌ను మందలించింది. దీంతో నిర్మల బయటకు వెళ్లిన తరువాత ఇంటిలో నుంచి రూ.4వేలు తీసుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ ఆఫ్ చేసి చరణ్ బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత ఆమె ఇంటికి వచ్చి చూడగా చరణ్ కనిపించలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఇంటికి తిరిగి రాకపోవడంతో నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది.



విశాఖలో పారాగ్లైడింగ్

» విజయవంతమైన ట్రయల్‌రన్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని సందర్శించే పర్యాటకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు రుషికొండ బీచ్‌లో పారాగ్లైడింగ్ అందుబాటులోకి రానుంది. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లెవెన్ అడ్వెంచర్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఈ బీచ్‌లో ఇప్పటికే బోటుషికార్, స్కూబా డైవింగ్ తదితర అడ్వెంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులో వున్నాయి. పారాగ్లైడింగ్ కొత్త అనుభూతిని అందించనుంది. నింగి, నేలను తాకుతూ సముద్రంలో ఎగసిపడే కెరటాలు... మరో పక్క ఎత్తైన కొండలను వీక్షిస్తూ నీలాకాశంలో విహరించడం పర్యాటకులకు మధురానుభూతినిస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు.

అనంత పోలీసుల కస్టడీలో బోరుగడ్డ

విచారణలో 'తెలియదు, గుర్తులేదు..' సమాధానాలు



అనంతపురం క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను అనంతపురం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆయన్ను ఆదివారం తెల్లవారుజామున అనంతపురం తీసుకొచ్చారు. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులను అసభ్యకరంగా విమర్శిస్తూ బోరుగడ్డ యూట్యూబ్ చానల్‌లో మాట్లాడారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ నిమిత్తం బోరుగడ్డను కస్టడీలోకి తీసుకున్నారు. రాజమండ్రి కోర్టు నుంచి మూడు రోజుల కస్టడీ కోరారు. శనివారం అతనికి వైద్య పరీక్షలు అక్కడే నిర్వహించారు. కాగా, బోరుగడ్డ విషయంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన్ను తెల్లవారుజామున 1.20 గంటల సమయంలో పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా.. అప్పటికే అక్కడి లైట్లన్నీ ఆర్పేశారు. వచ్చీ రాగానే అనిల్‌ను లోపలకు తీసుకెళ్లారు. ఆదివారం సైతం పోలీసుస్టేషన్‌కు తాళం వేశారు.

విచారణకు సహకరించని అనిల్

విచారణలో అనిల్ పోలీసులకు సహకరించలేదని సమాచారం. 'తెలియదు.. పెద్దగా గుర్తులేదు..' అనే సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఆదివారం అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో విచారించారు. వీఆర్వోల ఎదుట స్టేట్‌మెంట్‌ను తీసుకున్నట్లు తెలిసింది. అనిల్ గతంలో మాట్లాడిన వీడియోల ఆధారంగా 'నువ్వే కదా ఈ వీడియోలో మాట్లాడింది' అని ప్రశ్నించినట్లు తెలిసింది. 3 రోజుల కస్టడీ తర్వాత అతనికి సోమవారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించి, స్థానిక కోర్టులో హాజరుపరిచిన తర్వాత రాజమండ్రి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ప్రయాణ సమయాన్ని చూపి మంగళవారం ఉదయం అక్కడి కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

» 11న రాయలసీమ, దక్షిణ కోస్తాలో వర్షాలు



విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి స్థిరంగా కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉండగా, ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి సోమవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. తరువాత కూడా పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 11వ తేదీనాటికి శ్రీలంక, తమిళనాడు తీరాలకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో 11వ తేదీన రాయలసీమలో విస్తారంగా, దక్షిణ కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తా, రాయలసీమలో ఎక్కువ ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

అన్నదాతలను అప్రమత్తం చేయాలి: కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కల్లాల్లో ధాన్యం తడవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వరి కోతలు వాయిదా వేసుకునేలా అన్నదాతలను అప్రమత్తం చేయాలని ఆదివారం రాత్రి కలెక్టర్లు, జేసీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రైతులు నూర్పిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వరికుప్పలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాలు తగ్గే వరకు రైతులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వ్యవసాయశాఖను ఆదేశించారు.

వెనక'బడి'ంది!

» ఒక్క పాఠశాలకూ దక్కని 5 స్టార్ రేటింగ్

» నాలుగు స్టార్లు దక్కిన బడులూ తక్కువే

» ఏకంగా 398 బడులకు జీరో స్టార్ రేటింగ్

» సర్కారు స్కూళ్లలో సదుపాయాల లేమి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చాలాచోట్ల మౌలిక సదుపాయాలు ఉంటే సరైన ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న చోట సదుపాయాలు అంతంతమాత్రంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల అసలు ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన బడి రాష్ట్రంలో ఒక్కటీ లేదు. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాల (లెర్నింగ్ అవుట్‌కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ బడి ఏ స్థాయిలో ఉంది? అనే కోణంలో వివరాలు సేకరించడంతో ఇప్పటివరకూ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా ఉత్తదేనని తేలిపోయింది. బడుల్లో మౌలిక సదుపాయాలకు 5 స్టార్లు, అభ్యసన ఫలితాలకు 5 స్టార్లు ప్రామాణికంగా ఈ అధ్యయనం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 45,087 ఉంటే... వాటిలో ఏ ఒక్కటి కూడా కనీసం ఒక విభాగంలోనూ ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. మరోవైపు సదుపాయాల్లో 87, అభ్యసన ఫలితాల్లో 311 బడులకు అసలు రేటింగే దక్కని (జీరో రేటింగ్) దారుణమైన స్థితిలో ఉన్నాయి.

> విద్యారంగంలో సంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసం పాఠశాలలను దీన స్థితిలోకి నెట్టేసింది. చదువులను గాలికొదిలి టోఫెల్, బైజూస్, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యా ప్రమాణాలను దారుణంగా దెబ్బతీశాయి. విద్యార్థుల హాజరు, ఫలితాలను పట్టించుకోకుండా టీచర్లకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో పాటు బోధన సమయాన్ని తగ్గించడంతో పిల్లల చదువులు అటకెక్కాయి. 'నాడు-నేడు'తో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే మార్చేస్తామని ప్రగల్భాలు పలికినా.. ఆ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో బడుల్లో మౌలిక సదుపాయాలూ అంతంతమాత్రంగానే ఉన్నాయని తేలిపోయింది. గత ప్రభుత్వం తీరుతో ఇప్పుడు పాఠశాలలు సింగిల్ స్టార్ దక్కించుకోవడానికే ఆపసోపాలు పడుతున్నాయి.

సొంత భజనతో సరి

రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. 'నాడు- నేడు'తో బడి స్వరూపాన్ని మార్చేశామని జగన్ పదే పదే సొంత భజన చేసుకున్నారు. తీరా ఇప్పుడు మౌలిక సదుపాయాల విభాగంలో ఒక్క పాఠశాల కూడా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించలేకపోయింది. అదేవిధంగా అభ్యసన ఫలితాల్లో సైతం ఒక్కటీ ఫైవ్ స్టార్ సాధించకపోగా, కేవలం 41 పాఠశాలలు మాత్రమే ఫోర్ స్టార్ సాధించాయి. మిగిలిన 45 వేల పైచిలుకు బడులన్నీ త్రీ స్టార్, అంతకంటే తక్కువ స్థాయికే పరిమితమయ్యాయి.

స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. బడిలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడా మైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితరాలను పరిశీలించారు. ఒక్కో అంశానికి 5 చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన బడులకు 5 స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గతేడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదో తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40 శాతం, ఫలితాలకు 60 శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండూ కలిపి 90 శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న బడులకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు.

అన్ని జిల్లాల్లోనూ అదే తీరు

ప్రభుత్వ పాఠశాలల స్థితి దాదాపుగా అన్ని జిల్లాల్లోనూ ఒకేలా ఉంది. అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 2,913 బడులకు గాను 161 చోట్ల మాత్రమే మౌలిక సదుపాయాలు పరవాలేదన్నట్టుగా ఉన్నాయి. అయితే అభ్యసన ఫలితాలు మాత్రం దిగజారిపోయాయి. ఈ విభాగంలో ఒక్క బడి కూడా నాలుగు స్టార్లు సాధించలేదు. అనకాపల్లి, అనంతపురం, బాపట్ల, కాకినాడ, కర్నూలు, ఎన్టీఆర్, నెల్లూరు, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లోనూ ఒక్క పాఠశాలకూ నాలుగు స్టార్లు దక్కలేదు. ఎక్కువ పాఠశాలలు రెండు, మూడు స్టార్లతోనే సరిపెట్టుకున్నాయి.

బడులకు ఇచ్చిన రేటింగ్‌లు ఇలా..

స్టార్ రేటింగ్	మౌలిక సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	87	311
ఒక్క స్టార్	1,958	14,095
టూ స్టార్	16,816	26,272
త్రీ స్టార్	19,438	4,368
ఫోర్ స్టార్	6,788	41
ఫైవ్ స్టార్	0	0

ఫలితాల్లేని సదుపాయాలెందుకు?

వైసీపీ ప్రభుత్వం బడులను రాజకీయ ప్రచారానికి వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్లక్ష్యం చేసింది. టీచర్లకు నాడు- నేడు పనులు, మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. కానీ జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను పెడచెవిన పెట్టింది. పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్టుగా మార్చేసి, ఫలితాలను దిగజార్చింది.

నవ్య | చిత్రజ్యోతి

పోరాట వీరుడి కథ



విజయ్ సేతుపతి, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. కాగా, ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను కథానాయకుడు విజయ్ సేతుపతి చెన్నైలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ 'పెరుమాళ్ అనే పాత్రలో విజయ్ సేతుపతి అభినయం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉండబోతోంది. పెరుమాళ్ పోరాట వీరుడిగా ఎలా మారాడు అనేది ఎంతో ఆసక్తికరంగా ఈ చిత్రంలో వెట్రిమారన్ ప్రజెంట్ చేశారు. తెలుగులో విజయ్ సేతుపతికి ఎందరో అభిమానులు ఉన్నారు. ఈ చిత్రంలో ఎమోషన్స్ యాక్షన్ అన్నీ రియాల్టీకి దగ్గరగా ఉంటాయి. ఇళయరాజా సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటుంది' అని అన్నారు. మంజువారియర్, సూరి, భవాని శ్రీ, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సూర్య సేతుపతి, అనురాగ్ కశ్యప్, రాజీవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. కాగా, గతేడాది రిలీజైన 'విడుదల' పార్ట్ 1 చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకొని సూపర్ హిట్‌గా నిలిచింది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటిస్తున్న చిత్రం 'కిల్లర్'. పూర్వజ్, ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మాతలు. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వజ్, హీరోయిన్ జ్యోతి పూర్వజ్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. ప్రస్తుతం రెండో షెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిల్మ్ సిటీ, మొయినాబాద్ లొకేషన్స్‌లో జరిగే ఈ చిత్రీకరణలో గౌతమ్, జ్యోతి పూర్వజ్ పాల్గొంటారు.

డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్



తెలుగు ఫిల్మ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జోసెఫ్ ప్రకాశ్ ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ప్రకాశ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. అధ్యక్షుడిగా ప్రకాశ్ ఎన్నికవడం ఇది ఐదోసారి. కాగా, జానీని అధ్యక్షుడిగా తొలగించడంతో పాటు ఆయన సభ్యత్వాన్ని కూడా రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జానీపై పోక్సో కేసు విచారణలో ఉండటం, అసోసియేషన్‌లో జానీ ప్రవర్తన అగ్రెసివ్‌గా ఉండేదనే రిపోర్టు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

మోహన్‌బాబు.. మనోజ్ మధ్య గొడవ?





సినీ నటుడు మంచు మోహన్‌బాబుకు ఆయన చిన్న కొడుకు మనోజ్‌కు మధ్య ఆస్తుల పంపకాల విషయంలో గొడవ జరిగినట్లు మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ విషయం సినీ ఇండస్ట్రీతో పాటు.. అభిమానుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పహాడీషరీఫ్ పరిధిలోని మోహన్‌బాబు ఇంట్లో ఆస్తుల పంపిణీ జరుగుతున్న క్రమంలో స్కూలుకు సంబంధించిన వాటాల్లో విభేదాలు తలెత్తి మోహన్‌బాబు అనుచరులు వినయ్ ఇతర బౌన్సర్లు మనోజ్‌పై, ఆయన భార్య మౌనికపై దాడికి పాల్పడి గాయపరిచినట్లు.. గాయాలతోనే మనోజ్ తన భార్యతో కలసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ విషయమై మహేశ్వరం డీసీపీని సంప్రదించగా డయల్-100కు కాల్ వచ్చిందని, వ్యక్తిగతంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. కాలుకు గాయం అయిన మంచు మనోజ్ తన భార్య మౌనికతో కలసి బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చారు. తండ్రితో జరిగిన గొడవ విషయమై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. మనోజ్, మౌనిక మాట్లాడటానికి నిరాకరించారు. కాగా, మనోజ్ ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో డిశ్చార్జి అయ్యారు. మనోజ్‌కు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) పూర్తి చేసిన వైద్యులు ఆయన ఒంటిపై అనుమానాస్పద దెబ్బలు ఉండటంతో ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాలు, మెడ భాగంలో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారని తెలిసింది. సిటీ స్కాన్, అల్ట్రా సౌండ్ పరీక్షలు పూర్తి చేసిన వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉండాలని సూచించగా.. సోమవారం మరోసారి ఆస్పత్రికి వస్తానని మనోజ్ డిశ్చార్జి అయినట్లు తెలిసింది.

అంతా అబద్ధం : మోహన్‌బాబు

ఆస్తుల పంపకాల్లో మా ఇంట్లో గొడవలు జరిగాయని.. మనోజ్‌ను నేను కొట్టానని ఉదయం నుంచి మీడియాలో షికార్లు చేస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని మోహన్‌బాబు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేయొద్దంటూ మీడియాకు సూచించారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

14న ఎన్టీఆర్ సినీ ప్రస్థాన వజ్రోత్సవం



నందమూరి తారకరామారావు సినీ ప్రస్థాన వజ్రోత్సవం ఈ నెల 14న పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరుగుతుందని ఆయన కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల చైర్మన్ టీడీ జనార్దన్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో టీడీ జనార్దన్ మాట్లాడుతూ "సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్‌కు సాటి లేదు. కృష్ణుడిగా, రాముడిగా నటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆయన తొలిసారి నటించిన 'మనదేశం' చిత్రం 75 ఏళ్లు అయిన సందర్భంగా ఈ వేడుకను ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 'మనదేశం' చిత్ర నిర్మాత కృష్ణవేణి, దర్శకుడు ఎల్వీ ప్రసాద్ కుమారుడు రమేశ్ ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో పాటు పలువురు చిత్ర పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌తో పాటు 24 క్రాఫ్ట్స్‌తో పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది" అని అన్నారు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, సెక్రటరీ దామోదర్ ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు అనుపమరెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

- ధర్నాచౌక్, విజయవాడ (ఆంధ్రజ్యోతి)

ఒక్కసారి ప్రేమిస్తే చాలు



బాలీవుడ్ సీనియర్ నటి రేఖ రీసెంట్‌గా ఓ రియాల్టీ షోలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనేక అంశాలను పంచుకున్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే ప్రేమలో పడతారని కవులు తమ రచనల్లో రాస్తే...మరికొందరు మాత్రం ప్రేమకు ఆది, అంతం లేదంటున్నారు. దీనిపై మీ అభిప్రాయం ఏమిటి అని యాంకర్ రేఖను ప్రశ్నించగా..'నా మటుకు, ఆ వ్యక్తి సరైన వాడైతే... ఒక్కసారి ప్రేమిస్తే చాలు' అని బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానంగా నిజమైన ప్రేమకు నిర్వచనం చెబుతూ 'ఎవరినైనా ప్రేమించండి, నా వరకైతే నేను మొదట అన్నిటినీ ప్రేమిస్తాను. నా వృత్తిని, నా స్నేహితులను, ఈ ప్రపంచాన్ని, ప్రకృతిని ఇలా...ప్రతీదాన్ని ప్రేమిస్తాను. కానీ, నన్ను నేను ఎక్కువగా ప్రేమిస్తా' అని చెప్పుకొచ్చారు. రేఖ మాటలు విన్న ప్రేక్షకులు ప్రశంసల జల్లు కురిపించారు.



మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి

ఇటీవలే 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ప్రస్తుతం ఆమె మరో వెబ్ సిరీస్ 'రక్త్‌బ్రహ్మాండ్'లో నటిస్తున్నారు. 'ద బ్లడీ కింగ్‌డమ్' అనేది ఉపశీర్షిక. తాజాగా, కొద్ది గ్యాప్ తర్వాత ఈ సిరీస్ సెట్స్‌లోకి ఆమె తిరిగి అడుగుపెట్టారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బ్యాక్ టూ యాక్షన్ మోడ్ అని పేర్కొన్నారు. 2018లో విడుదలైన హారర్ చిత్రం 'తుమ్‌బాడ్'తో గుర్తింపు తెచ్చుకున్న అనిల్ బార్వే దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యాంటసీ వెబ్‌సిరీస్‌ను రాజ్ అండ్ డీకే నిర్మిస్తున్నారు. ఈ నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, ఆలీ ఫాజల్, వామికా గబ్బీ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



అరకులో మాస్ జాతర

రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'సామజవరగమన' రచయిత భాను భోగవరపు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆఫీసర్ పాత్రలో రవితేజ నటిస్తున్నారని వార్తలొస్తున్నాయి. సినిమా తాజా షెడ్యూల్ డిసెంబరు మూడో వారంలో అరకులో ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆ తరవాత పాడేరు, ఆంధ్రా-ఒడిషా సరిహద్దు లొకేషన్స్‌లో చిత్రీకరణ జరగనున్నట్లు తెలిసింది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అసత్య ప్రచారాన్ని ఆపండి

- రెహమాన్ కుమార్తె ఖతీజా



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన భార్య సైరా బానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయనపై పలు ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీటిని ఎప్పటికప్పుడు రెహమాన్ కుటుంబ సభ్యులు తిప్పికొడుతూనే ఉన్నారు. అయితే రీసెంట్‌గా మరో వార్త వైరల్ అవుతోంది. వైవాహిక బంధానికి స్వస్తి పలికిన రెహమాన్..సంగీతానికి కొంత కాలం దూరంగా ఉండనున్నారంటూ కోలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. రెహమాన్ మ్యూజిక్‌ని మిస్ అవ్వాల్సిందేనా? అంటూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు పోస్టులు పెట్టారు. ఈ వార్తలపై ఇప్పటికే రెహమాన్ కుమార్తె ఖతీజా 'ఎక్స్' వేదికగా స్పందించారు. అయినా రూమర్లు ఆగకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మరోసారి రియాక్ట్ అయ్యారు. 'దయచేసి అసత్య ప్రచారాన్ని ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. వార్తను ప్రచురించిన ఓ మీడియాను కోట్ చేస్తూ అలా రాయడం సబబు కాదన్నారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్త!

మనం ఇళ్లలో సాధారణంగా కుక్కలు, పిల్లులు, మేకలు లాంటి జంతువుల్ని చిలుకలు, బాతులు, పావురాలు లాంటి పక్షులను పెంచుకుంటూ ఉంటాము. వీటి ఆరోగ్యం, పరిశుభ్రత తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఉంటాం. అయినప్పటికీ పెంపుడు జంతువులు లేదా పక్షుల నుంచి మనకు కొన్ని అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. వాటి గురించి తెలుసుకుందాం!

రేబిస్: పిల్లలకు పాలిచ్చి పెంచే క్షీరదజాతి జంతువులైన కుక్కలు, పిల్లులు, తదితరాల నుంచి రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన జంతువుల లాలాజలంలో వ్యాధికారక క్రిములు ఉంటాయి. పెంపుడు జంతువులతో దగ్గరగా మసలుతున్నపుడు అవి కరచినా, తుమ్మినా వ్యాధి క్రిములు మన శరీరంలోకి చేరతాయి. తీవ్రమైన తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం వంటివి రేబిస్ లక్షణాలు. ఇది ప్రాణాంతక వ్యాధి. రేబిస్ వేక్సిన్ తీసుకున్నప్పటికీ ఆర్నెల్ల నుంచి రెండేళ్ల వరకు మాత్రమే రక్షణ లభిస్తుంది. పెంపుడు జంతువులతో గడుపుతున్నపుడు మాస్కులు ధరించడం, తరచూ చేతులు పరిశుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. పెంపుడు జంతువులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేయించి అవసరమైన చికిత్సలు అందించాలి.

బర్డ్ ఫ్లూ: ఇది కోళ్లు, బాతుల వల్ల వ్యాప్తి చెందుతుంది. వీటివల్ల మనుషులకే కాదు జంతువులకు కూడా బర్డ్ ఫ్లూ వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పక్షుల రెట్టలు, లాలాజలం, కళ్ల స్రావాల్లో వ్యాధి కారక వైరస్ ఉంటుంది. బర్డ్ ఫ్లూ వ్యాధికి గురైన వారిని దగ్గు, శ్వాసకోశ ఇబ్బందులు, తలనొప్పి, జ్వరం,



కండరాల నొప్పి, ముక్కు కారడం, గొంతు నొప్పి లాంటివి వేధిస్తుంటాయి. ఈ లక్షణాలు కనిపించి రెండు రోజులైనా తగ్గని పక్షంలో వైద్యుని సంప్రదించాలి. కోళ్లని పెంచుతున్నపుడు అవి ఉన్న ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలి. కనీసం రెండు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి.

గోండి: ఈ వ్యాధి పిల్లుల మల మూత్రాల వల్ల వ్యాప్తి చెందుతుంది. పిల్లులు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో ఉండే ఇసుక కూడా హానికారకమే. ఈ వ్యాధి సోకినపుడు కండరాల నొప్పి, కీళ్ల వాపు, జలుబు బాధిస్తుంటాయి. పిల్లులను పెంచేవారు తరచూ చేతులను శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇంటి చుట్టూ మొక్కలను పెంచుతున్నట్లయితే అక్కడ కూడా పిల్లులు తిరుగుతూ ఉంటాయి కాబట్టి కుండీల్లో మట్టిని మార్చడం, తోటపని తరవాత చేతులు, గోళ్లను వేడి నీటితో కడుక్కోవాలి. ఒకసారి ఈ వ్యాధికి గురయితే దీనిని నివారించడం అసాధ్యం.



రెండు నెలల కిందట విజయవాడను వరదలు చుట్టిముట్టినప్పుడు... అందరిలా ఆమె ఇంట్లో టీవీ చూస్తూ 'అయ్యో పాపం' అనుకొని సరిపెట్టుకోలేదు. పిల్లల చదువు కోసం దాచిన రూ.28 లక్షలతో ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులకు అమ్మలా అన్నం పెట్టారు. ఆపన్నుల అవసరాలు తీర్చి ఆదుకున్నారు. అంతేకాదు... వ్యక్తిత్వ వికాస, పోషకాహార నిపుణురాలుగా, సామాజిక కార్యకర్తగా సమాజంలో ఒక గట్టి మార్పు కోసం కృషి చేస్తున్న **తులసి పద్మశ్రీ** 'నవ్య'తో పంచుకున్న విశేషాలు...



ఆపన్నులకు ఆసరాగా...

"మా వారి పేరు శ్రీనివాస్. రక్షణ రంగంలో మాజీ ఉద్యోగి. ఆయన ఉద్యోగ రీత్యా దేశంలోని చాలా ప్రదేశాల్లో కాపురం ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం విజయవాడలోని ఒక బ్యాంక్‌లో ఆయన పని చేస్తుండడంతో పన్నెండు ఏళ్లగా ఇక్కడే ఉంటున్నాం. నేను 2002లో ఇంటర్మీడియెట్ పూర్తి చేశాక మా వివాహం జరిగింది. నాకు ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగం చేయాలని ఉండేది. ఈ విషయంలో కుటుంబంలో కొంచెం ప్రతిఘటన ఎదురైనా నా భర్త మద్దతుతో ముందడుగు వేశా. ఎమ్మెస్సీ బోటనీ, న్యూట్రిషన్‌తో పాటు యోగా, సెఫాలజీలో డిప్లమా పూర్తి చేశా. నా ఇద్దరు పిల్లల్లో అబ్బాయి శ్రేయాన్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అమ్మాయి యశశ్విని 'నీట్' లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకుంటోంది. ఒక పక్క కుటుంబాన్ని చూసుకుంటూనే నా కెరీర్‌ను మలుచుకుంటూ వచ్చాను. ఇప్పటివరకు నేను ఎనిమిది విభిన్నమైన ఉద్యోగాలు చేశాను. మావారు గోవాలో డిఫెన్స్‌లో పనిచేస్తున్నప్పుడు అక్కడ స్కూల్ టీచర్‌గా చేశాను. అలాగే యోగా, కమ్యూనికేషన్ నైపుణ్యాల్లో శిక్షకురాలుగా, 'దూరదర్శన్'లో యాంకర్‌గా... ఇలా నాకు ఆసక్తి, అభిరుచి ఉన్న రంగాల్లో పనిచేస్తూ వచ్చాను. 2014లో రాజమండ్రి గైట్, ఆ తర్వాత జేకేసీ ఇంజనీరింగ్ కళాశాలల్లో సాఫ్ట్ స్కిల్స్ శిక్షకురాలుగా విధులు నిర్వహించా. మరోవైపు... పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం, మహిళా సాధకారితపై కేంద్ర ప్రభుత్వం ముంబాయి, అహ్మదాబాద్‌లలో నిర్వహించిన సదస్సులకు హాజరై, ఆ అంశాల గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. వాటి గురించి ఇతరులకు అవగాహన కల్పించడం ప్రారంభించాను.

కన్నీళ్లు ఆగలేదు...

ఈ ఏడాది సెప్టెంబరులో విజయవాడను వరదలు చుట్టిముట్టినప్పుడు... టీవీలో వార్తలు చూసి తొలుత ఆందోళన చెందాను. నా దగ్గర గతంలో పనిచేసిన వారు అక్కడ ఉన్నారని తెలుసుకొని, వారికి ఫోన్ చేసి, పరిస్థితి తెలుసుకున్నాను. ఇళ్లు మునిగిపోయి వారు భయపడుతూంటే ధైర్యం చెప్పాను. 'నేను వస్తున్నా' అని బయలుదేరా. అక్కడి పరిస్థితులు చూసి కన్నీళ్లు ఆగలేదు. నీళ్లు ఎక్కువగా ఉండడంతో వారిని ఆ సమయంలో కలవడానికి సాధ్యపడలేదు. అయితే, వారందరికీ ఏదో రకంగా సాయం చేయలనిపించింది. మా అమ్మాయి వైద్య విద్య కోసం దాచుకున్న రూ.28 లక్షల్లో కొంత వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు వినియోగిద్దామని నా భర్తకు, పిల్లలకు చెప్పాను. వారు 'సరే'నన్నారు. వెంటనే పనులు ప్రారంభించాను. నా ఒక్కదాని వల్లే అంత మందికి సాయం చేయడం సాధ్యం కాదని గుర్తించి... నా పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చాను. నా కుటుంబ సభ్యులు, గతంలో నా క్లాసులు విన్న విద్యార్థులు, మా పిల్లల స్నేహితులు... ఇలా 460 మందికి పైగా వాలంటీర్లుగా పనిచేయడానికి ముందుకొచ్చారు. మొదట యనమలకుదురు, రామలింగేశ్వర నగర్, సింగ్ నగర్ ప్రాంతాల్లో 7,300 మందికి ఎనిమిది రోజుల పాటు మంచి భోజనాన్ని బాక్సులల్లో అందించాం. ఆ తర్వాత 2,200 మందికి పైగా బాధితులకు మందులు, దుప్పట్లు ఇచ్చాం. వరద ఉధృతి తగ్గాక 1,200 మందికి నిత్యావసర వస్తువులు పంచిపెట్టాం. వరద ఉధృతితో రోడ్డు మార్గం మూసుకుపోతే... నాలుగు కిలోమీటర్ల దూరం రైల్వే పట్టాలపై నడిచి వెళ్లి సాయం అందించాం. ఇవన్నీ చేసేసరికి మా దగ్గరున్న రూ.28 లక్షలూ పూర్తిగా ఖర్చు అయిపోయాయి. 'ఇంకాస్త ఎక్కువ డబ్బు దాచి ఉంటే మరికొంతమందికి సాయపడే దాన్ని' అనిపించింది.

> **చులకన భావం పోవాలి...**
>
> గతంలో మా దగ్గర పనిచేసే డ్రైవర్ మొదలు సూపర్‌వైజర్ వరకు ఏదైనా పని గురించి నేను ఎంత మంచిగా చెప్పినా సరిగ్గా లెక్క చేసేవారు కాదు. కొంచెం గట్టిగా అడిగితే... అదో విధంగా సమాధానం చెప్పేవారు. అదే నా స్థానంలో ఒక పురుషుడు ఉండి ఉంటే... వారిని తిడుతూ మాట్లాడినా వారు పట్టించుకోకుండా పనిచేసేవారు. ఆడ, మగ అనే తేడా లేకుండా ఎవరి మాటకైనా ఒక రకమైన విలువనివ్వాలి. మన సమాజంలో మహిళలంటే చులకన భావం పోవాలి. మహిళలు, పురుషులు సమానమనే భావన కలగాలి. అప్పుడే సమాజంలో మహిళలకు సంపూర్ణ గౌరవం లభిస్తుంది.

'మార్పు'నకు శ్రీకారం...

ఈ మధ్య పిల్లల్లో పెరుగుతున్న పౌష్టికాహారం లోపంతోపాటు దుందుడుకుతనం, తెంపరితనం, మొండితనం లాంటి లక్షణాల మీద అధ్యయనం చేశాను. వాటికి దారితీసే కారణాలు, పరిస్థితులను అంచనా వేసి ఒక ప్రాజెక్టును తయారు చేశాను. నేటి బాలలే రేపటి పౌరులు. భవిష్యత్ సమాజానికి ఆస్తి వారే కాబట్టి వారిని బాల్యం నుంచే మంచి లక్షణాలతో తీర్చిదిద్దితే వచ్చే తరం బాగుంటుంది. ముఖ్యంగా పేదపిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలల్లో నా ప్రాజెక్ట్ అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయనే ఆలోచనతో 'మార్పు' అనే స్వచ్ఛంద సంస్థను ఈ ఏడాది జూలైలో ప్రారంభించాను. దానిద్వారా ఇప్పటి వరకు 23 పాఠశాలల్లో సుమారు 2,500 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించాం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లల్లో 20 శాతం మందే చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. మిగిలిన వారు వివిధ కారణాలవల్ల అట్టడుగు స్థానంలోనే కొట్టుమిట్టాడుతున్నారు. అలాంటి పిల్లలకు చేయూతనిచ్చి, వారిని ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే ఉద్దేశంతో 'ఇంటరాక్టివ్ సెషన్స్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను. ఈ ప్రాజెక్టును ప్రధానంగా... పెద్దలను గౌరవించడం, ఆహార నియమాలు (డైట్), కెరీర్ గైడెన్స్, సామాజిక బాధ్యత, మొబైల్ వినియోగం అనే అయిదు అంశాలతో రూపొందించాం. ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ఇంట్లోని పెద్దవారు 'ఏది మంచి, ఏది చెడు' అని పిల్లలకు చెప్పేవారు. నేటి పిల్లల్లో చాలామందికి ఆ అవకాశం దొరకడం లేదు. అందుకే ఈ ఐదు అంశాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధిస్తే వారి భవిత బంగారమవుతుంది. ఈ ప్రాజెక్టు గురించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు గారిని కలిసి వివరించాను. ఆయన సానుకూలంగా స్పందించి, దీనిపై కసరత్తు చేయమని ప్రభుత్వ అధికారులను కూడా ఆదేశించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు గురించి ప్రభుత్వాధికారులతో చర్చలు జరుగుతున్నాయి. ప్రభుత్వం చేయూతనిస్తే దాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి... పేద పిల్లలు వారి జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు తోడ్పడతాను."

● సంజయ్ ఎస్ఎస్‌బి



మెరిసే చర్మం కోసం పండ్ల రసాలు

చలికాలంలో చర్మం ఎక్కువగా తేమను కోల్పోతుంది. దీని వల్ల చర్మం పొడిబారి పగులుతుంటుంది. చర్మంపై తెల్లని పొరలు ఏర్పడి నిర్జీవంగా మారుతుంది కూడా. ఇలా కాకుండా చర్మం మృదువుగా నిగనిగలాడాలంటే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్ల రసాలు తాగాలి.

క్యారట్-నారింజ రసం

క్యారట్‌లో బీటా కెరోటిన్ సమ్మేళనాలు, ఎ విటమిన్ అధికంగా ఉంటాయి. ఎ విటమిన్ చర్మంలో కొత్త కణాల ఉత్పత్తికి దోహదం చేస్తుంది. నారింజలో సి విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మంలో కొల్లాజెన్ వృద్ధి పొందేలా చేస్తుంది. చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడుతుంది. మిక్సీ గిన్నెలో రెండు క్యారట్‌లను చిన్న ముక్కలుగా కోసి వేయాలి. అందులో ఒక నారిజ పండును తొక్క, గింజలు తీసి వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని అలాగే గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలిపి తాగాలి. ఈ రసం చర్మానికి తేమను, కాంతిని అందిస్తుంది. ముడతలను పోగొడుతుంది.

బీట్‌రూట్-యాపిల్ రసం

బీట్‌రూట్‌లో ఐరన్, సి విటమిన్ ఉంటాయి. ఇవి రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. చర్మానికి పోషకాలను, ఆక్సిజన్‌ని అందిస్తాయి. యాపిల్‌లో విటమిన్లు, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మం నుంచి విషపదార్థాలను తొలగిస్తాయి. మిక్సీ గిన్నెలో ఒక చిన్న బీట్‌రూట్‌ను తొక్క తీసి ముక్కలుగా కోసి వేయాలి. అందులోనే ఒక యాపిల్‌ను ముక్కలుగా కోసి వేయాలి. అర గ్లాసు నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. దీనిని గ్లాసులో పోసి రెండు చెంచాల నిమ్మరసం కలుపుకుని తాగాలి. ఈ బీట్‌రూట్-యాపిల్ రసం చర్మానికి పోషణను, మెరుపుని ఇస్తుంది.

దానిమ్మ రసం

దానిమ్మలో ఆంథోసియానిన్స్, పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కాపాడతాయి. చర్మం మీద గీతలు, ముడతలు రాకుండా చేస్తాయి. సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వల్ల చర్మానికి నష్టం కలుగకుండా చేస్తాయి. ఒక పెద్ద దానిమ్మ పండును ఒలిచి గింజలను మిక్సీ గిన్నెలో వేయాలి. అందులో అరగ్లాసు నీళ్లు పోసి గ్రైండ్ చేయాలి. ఈ రసాన్ని గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలుపుకొని తాగాలి. ఈ రసం చర్మానికి రక్తం పట్టేలా చేసి ఆరోగ్యంగా ఉంచుతుంది.

బొప్పాయి-అనాస రసం

బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది చర్మంలోని మృత కణాలను తొలగిస్తుంది. అనాసలో సి విటమిన్ ఉంటుంది. ఇది ముఖం మీద మొటిమల వల్ల ఏర్పడిన మచ్చలను పోగొడుతుంది. మిక్సీ గిన్నెలో ఒక కప్పు బొప్పాయి ముక్కలు, అర కప్పు అనాస పండు ముక్కలు వేసి అర గ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా తేనె కలుపుకుని తాగితే చర్మానికి తగినంత తేమ అంది నున్నగా మెరుస్తుంది.

కీరా-నిమ్మ రసం

కీరాలో 95 శాతం నీళ్లు, సిలికా మినరల్స్ ఉంటాయి. ఇవి చర్మానికి తేమ, పోషణ అందిస్తాయి. నిమ్మరసం చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. మిక్సీ గిన్నెలో ఒక కప్పు కీరా ముక్కలు, రెండు చెంచాల నిమ్మరసం, కొన్ని పుదీనా ఆకులు వేసి అరగ్లాసు నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీనిని గ్లాసులో పోసి ఒక చెంచా తేనె కలుపుకుని తాగాలి. ఈ రసం చర్మానికి మంచి రంగుని మృదుత్వాన్ని అందిస్తుంది.

ఆదర్శం



బతుకు... బతికించు

జీవితమంతా కుటుంబ బాధ్యతలతోనే గడిచిపోయింది. తిరిగి చూసుకొంటే తనది అని చెప్పుకోవడానికి ఏమీ కనిపించలేదు. కానీ కూతురు ప్రోత్సాహం... ఆమెలో స్ఫూర్తి రగిలించింది. వయసు మీదపడుతున్నా లెక్క చేయక... మనసుకు దగ్గరైన పనికి పూనుకున్నారు. స్వచ్ఛంద సంస్థలతో కలిసి... కష్టాల్లో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. అరవై ఏళ్ల **అపర్ణా దాస్** అంతరంగం ఇది.



"పక్కవారికి కష్టం వస్తే స్పందించడం మన కనీస కర్తవ్యం. నేను చేస్తున్నది అదే. అభాగ్యులకు అండగా, ఒక మనిషిగా తోచిన సాయం అందిస్తున్నాను. అనాథలను సాధికారత వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నాను. ఈ ప్రయత్నం ప్రారంభించడానికి నేను ఎన్నో ఏళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని బరాసత్ పట్టణంలోని ఓ మధ్యతరగతి కుటుంబం మాది. చిన్న వయసులోనే నాకు పెళ్లి చేశారు. అది మొదలు ఎన్నో బాధ్యతలు ఒక్కసారిగా నెత్తిన పడ్డాయి. మావారిది ఉమ్మడి కుటుంబం. వాళ్లు పదిమంది అన్నదమ్ములు. అత్తగారు, మామగారు... ఇల్లు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉండేది. ఎవరికి ఏం కావాలన్నా నేనే చూసుకోవాలి. తెల్లవారుజాము నిద్ర లేచింది మొదలు... రాత్రి పడుకొనే వరకు ఓ పది నిమిషాలు కూర్చోడానికి కూడా సమయం దొరికేది కాదు. 1994లో మా అమ్మాయి పుట్టింది. పని భారం మరింత పెరిగింది. తనను పెంచి, పెద్ద చేయడం మీద శ్రద్ధ పెట్టాను. ఈ క్రమంలో నన్ను నేను కోల్పోయాను. నేను కన్న కలలు, అభిరుచులు, నాకంటూ ఒక జీవితం లేకుండా పోయాయి.

మా అమ్మాయి ప్రోత్సాహంతో...

లేచింది మొదలు ఇంట్లో అటూ ఇటూ పరుగెత్తడంతోనే దశాబ్దాలు గడిచిపోయాయి. నా బాధంతా పని గురించి కాదు... నాకు నచ్చినవేవీ చేయలేకపోతున్నాననే ఆవేదన. సామాజిక సేవ చేయాలనేది నా చిన్ననాటి కోరిక. పెళ్లితో ఆ కల నెరవేరే మార్గమే కనిపించలేదు. మా అమ్మాయి పెరిగి పెద్దదయింది. ఉన్నత చదువుల కోసం కోల్‌కతాకు వెళ్లింది. అప్పుడు నాకు కాస్త ఖాళీ సమయం దొరికింది. నన్ను చూసి నా కూతురు సుపర్ణ ఎప్పుడూ బాధపడుతూ ఉండేది. 'నా కోసం, మన కుటుంబం కోసం నువ్వు నీ జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించావు. ఎన్నో త్యాగాలు చేశావు. వాటన్నిటినీ తిరిగి తీసుకురాలేము. కానీ నువ్వు కోరుకున్నట్టు సామాజిక సేవ వైపు అడుగులు వెయ్యి. అందుకు నేను సహకరిస్తాను' అని మా అమ్మాయి చెప్పింది. తన మాటలు నాకు ప్రేరణనిచ్చాయి.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి...

నాకు యాభై ఏళ్ల వయసులో నేను కోరుకున్నట్టు సామాజిక సేవ వైపు అడుగులు వేశాను. ఆ క్షణం నన్ను నేను నమ్మలేకపోయాను. అసలు ఇలాంటి రోజు ఒకటి నా జీవితంలో వస్తుందని అనుకోలేదు. మా ప్రాంతంలోని 'కిషాలయా చిల్డ్రన్స్ హోమ్'కు వెళ్లాను. అక్కడ వాలంటీర్‌గా పని ప్రారంభించాను. తొలుత ఖాళీ సమయాల్లో పని చేద్దామని భావించాను. కానీ ఒక్కసారి అందులోకి దిగాక... ఇక అదే నా జీవిత లక్ష్యం అయిపోయింది. 'కిషాలయా' అనేది అనాథ ఆశ్రమం. అక్కడి పిల్లలకు విద్యాబుద్ధులతో పాటు జీవిత విలువలు బోధించాను. వారందరినీ నా సొంత బిడ్డల్లా చూసుకున్నాను. అలాగే 'ఆరాధన సోషల్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్'తో కలిసి నడిచాను. అందులోని చిన్నారులకు స్వశక్తితో ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యశిక్షణ ఇచ్చాను. చిన్నప్పటి నుంచే వృత్తి విద్యల వైపు ప్రోత్సహించాను. ఎందుకంటే వారికి నా అనే వారెవరూ ఉండరు. అలాంటివారి భవిష్యత్తు నిర్మాణ బాధ్యత మనదే కదా.

డబ్బే ప్రధానం కాదు...


సామాజిక సేవ చేయాలంటే ఎంతో డబ్బు ఖర్చు పెట్టాలని చాలామంది భావిస్తుంటారు. నా దృష్టిలో నిజమైన సేవకు డబ్బే ప్రధానం కాదు. దానికి కావల్సింది మానవత్వంతో స్పందించే హృదయం. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే నిధులు వాటంతట అవే సమకూరుతాయనేది నా నమ్మకం. డబ్బు ఇవ్వమని నేను ఎవరి వద్దకూ వెళ్లలేదు. ఇస్తే వద్దనలేదు. ఈ వయసులో కూడా నేను కష్టపడి సంపాదిస్తున్నాను. వచ్చినదంతా అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాల్లోని వారి కోసం ఖర్చు చేస్తున్నాను. వృద్ధాశ్రమాల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో దీన గాథ. పిల్లల కోసం అహర్నిశలూ చెమటోడ్చి, ఉన్నదంతా ధారపోసి, వయసు మీద పడ్డాక చివరకు ఇలా వృద్ధాశ్రమాల్లో ఒంటరిగా గడుపుతున్నారు. ఇది దారుణమైన పరిస్థితిలో మార్పు రావాలంటే... పిల్లలకు కుటుంబ, సామాజిక విలువలు బోధించాలి.

మనసు ఉప్పొంగుతుంది...

ఎప్పుడైతే ఇటువైపు వచ్చానో అప్పటి నుంచి నా కాళ్లపై నేను నిలబడడం అలవాటు చేసుకున్నాను. ఒకసారి మా ఇంట్లో పుట్టగొడుగులు పెంచాను. నాకు అందులో అనుభవం ఉంది. తరువాత అదే నా సంపాదన మార్గం అయింది. ఇప్పుడు పుట్టగొడుగుల సాగు చేస్తున్నాను. అలాగే మా ప్రాంతానికి ప్రత్యేకమైన ఒడియాలు పెట్టి అమ్ముతున్నాను. దీనివల్ల నాతోపాటు మరికొంతమంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. మొదట్లో గడప దాటినప్పుడు మావారు 'ఎక్కడికి? ఎందుకు' అని అడిగేవారు. నిదానంగా ఆయనకు నా గురించి అర్థమైంది. అప్పటి నుంచి తను కూడా నాకు మద్దతుగా నిలుస్తున్నారు. నా ప్రయత్నంవల్ల అనాథ ఆశ్రమాల్లో పెరిగిన కొందరు పిల్లలు ఇప్పుడు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వాళ్లను చూసినప్పుడు ఎంతో ఉద్వేగానికి లోనవుతాను. నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతుంది. ఒక సాధారణ గృహిణిగా ఇంతమంది జీవితాల్లో మార్పు తేగలిగినందుకు సంతృప్తిగా ఉంది. మనం బతకాలి. పక్కవారిని బతికించాలి. ఇదే నా నినాదం."

హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...



1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
4. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
5. భూల్ భులాయా (భూల్ భులాయా3)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. నైనా (క్రూ)
8. ఆయీ నై (స్త్రీ-2)
9. జా రాంఝన్ (దో పత్తీ)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)



శభాష్.. గుకేష్

- 11వ రౌండ్‌లో డింగ్‌పై గెలుపు
- ఆధిక్యంలో భారత స్టార్

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో జగజ్జేత డింగ్ లిరెన్ (చైనా)కు భారత యువ జీఎం గుకేష్ మరోసారి షాకిచ్చాడు. ఆదివారం ముగిసిన 11వ రౌండ్‌లో గుకేష్ తెల్లపావులతో బరిలోకి దిగాడు. హైపర్‌మోడ్రన్‌గా పిలవబడే రెటీ ఓపెనింగ్‌తో ఆటను ప్రారంభించిన గుకేష్ 29వ ఎత్తులో డింగ్‌కు చెక్ చెప్పి, ఏడు వరుస డ్రాల తర్వాత విజయాన్ని సాధించాడు. ఈ రౌండ్‌ను దూకుడుగా ప్రారంభించిన గుకేష్ తొలి ఐదు ఎత్తుల్లోనే పట్టు సాధించాడు. దాదాపు గంట పాటు జరిగిన ఈ రౌండ్లో డింగ్ పుంజుకోవడానికి గుకేష్ అవకాశం ఇవ్వలేదు. ఒత్తిడిలో డింగ్ చేసిన తప్పిదాలు కూడా గుకేష్‌కు కలిసొచ్చాయి. ఈ 14 రౌండ్ల చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో మరో మూడు గేమ్‌లు మిగిలుండగా ప్రస్తుతం గుకేష్ 6-5తో ప్రత్యర్థి డింగ్‌పై ఒక్క పాయింట్ ఆధిక్యంలో నిలిచాడు. ఈ మెగా ఫైనల్ తొలి గేమ్‌లో డింగ్ నెగ్గగా, 3, 11 రౌండ్లలో గుకేష్ గెలిచాడు. మిగిలిన రౌండ్లన్నీ డ్రాగా ముగిశాయి.

ఆదివారం...ఫ్ట్
మనకు కలిసిరాని రోజు

భారత క్రికెట్‌కు ఆదివారం (8వ తేదీ) చేదు జ్ఞాపకాన్ని మిగిల్చిన రోజు. ఎందుకంటే ఒకేరోజు మూడు పరాభవాలు ఎదురయ్యాయి. అవన్నీ క్రికెట్‌లోనే. అటు సీనియర్ పురుషులు, మహిళల జట్లు ఓటమిపాలవగా.. ఇటు అండర్-19 పురుషుల ఆసియా కప్‌లో జూనియర్ జట్టుకూ నిరాశ తప్పలేదు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా పింక్‌బాల్ టెస్టులో ప్రత్యర్థి ఆస్ట్రేలియా చేతిలో రోహిత్ సేన దారుణంగా చిత్తవగా.. ఆసీస్‌కే చెందిన మహిళల జట్టు హర్మన్‌ప్రీత్ సేనపై గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. ఇక, అండర్-19 ఆసియా కప్‌లో ఫేవరెట్ అనుకున్న యువ భారత్‌కు బంగ్లాదేశ్ ఝలకిచ్చి ట్రోఫీని అందుకుంది. ఇలా ఒకేరోజు మూడు ఓటములతో భారత క్రికెట్ అభిమాని ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

అమ్మాయిలకూ నిరాశే

- రెండో వన్డేలోనూ భారత్ ఓటమి

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల జట్టు ఆదివారం జరిగిన రెండో వన్డేలో 122 పరుగుల భారీ తేడాతో ఓటమి చవిచూసింది. ఫలితంగా ఆసీస్ 2-0తో మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకుంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. వోల్ (101), ఎలిస్ పెర్రీ (105) సెంచరీలతో కదం తొక్కడంతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 371 పరుగులు చేసింది. భారత బౌలర్లలో సైమా ఠాకూర్ (3/62), మిన్నూ మణి (2/71) రాణించారు. ఛేదనలో భారత్ 44.5 ఓవర్లలో 249 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రిచా ఘోష్ (54) అర్ధ శతకం సాధించింది.

ఇంగ్లండ్ భారీ విజయం

వెల్లింగ్టన్: ఇంగ్లండ్‌తో మూడురోజుల్లోనే ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 323 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. తద్వారా ఇంగ్లండ్ మూడు టెస్టుల సిరీస్‌ను 2-0తో చేజిక్కించుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 378/5తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్.. రూట్ (106) శతక్కొట్టడంతో 427/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కివీస్..259 పరుగులకు కుప్పకూలింది. సెంచరీ హీరో మిచెల్ (115) మినహా మరెవరూ రాణించలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 280, కివీస్ 125 రన్స్ చేసిన సంగతి తెలిసిందే. బ్రూక్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఆర్చరీ సిరీస్ విజేత సురేఖ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండోర్ ఆర్చరీ వరల్డ్ సిరీస్ 250 తైపీ ఓపెన్ కాంపౌండ్ విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ విజేతగా నిలిచింది. తైపీలో ఆదివారం జరిగిన ఫైనల్లో సురేఖ 144-140 స్కోరుతో చెన్ యు జు (తైపీ)పై గెలిచి, టైటిల్ దక్కించుకుంది.

పోరాడుతున్న శ్రీలంక

గెబెహా: శ్రీలంక-దక్షిణాఫ్రికా మధ్య రెండో టెస్టు ఆసక్తికరంగా మారింది. బవుమా (66) రాణించడంతో సౌతాఫ్రికా నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్ లో 317 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ ప్రబాత్ జయసూర్య ఐదు వికెట్లు తీశాడు. ఆ తర్వాత 348 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంక ఆట చివరికి 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 358, లంక 328 పరుగులు చేశాయి. లంక నెగ్గాలంటే ఆఖరిరోజు మరో 143 రన్స్ చేయాలి.

గుచ్చుకుంది గులాబీ

10 వికెట్ల తేడాతో ఓడిన భారత్

- రెండో ఇన్నింగ్స్ 175
- కమిన్స్‌కు ఐదు వికెట్లు
- ఆసీస్‌తో డే/నైట్ టెస్టు



అడిలైడ్: అద్భుతం కాదు కదా.. టీమిండియా నుంచి కనీస పోరాటం కూడా లేకపోయింది. రెండున్నర రోజుల్లోనే ముగిసిన ఈ రెండో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా పది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలి టెస్టును 295 పరుగుల తేడాతో గెలిపించిన భారత బ్యాటర్లు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పూర్తిగా విఫలం కావడం దెబ్బతీసింది. ఈ మ్యాచ్‌లో ఒక్క బ్యాటర్ కూడా అర్ధసెంచరీ చేయలేకపోయాడు. జట్టు మొత్తంగా 81 ఓవర్లు మాత్రమే ఆడడం గమనార్హం. అంటే.. కనీసం ఓ రోజంతా (90 ఓవర్లు) కూడా బ్యాటింగ్ చేయలేకపోయారని చెప్పవచ్చు. అడిలైడ్‌లో భారత్‌కిది వరుసగా రెండో ఓటమి. 2020లో జరిగిన డే/నైట్ టెస్టులోనూ పరాజయం పాలైంది. అటు గులాబీ టెస్టుల్లో ఆస్ట్రేలియా మాత్రం 12-1తో తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. మూడో రోజు ఆదివారం భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 36.5 ఓవర్లలో 175 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (42) మరోసారి టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అతడి నిలకడ కారణంగానే జట్టుకు ఇన్నింగ్స్ ఓటమి తప్పినట్టయ్యింది. కెప్టెన్ కమిన్స్ (5/57) తన బౌలింగ్ పదునేంటో రుచి చూపించగా.. బోలాండ్‌కు మూడు, స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 19 పరుగుల స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 3.2 ఓవర్లలో అన్నే పరుగులు చేసి నెగ్గింది. మెక్‌స్వీనే (10 నాటౌట్), ఖవాజా (9 నాటౌట్) అజేయంగా నిలిచారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ట్రావిస్ హెడ్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 180, ఆసీస్ 337 పరుగులు చేశాయి.

గంటలోనే అంతా క్లోజ్...

128/5 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ గంటలోనే మిగిలిన వికెట్లన్నీ కోల్పోయింది. శనివారం ఆట ముగిసేసరికి పంత్ (28), నితీశ్ క్రీజులో ఉండడంతో వారి ఆటతీరుపై అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు. నిలకడగా ఆసీస్ బౌలర్లను ఎదుర్కొని గౌరవప్రదమైన ఆధిక్యాన్ని అందించకపోతారా? అని ఎదురుచూశారు. కానీ తొలి ఓవర్‌లోనే గట్టి షాకిస్తూ పంత్‌ను స్టార్క్ అవుట్ చేయడంతో ఫలితం ఎలా ఉంటుందో తేలిపోయింది. శనివారం నాటి స్కోరుకు అతను ఒక్క పరుగు కూడా జత చేయలేకపోయాడు. ఈ దశలో ఇన్నింగ్స్ ఓటమి తప్పదనిపించింది. కానీ ఈ సిరీస్‌లోనే అరంగేట్రం చేసిన నితీశ్ అడపాదడపా బౌండరీలతో స్కోరును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అయితే మరో ఎండ్‌లో కమిన్స్ వికెట్ల పతనం సాగించాడు. 35వ ఓవర్‌లో ఫోర్‌తో నితీశ్ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. తర్వాతి ఓవర్‌లో సిక్సర్ బాదినా.. కమిన్స్ అతడిని తన ఐదో వికెట్‌గా పెవిలియన్‌కు చేర్చాడు. ఆ వెంటనే సిరాజ్ (7)ను బోలాండ్ అవుట్ చేయడంతో భారత్ 18 పరుగుల ఆధిక్యంతో ఇన్నింగ్స్‌ను ముగించింది.

మూడో స్థానానికి రోహిత్ సేన

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ర్యాంకింగ్స్‌లో భారత జట్టు మూడో స్థానానికి పడిపోయింది. గులాబీ బంతి టెస్టులో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఘోరంగా ఓడడంతో అగ్రస్థానం నుంచి మూడో ర్యాంక్‌కు పడిపోయింది. ఈ టెస్టులో గెలిచిన కంగారూ జట్టు మూడు నుంచి మళ్లీ టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 60.71 విజయాల శాతంతో మొదటి స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా (59.26) 2వ, భారత్ (57.29) 3వ స్థానంలో ఉన్నాయి. వెల్లింగ్టన్ టెస్టు ఓటమితో మూడోస్థానంలోని న్యూజిలాండ్ ఆరో స్థానానికి పడిపోయింది.

1 భారత్-ఆసీస్ జట్ల మధ్య వేగంగా (1031 బంతుల్లో) పూర్తయిన టెస్టు ఇదే.

3 కెప్టెన్‌గా ఎక్కువ సార్లు (8) 5 వికెట్లు తీసిన మూడో ప్లేయర్‌గా కమిన్స్. ఇమ్రాన్ (12), రిచీ బెనాడ్ (9) ముందున్నారు.

4 భారత్ తరఫున రెండు ఇన్నింగ్స్‌లోనూ ఏడు అంతకంటే దిగువన వచ్చి టాప్ స్కోరర్‌గా నిలిచిన నాలుగో బ్యాటర్‌గా నితీశ్. గతంలో చందూ బోర్డే, ధోనీ, అశ్విన్ ఉన్నారు.



నితీశ్ (42)

బుమ్రా ఒక్కడే బౌలింగ్ చేయలేడుగా..

ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయాలంటే ఇతర బౌలర్లు కూడా బాధ్యత తీసుకోవాలి. బుమ్రా ఒక్కడే ఇరువైపులా బౌలింగ్ చేయలేడు కదా! అతడూ మానవమాత్రుడే. అయితే జట్టులోని యువ బౌలర్లకు టెస్టు క్రికెట్‌లో అనుభవం లేదనే విషయం కూడా మరువరాదు. వారికి ఆత్మవిశ్వాసాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది. హర్షిత్ 16 ఓవర్లలో 86 పరుగులిచ్చినప్పటికీ.. తొలి టెస్టులో అతడు మెరుగ్గా రాణించాడు. ఇక బ్యాటింగ్‌లో ఒక్కసారి కూడా మేం 200 రన్స్ చేయలేకపోయాం. ఇలాంటి ఆటతో మ్యాచ్‌లు గెలవలేం. **- రోహిత్ శర్మ**

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 180; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 337.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) క్యారీ (బి) బోలాండ్ 24; రాహుల్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; గిల్ (బి) స్టార్క్ 28; విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 11; పంత్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 28; రోహిత్ (బి) కమిన్స్ 6; నితీశ్ (సి) మెక్‌స్వీనే (బి) కమిన్స్ 42; అశ్విన్ (సి) క్యారీ (బి) కమిన్స్ 7; హర్షిత్ (సి) ఖవాజా (బి) కమిన్స్ 0; బుమ్రా (నాటౌట్) 2; సిరాజ్ (సి) హెడ్ (బి) బోలాండ్ 7; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 36.5 ఓవర్లలో 175; వికెట్ల పతనం:** 1-12, 2-42, 3-66, 4-86, 5-105, 6-128, 7-148, 8-153, 9-166, 10-175; **బౌలింగ్:** స్టార్క్ 14-1-60-2; కమిన్స్ 14-0-57-5; బోలాండ్ 8.5-0-51-3.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనే (నాటౌట్) 10; ఖవాజా (నాటౌట్) 9; **మొత్తం: 3.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19; బౌలింగ్:** బుమ్రా 1-0-2-0; సిరాజ్ 1.2-0-9-0; నితీశ్ 1-0-8-0.

కుర్రాళ్లు బోల్తా పడ్డారు

- ఫైనల్లో యువ భారత్ ఓటమి
- బంగ్లాదే అండర్-19 ఆసియా కప్



దుబాయ్: టైటిల్ ఫేవరెట్‌గా అండర్-19 ఆసియా కప్‌లో అడుగుపెట్టిన యువ భారత్ ఫైనల్లో మాత్రం అంచనాలకు తగ్గట్టు రాణించలేకపోయింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ బంగ్లాదేశ్ 59 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తుచేసి టైటిల్ నిలబెట్టుకుంది. టాస్ నెగ్గి ఫీల్డింగ్‌కు దిగిన భారత జట్టులో బౌలర్లు రాణించినా, బ్యాటర్లు తేలిపోయారు. మొదట బంగ్లా 49.1 ఓవర్లలో కేవలం 198 పరుగులకు పరిమితమైంది. రిజాన్ హసన్ (47) టాప్ స్కోరర్‌గా నిలవగా.. షిహాబ్ (40), ఫరీద్ (39) పర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో యుధజిత్ గుహా, చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ రెండేసి వికెట్లు తీయగా.. కిరణ్, కార్తికేయ, ఆయుష్ తలో వికెట్ పడగొట్టారు. స్వల్ప ఛేదనలో భారత కెప్టెన్ అమన్ చేసిన 26 పరుగులే జట్టులో అత్యధిక స్కోరు కావడం గమనార్హం. అజీజుల్ (3/8), ఇక్బాల్ (3/24) ధాటికి భారత్ 35.2 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. హార్దిక్ రాజ్ (24), కార్తికేయ (21), సిద్ధార్థ్ (20), చేతన్ (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. బంగ్లా బౌలర్ ఇక్బాల్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు గెలుచుకున్నాడు.

బిజినెస్

అంతటా అవినీతి..

- చేతులు తడిపితేనే పనులకు మోక్షం
- 66% వ్యాపార సంస్థల మనోగతం
- లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: ఎంత కంప్యూటరీకరణ జరిగినా.. ఎన్ని చట్టాలు వచ్చినా మా దారి మాదే అంటున్నాయి కొన్ని ప్రభుత్వ శాఖలు. అనుమతి దరఖాస్తులు, కంప్లయెన్స్ ప్రక్రియలు, ఆస్తులకు సంబంధించి డూప్లికేట్ కాపీ కావాలన్నా ప్రభుత్వ ఉద్యోగుల చేతులు తడపక తప్పడం లేదు. 'లోకల్ సర్కిల్' అనే సంస్థ దీనికి సంబంధించి దేశంలోని 159 జిల్లాలకు చెందిన 18,000 వ్యాపార సంస్థల ఉన్నతాధికారుల అభిప్రాయాలతో ఒక సర్వే విడుదల చేసింది. ఇందులో 66 శాతం సంస్థలు గత ఏడాది కాలంలో ఏదో ఒక పనికోసం ప్రభుత్వ ఉద్యోగుల చేతులు తడపక తప్పలేదని చెప్పాయి. 54 శాతం సంస్థలైతే ఇష్టం లేకపోయినా ఉద్యోగులకు లంచాలు ఇవ్వాల్సి వచ్చిందని చెప్పాయి. 46 శాతం సంస్థలు మాత్రం త్వరగా పని చేయించుకునేందుకు గత్యంతరం లేకే లంచాలు ఇచ్చామని తెలిపాయి.

సర్వే ఇతర ప్రధాన అంశాలు

- ఎప్పుడు లంచాలు ఇవ్వకుండానే పనులు చేయించుకున్నట్టు చెప్పిన 16 శాతం సంస్థలు
- లంచాలు ఇవ్వాల్సిన అవసరమే రాలేదన్న 19 శాతం సంస్థలు
- కంప్యూటరీకరణ, సీసీటీవీలు ఉన్నా చెలరేగిపోతున్న అవినీతి జలగలు
- న్యాయ, తూనికలు-కొలతలు, ఆహార, ఔషధ, ఆరోగ్య శాఖల్లో అవినీతి ఎక్కువ
- జీఎస్‌టీ, కాలుష్య నియంత్రణ, మున్సిపల్ కార్పొరేషన్లు, విద్యుత్ శాఖల్లోనూ అవినీతి తిమింగలాలు
- గత ఏడాదితో పోలిస్తే కొద్దిగా తగ్గిన అవినీతి

25 ఏళ్లు.. రూ.85 లక్షల కోట్లు

ఎఫ్‌డీఐలకు అడ్డాగా భారత్.. డీపీఐఐటీ



న్యూఢిల్లీ: సరళీకృత ఆర్థిక విధానాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు భారత్ కేంద్రంగా మారుతోంది. 2000 సంవత్సరం సెప్టెంబరు నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో మన దేశం 1,03,340 కోట్ల డాలర్ల (సుమారు రూ.84.5 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) ఆదివారం ఇందుకు సంబంధించిన గణాంకాలు విడుదల చేసింది. ఈక్విటీ పెట్టుబడులు, ఆ పెట్టుబడులపై వచ్చిన ఆదాయాన్ని తిరిగి పెట్టుబడిగా పెట్టడం, ఇతర మూలధన పెట్టుబడులన్నీ ఎఫ్‌డీఐ కోవలోకి వస్తాయి. ఈ పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో 25 శాతం ఒక్క మారిషస్ నుంచే రావడం విశేషం. సింగపూర్ (24 శాతం), అమెరికా (10 శాతం), నెదర్లాండ్ (7 శాతం), జపాన్ (6 శాతం), యూకే (5 శాతం), యూఏఈ (3 శాతం) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కేమన్ ఐలాండ్స్, జర్మనీ, సైప్రస్ నుంచి 6 శాతం పెట్టుబడులు వచ్చినట్టు డీపీఐఐటీ తెలిపింది. ఈ కాలంలో మారిషస్ నుంచి 17,718 కోట్ల డాలర్లు, సింగపూర్ నుంచి 16,747 కోట్ల డాలర్లు, అమెరికా నుంచి 6,780 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయి.

అన్ని రంగాల్లోకి..

సేవల విభాగం, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలికమ్యూనికేషన్స్, ట్రేడింగ్, కన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లోకి పెద్దఎత్తున ఎఫ్‌డీఐ వచ్చినట్లు డీపీఐఐటీ తెలిపింది. కాగా 2004-14 కాలంతో పోల్చితే 2014-24 మధ్య కాలంలో దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐ ఏకంగా 119 శాతం మేర పెరిగిందని పేర్కొంది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులు షురూ

గత రెండు నెలలుగా అమ్మకాలతో హోరెత్తించిన విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మళ్లీ భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు దిగారు. ఈ నెల తొలి వారంలోనే రూ.24,454 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అక్టోబరులో రూ.94,017 కోట్లు, నవంబరులో రూ.21,612 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్నాయి. కుదుటపడుతున్న అంతర్జాతీయ పరిస్థితులు, అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ ఈ నెల మరోసారి వడ్డీ రేట్లు తగ్గించబోతోందన్న అంచనాలతో ఎఫ్‌పీఐలు మళ్లీ కొనుగోళ్లకు దిగాయని భావిస్తున్నారు. ట్రంప్ ఆర్థిక విధానాలు, మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, జీడీపీ వృద్ధి రేటు ముందు ముందు మన దేశంలో ఎఫ్‌పీఐల పెట్టుబడులను నిర్ణయించనున్నాయి.

ఈ వారం 11 ఐపీఓలు

ఐపీఓ మార్కెట్లోనూ జోరు పెరుగుతోంది. రూ.18,500 కోట్ల సమీకరణ కోసం ఈ వారం 11 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వస్తున్నాయి. ఇందులో ఐదు విశాల్ మెగా మార్ట్, ఫిన్‌టెక్ కంపెనీ వన్ మొబిక్విక్ సిస్టమ్స్, ఇన్వెంచరస్ నాలెడ్జ్ సొల్యూషన్స్ లిమిటెడ్, ఇంటర్నేషనల్ జెమ్మాలాజికల్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ కేంద్రంగా పని చేసే సాయి లైఫ్ సైన్సెస్ పెద్ద కంపెనీల ఐపీఓలు. మిగతా ఆరు ఐపీఓలు మాత్రం ఎస్ఎంఈ విభాగం నుంచి వస్తున్నాయి.

- ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి 4.9 శాతం, 2025-26 ఆర్థిక సంవత్సరానికి 4.5 శాతం విత్తలోటు లక్ష్యానికి కట్టుబడాలని సీఐఐ సూచించింది. మితిమీరిన లక్ష్యాలు పెట్టుకుంటే భారత ఆర్థిక వృద్ధి ప్రతికూలంగా ప్రభావితం కావచ్చునని పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్న దశలో భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, ఇలాంటి వాతావరణంలో ఆ వృద్ధిని నిలబెట్టుకోవాలంటే స్థూల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడే విత్త నిర్వహణ అవసరమని పేర్కొంది.
- ఇసుజు మోటార్స్ ఇండియా దేశవ్యాప్తంగా ఇసుజు ఐ-కేర్ వింటర్ క్యాంప్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ నెల 14 వరకు ఇసుజు డీలర్ల దగ్గర వినియోగదారులు అన్ని రకాలైన సర్వీస్ బెనిఫిట్స్‌ను పొందవచ్చని తెలిపింది.
- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ మొబైల్ యాప్.. ఐపీఆర్‌యు ఎడ్జ్‌ను 98.1 శాతం అడ్వైజర్లు ఉపయోగిస్తున్నారని ప్రకటించింది. ఈ యాప్ ద్వారా అడ్వైజర్ల ఉత్పాదకత 37% పెరగటమే కాకుండా అదే రోజున 50 పాలసీలను జారీ చేస్తున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా అదే రోజు న కమిషన్లను చెల్లిస్తున్నట్లు తెలిపింది.
- ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల కల్పన ఊపందుకోవటం, భారీ ఎత్తున వస్తున్న పెట్టుబడులతో తయారీ రంగం కీలకంగా మారుతోందని టాటా మోటార్స్ వెల్లడించింది. దీంతో నిర్మాణ, మైనింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో కార్యకలాపాలు పెరగటమే కాకుండా హెవీ డ్యూటీ ట్రక్కులకు డిమాండ్ పెరిగిందని తెలిపింది. కంపెనీకి చెందిన టాటా సిగ్నా 4830 టీ, 4830 టీకే, 5530.ఎస్ సహా ప్రైమా 3530 టీకే, 2830 కే, 2830 టీకే ట్రక్కులు కూడా అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నాయని పేర్కొంది.

25,000 పైన బుల్లిష్
(డిసెంబరు 9-13 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ సైన్

నిఫ్టీ గత వారం 24,857-24,009 పాయింట్ల మధ్యన కదలాడి 547 పాయింట్ల లాభంతో 24,678 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,491, 24,361, 24,090, 24,116 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25,000 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,400
నిరోధ స్థాయిలు: 24,880, 24,980, 25,080 (24,780 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,470, 24,370, 24,270 (24,570 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	620
వరంగల్	622	గోదావరి	620
చిత్తూరు	633	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	104
వరంగల్	100	గుంటూరు	104
కరీంనగర్	100	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	82
కర్నూలు	100	నెల్లూరు	82
విశాఖపట్నం	96	అనంతపురం	82
గోదావరి	104		

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలపై కన్నేయండి.!

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ).. వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించటంతో ఈ వారం ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై పడే అవకాశం ఉంది. నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని తగ్గించటంతో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో మూమెంటమ్ కనిపించవచ్చు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపరులు తిరిగి వస్తే సూచీలు మరింత పైకి వెళ్లటం ఖాయం.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు క్రమంగా పతనమవుతూ వచ్చింది. దాదాపుగా 36 శాతం మేర నష్టపోయింది. రూ.770 స్థాయిలో మద్దతు లభించింది. ప్రస్తుతం ఈ కౌంటర్‌లో అక్యుములేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 3.06 శాతం లాభంతో రూ.816 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.810 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.870/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.790 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. గత వారం చక్కని మూమెంటమ్‌తో వరుసగా లాభపడింది. ప్రతి త్రైమాసికంలో ఈపీఎస్, సేల్స్, లాభం, నిర్వహణ మార్జిన్లు మెరుగవుతున్నాయి. గత శుక్రవారం రూ.1,206 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,150/1,180 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,450/1,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,110 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వరుణ్ బెవరేజేస్: సుదీర్ఘకాలంగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ జరుగుతోంది. బేస్ ఏర్పడుతోంది. మూమెంటమ్ ఇప్పుడిప్పుడే పెరుగుతోంది. గత శుక్రవారం రూ.644 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.630/620 స్థాయిల్లో పొజిషన్ తీసుకుని రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.600 స్థాయి వద్ద కచ్చితమైన స్టాప్ లాస్ పెట్టుకోవాలి.

ఏంజెల్ వన్: ప్రస్తుతం ఫైనాన్స్ స్టాక్ బ్రోకింగ్ రంగం బుల్లిష్‌గా ఉంది. ఈ ఏడాది ఆగస్టు నుంచి ఈ షేరు స్టేజ్-2లో కొనసాగుతోంది. ఆగస్టులో ఈ షేరు 58 శాతం మేర ర్యాలీ కనబరిచింది. గత శుక్రవారం ఈ షేరు 2.2 శాతం లాభంతో రూ.3,292 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,250 వద్ద పొజిషన్ తీసుకుని రూ.3,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,200 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

క్యాస్ట్రాల్ ఇండియా: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు క్రమంగా దిద్దుబాటుకు గురైంది. మార్కెట్ పరిస్థితి బాగా లేకపోవటంతో 34 శాతం మేర పతనమైంది. కీలకమైన మద్దతు స్థాయి రూ.186 వద్ద టర్న్ అరౌండ్ అయ్యింది. చివరి రెండు వారాల్లో 24 శాతం మేర పెరిగింది.గత శుక్రవారం రూ.222 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.210/200 వద్ద పొజిషన్ తీసుకుని రూ.260/280 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.190 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ: కన్సాలిడేషన్‌కు ఆస్కారం



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో కరెక్షన్‌కు గురైనా మానసిక అవధి 24,000 వద్ద రికవరీ సాధించి బలంగా ముగిసింది. తదుపరి వారం అంతా అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 550 పాయింట్ల లాభంతో 24,670 వద్ద ముగిసింది. అయితే శుక్రవారం మైనర్ కరెక్షన్‌లో పడడం గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి స్వల్పంగా ఏర్పడిందనేందుకు సంకేతం. గత మూడు వారాల్లో నిఫ్టీ 1,500 పాయింట్ల మేరకు రిలీఫ్ ర్యాలీ సాధించింది. ఈ ర్యాలీ కారణంగా ఇటీవలి డౌన్‌ట్రెండ్‌లో ఏర్పడిన నష్టంలో 50 శాతం భర్తీ చేసుకుంది. అయినా ఇప్పటికి కూడా మార్కెట్ ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 26,250 కన్నా దిగువనే ఉంది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 2300 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 840 పాయింట్ల రికార్డు ర్యాలీ సాధించాయి. అయితే గత కొద్ది రోజుల్లో నిట్టనిలువుగా దూసుకుపోయినందు వల్ల కన్సాలిడేషన్ ఏర్పడే అవకాశం ఉంది. వారం చివరి రెండు రోజుల్లో అమెరికన్ స్టాక్ మార్కెట్లో కరెక్షన్ ప్రభావం కూడా మన మార్కెట్‌పై ఈ వారంలో పడవచ్చు. ఈ పరిస్థితుల్లో 24,500 వద్ద నిఫ్టీ మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే 24,750 వద్ద ప్రధాన నిరోధం ఉంది. ఇక్కడ నుంచే గత శుక్రవారం రియాక్షన్ ఏర్పడింది. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 25,000.

బేరిష్ స్థాయిలు: 24,500 వద్ద మైనర్ మద్దతు కనిపిస్తోంది. బలం కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,000. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 1,450 పాయింట్ల మేరకు బలంగా లాభపడింది. 52,000 వద్ద అప్‌ట్రెండ్‌ను పునరుద్ధరించుకుని 53,500 చేరువలో క్లోజైంది. ప్రధాన నిరోధం 54,000. మరింత అప్‌ట్రెండ్ ఏర్పడినట్టయితే మరింత సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఒకవేళ బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 53,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 50 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. 24,750 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బ్రేకౌట్ సాధించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,750, 24,820
మద్దతు	24,560, 24,500

కేజీఎఫ్ తరహాలో అక్రమాలు

గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అండదండలతో మట్టి మాఫియా చెలరేగిపోయింది. చేబ్రోలు మండలంలో నాణ్యమైన ఎర్ర గ్రావెల్ భూములను అడ్డగోలుగా చేజిక్కించుకుని అక్రమార్జనకు తెరతీశారు. 700 ఎకరాల్లో పండ్ల తోటలను కనుమరుగు చేశారు. వీరనాయకునిపాలెం గ్రామంలో దశాబ్దాల క్రితం ప్రభుత్వం దళితులకు ఇచ్చిన అసైన్డ్ పంట భూముల్లో పాగా వేసి, దళితులను తరిమేసి ఎదురు కేసు పెట్టి మట్టి తవ్వకాలు సాగించారు. ఐదేళ్ల కాలంలో మొత్తం రూ.2,100 కోట్ల అక్రమ మట్టి తవ్వకాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రభుత్వ ఉద్యోగులు, రేషన్ మాఫియా నుంచి నెల వారీ మామూళ్లు వసూలు చేశారన్న విమర్శలు ఉన్నాయి. బర్నాబాస్ అనే రేషన్ వ్యాపారి హత్య కేసులో కిలారిపై ఆరోపణలున్నాయి. పెదకాకాని మండలం అనుమర్లపూడిలో దళితులకు చెందిన 22.50 ఎకరాల భూమిని కిలారి రోశయ్య అడ్డగోలుగా రాయించుకున్నారు. ఈ భూమి విషయంలో దళితుల మధ్య ఉన్న విభేదాలను ఆయన క్యాష్ చేసుకున్నారు. సుమారు రూ.34 కోట్లు విలువజేసే భూమిని కారు చౌకగా కొట్టేశారు.



గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అనుమర్లపూడిలో కిలారి కాజేసిన దళితుల భూమి

బెదిరించి.. కేసులు పెట్టి..



మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి



అనంతపురం జిల్లా రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తన బినామీల పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి

రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హీరేహాళ్ మండలం పులకుర్తికి చెందిన రైతు రామాంజినేయులురెడ్డికి చెందిన రూ.కోటి విలువైన 11 ఎకరాల భూమిని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తన బినామీల పేరుతో సొంతం చేసుకున్నారు. ఆ రైతు, ఆయన కుమారుడిని ఎస్సీ, ఎస్టీ కేసుల పేరిట బెదిరించారు. రౌడీషీట్ ఓపెన్ చేయించి నానా ఇబ్బందులకు గురి చేశారు. ఆర్థిక అవసరాల రీత్యా రామాంజినేయులురెడ్డి పూర్వీకులు బళ్లారిలో ఓ వ్యాపారి వద్ద ఆ భూమి తాలూకా డాక్యుమెంట్లు గతంలో తాకట్టుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న కాపు రామచంద్రారెడ్డి తన అనుచరులను రంగంలోకి దించి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రికార్డులు మార్పించారు. అడ్డు వచ్చిన బాధిత రైతు, అతని కుటుంబ సభ్యులపై దాడులు చేయించారు. రామాంజినేయులురెడ్డి కుమారుడిపై రౌడీషీట్ ఓపెన్ చేయించడంతో అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వచ్చింది.

అధికారంతో అరాచకం

ఎవరైనా దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడితే పోలీసులు, సంబంధిత అధికారులకు బాధితులు ఫిర్యాదు చేస్తారు. అవసరమైతే ప్రజాప్రతినిధులనూ కలసి మొరపెట్టుకుంటారు. అలాంటిది.. అధికార పార్టీ నేతలే దాదాగిరి చేస్తే? వారికి అధికారులూ వత్తాసు పలికితే? బాధితులు ఎవరికి చెప్పుకోవాలి? గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ఇదే పరిస్థితి. అంతా మాఫియా మోడల్.

వైసీపీ నేతల కన్నుపడిందంటే... విలువైన ప్రభుత్వ, ప్రైవేటు భూములు, కొండలు, చెరువులు, చివరకు రోడ్లు కూడా స్వాహా. ప్రకృతి వనరులు ఇసుక, గనులు దోపిడీ. రేషన్ మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు. ఉద్యోగులకు పోస్టింగ్‌లు కావాలంటే లంచాలు. ఇక సెటిల్మెంట్లు, బెదిరింపులు, దౌర్జన్యాలు, దాడులు.. ఎవరైనా ఎదిరిస్తే అక్రమ కేసుల బనాయింపు.

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 3,500 ఎకరాలు అక్రమించినట్టు అంచనా. మాజీ సీఎం జగన్ బంధువులపైనా ఆరోపణలు ఉన్నాయి. ఇక కొండల్ని మాయం చేశారు. చెరువులు, నదులను గుల్ల చేశారు. పేదల ఇళ్ల స్థలాల చదును పేరిట కోట్లు బొక్కేశారు. గతంలో ఎన్నడూ వినని రీతిలో గత ఐదేళ్లలో అవినీతి, అక్రమాలు జరిగాయి. ఇలా కూడా అవినీతి చేయొచ్చా అని అక్రమార్కులే విస్తుపోయేలా సంపాదించేశారు. దౌర్జన్యాలు, దందాలు, దాడులకు లేక్కేలేదు. రాష్ట్రంలో ఎవరూ ఎదురు చెప్పలేని పరిస్థితి. తవ్వే కొద్దీ అవినీతి లీలలు బయటపడుతూనే ఉన్నాయి. మచ్చుకు కొన్ని ఉదంతాలు...


సొంత పార్టీ నేతకే మోసం



మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేరుగా సెటిల్మెంట్లలో పాల్గొనకుండా తన మేనల్లుడు, కొందరు రౌడీషీటర్ల ద్వారా నడిపించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో కోట్ల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకుని, సెటిల్ చేసి సొంత పార్టీ నాయకుడికే అమ్మేశారు. కొలకలూరులో లాకింగ్ బ్రిక్స్ పరిశ్రమను కుమారుడి కోసం నిర్మించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా చేసిన మహిళా నాయకురాలి భర్త అయిన ఓ మైనారిటీ నాయకుడికి ఇందులో వాటా ఉండేది. అయితే ఏమీ ఇవ్వకుండా ఆయన్ను, మిగిలిన భాగస్తులను తరిమేసి కోట్ల విలువైన ఫ్యాక్టరీని సొంతం చేసుకున్నారు. జగనన్న కాలనీల కోసం పట్టణానికి దూరంగా రూరల్ పంచాయతీల పరిధిలో చౌకగా పొలాలు ముందే కొనుగోలు చేసి, వాటిని ప్రభుత్వానికి అమ్మారు. ఎకరం 25 నుంచి 35 లక్షలు పలికే భూములకు 90 లక్షల నుంచి కోటిపైగా రైతుల పేరిట చెల్లింపులు చేసి 180 కోట్లకు పైగా దోచేశారు.

అక్రమాల్లోనూ పెద్దిరెడ్డి



వైసీపీ ప్రభుత్వంలో నెంబరు టూగా పెత్తనం చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.వేల కోట్లను వెనకేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నేతలను బెదిరించారు. గనుల్ని లాక్కున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములని తేడా లేకుండా వందల ఎకరాల్ని కబ్జా చేశారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద పలువురి క్వారీలను దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లెకు చెందిన జనసేన నాయకుడు రాందాస్ చౌదరి, పుంగనూరు టీడీపీ నేత ఆర్వీటీ బాబులకు చెందిన క్వారీలను లాక్కున్నారు. పుంగనూరు మండలం రాగానిపల్లెలో రూ.100 కోట్ల విలువ చేసే 982 ఎకరాల అనాధీన భూముల్ని.. పెద్దిరెడ్డి ఆదేశాలతో ఆయన అనుచరులకు అప్పటి అధికారులు కట్టబెట్టేశారు. కుప్పం నియోజకవర్గాన్ని కూడా తన గుప్పిట్లో పెట్టుకున్న పెద్దిరెడ్డికి క్వారీల నుంచి నెల మామూళ్లు వెళ్లేవని ప్రచారం జరిగింది. మదనపల్లె బి.కె.పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 552లో వివాదాస్పదమైన విలువైన భూమిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన ప్రధాన అనుచరుడు వి.మాధవరెడ్డి ఆక్రమించారు. ఇందులో తాము కొనుగోలు చేశామని చెబుతున్న భూమి అయిదు ఎకరాలు అయితే, మరోమూడు ఎకరాలు ప్రభుత్వ, డీకేటీ భూములను ఆక్రమించి కంచె ఏర్పాటు చేశారు. పుంగనూరు బైపాస్ రోడ్డు వద్ద పెద్దిరెడ్డి తమ్ముడు, ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి బినామీ పేర్లతో తక్కువ ధరలకు బలవంతంగా భూముల్ని కొనుగోలు చేశారు. పులిచెర్ల మండలంలో మామిడి తోటల యజమానుల్ని బెదిరించి ఆక్రమించుకున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ద్వారకనాథరెడ్డి అనుచరులు ఎక్కువగా కురబలకోట, అంగళ్లు, ముదివేడు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్‌లో భూములు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి.

కార్మికుల శ్రమ దోపిడీ



మాజీ మంత్రి శంకర్‌నారాయణ

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ కియా కార్ల పరిశ్రమలో తుక్కుతో మొదలుకుని కార్మికుల శ్రమను కూడా దోచుకున్నారు. కియాతో పాటు అనుబంధ సంస్థల్లో గత ఐదేళ్లు శంకర్‌నారాయణ, ఆయన సోదరులు బినామీల పేరిట దోపిడీకి పాల్పడ్డారు. అనుబంధ పరిశ్రమలో కార్మికులను నియమించే కాంట్రాక్టు ఏజెన్సీలను బినామీల పేరిట నడిపించారు. ఒక్కొక్క కార్మికుడికి అందే వేతనం నుంచి నెలకు రూ.2వేల దాకా దండుకున్నారు. బాధితుల్లో 150 మందికిపైగా సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. తుక్కు ద్వారా నెలకు రూ.2 కోట్లకుపైగా నొక్కినట్లు సమాచారం. టీ కప్పులు మొదలు భోజనాల ఏజెన్సీలను వారే నడిపించి కమీషన్లు దండుకున్నారు. అప్పట్లో ఏపీ కంటే కర్ణాటకలో లీటర్ డీజిల్ ధర రూ.10 వరకూ తక్కువగా ఉండటంతో బస్సులు, కంటైనర్లకు అక్కడి నుంచి డీజిల్ ట్యాంకర్లను తెప్పించి సొమ్ములు వెనకేసుకున్నారు. చివరకు గాలిమరలలో కూడా దోపిడీకి పాల్పడ్డారు. పెనుకొండ మండలం చంద్రగిరికి చెందిన మధు అనే వ్యక్తి స్థలాన్ని అధికారులను అడ్డు పెట్టుకుని లాగేసుకున్నారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు బాధితుడు ఈ నెల 3న ఫిర్యాదు చేశాడు.

ఇసుక కాంట్రాక్టరు ఆత్మహత్య

గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకలో అడ్డగోలుగా దోచుకున్నారు. గోదావరి నదిని గుల్ల చేసేశారు. తాడేపల్లికి నెలవారీ కప్పం కట్టేలా ఒప్పందం చేసుకుని, అనధికారికంగా ఇసుక తవ్వకం పనులు అప్పగించారు. కొవ్వూరులో నెలకు రూ.25 కోట్లు ఇచ్చేలా ప్రేమ్‌రాజు అనే వైసీపీ నేతకు కాంట్రాక్టు ఇచ్చారు. కొన్నాళ్లు లాభసాటిగా ఉన్నా తర్వాత వైసీపీ పెద్దలు అడిగినంత కప్పం ఆయన కట్టలేకపోయారు. చివరకు వేధింపులు భరించలేక రైలు పట్టాలపై తల పెట్టి బలవన్మరణం చెందారు.

50 లక్షలకు చైర్‌పర్సన్ పదవి బేరం



మాజీ మంత్రి రోజా అవినీతిలోనూ ఫైర్ బ్రాండ్ అని నగరి నియోజకవర్గ ప్రజలు చెబుతుంటారు. గత ఐదేళ్లు వసూళ్ల వ్యవహారం ఆమె ఇద్దరు సోదరులు చూసుకునేవారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఇస్తానని ఆశ చూపి రోజా సోదరుడు తన నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారని వైసీపీకే చెందిన పుత్తూరు కౌన్సిలర్ భువనేశ్వరి ఆరోపించడం అప్పట్లో దుమారం రేపింది. ఆమె తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆధారాలతో సహా ఆరోపణలు చేసింది. తర్వాత ఆమెకు అంతో ఇంతో ఇచ్చి సర్దుబాటు చేసుకున్నారు. విజయపురం మండలంలో ఏకంగా 300 ఎకరాల ప్రభుత్వ భూములను రోజా తన అనుచరుల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో బయట పెట్టడంతో ఉన్నతాధికారులు ఆ భూముల్ని వెనక్కి తీసుకుని నలుగురు రెవెన్యూ సిబ్బందిని సస్పెండ్ చేశారు. వడమాలపేట అంజరమ్మ కనుమ వద్ద 12 ఎకరాల భూమిని బినామీ పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఇందులో రూ.7 కోట్లు సంపాదించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఇండస్ట్రియల్ పార్కుకు భూముల సేకరణలోనూ కోట్లలో సొమ్ము చేసుకున్నారు.

గుర్రాల కోట



దోపిడీ చేయడంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిది ప్రత్యేక స్టైల్. రోజూ ఉదయం 'గుడ్ మార్నింగ్' అంటూ ప్రజలను పలకరించిన ఆయన విలువైన భూములను కబ్జా చేశారు. ధర్మవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని 904, 905, 908, 909 సర్వే నంబర్లలోని 25 ఎకరాల భూములను రైతులను బెదిరించి అతి తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. తన తమ్ముడు కేతిరెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి భార్య వసుమతి పేరుతో కొనుగోలు చేసినట్టు రికార్డుల్లో ఉంది. ఈ భూములను ఆనుకుని ఉన్న 20.61 ఎకరాల చెరువు స్థలాన్ని ఆక్రమించి కలిపేసుకున్నారు. ఇందులో విలాసవంతమైన ఫాంహౌస్, రేసింగ్ ట్రాక్, గుర్రాల కోసం ప్రత్యేక షెడ్లు, సేద తీరడానికి చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఆ ప్రాంతాన్ని గుర్రాల కోట అని జిల్లా ప్రజలు పిలుస్తున్నారు. ధర్మవరం మండల పరిధిలోని 106 ఎకరాల సోలార్ భూములను సొంతం చేసుకున్నారు. ఇక ఆయన అనుచరుల అక్రమాలకూ లేక్కేలేదు. చెన్నేకొత్తపల్లి జాతీయ రహదారి పక్కన 20 ఎకరాల దళితుల భూములను, వారిని బెదిరించి తక్కువ ధరకు కొనుగోలు చేసి కోట్లలో సొమ్ము చేసుకున్నారు. చెన్నేకొత్తపల్లిలో వందేళ్లకు పైగా ఉన్న ప్రధాన రహదారిని కబ్జా చేశారు. ముదిగుబ్బ మండలంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రధాన అనుచరుడు మండల కేంద్రం చుట్టూ ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ భూములను స్థానిక నాయకులతో కలిసి కబ్జా చేశారు. అనంతపురం-కదిరి జాతీయ రహదారి పక్కన 6 ఎకరాల గుట్టను వైసీపీ నేతలు రాత్రికిరాత్రే ఆక్రమించి చదును చేశారు.

అసైన్డ్ భూములను మింగేసిన ఉష శ్రీచరణ్



మాజీ మంత్రి ఉష శ్రీచరణ్

మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ పేదలను భయపెట్టి అసైన్డ్ భూములు లాగేసుకున్నారు. తక్కువ ధరతో వందల ఎకరాలు సేకరించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కంబదూరు మండలం మర్రిమాకులపల్లి గ్రామంలోని 217, 219, 220, 222, 223, 224, 225, 226 సర్వే నంబర్లలో అసైన్డ్ భూములను కొనేందుకు రైతులతో అగ్రిమెంట్లు చేయించుకున్నారు. కంబదూరు-కనగానపల్లి సరిహద్దు మండలాల్లో 124, 125, 127 సర్వే నంబర్లలో 165 ఎకరాలను అతి తక్కువ ధరకే రైతులను బెదిరించి లాక్కున్నారు. ఇందులో 33 ఎకరాలు గాలిమరలకు సంబంధించిన భూమి ఉండడంతో ఆ కంపెనీ ప్రతినిధులను బెదిరించి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు.

జగన్ బంధువుల అక్రమాలు

- కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో రూ.100 కోట్ల విలువ చేసే 20 ఎకరాల ప్రైవేటు భూములను ఆన్‌లైన్ చేసుకున్నారు. ఈ డీల్‌లో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, స్థానిక వైసీపీ నేతల ప్రమేయం ఉన్నట్లు ప్రచారం ఉంది.
- పులివెందుల నియోజకవర్గంలో మాజీ సీఎం జగన్ బంధువు వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి తొండూరు, మల్లెల గ్రామాల్లో సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. బినామీ పేర్లతో ఆన్‌లైన్ చేసుకున్నారు. ఈయన తొండూరు వైసీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.
- కమలాపురం నియోజకవర్గంలోని పాలెంపల్లె, రూకవారిపల్లెకు చెందిన యానాదులకు వెట్టిచాకిరి కింద పొలతల పుణ్యక్షేత్రం సమీపంలో 470 ఎకరాల భూములు ఇచ్చారు. వాటిలో 150 ఎకరాలు జగన్ బంధువు పేరిట ఉన్నట్లు చెబుతున్నారు.

1000 కోట్ల పిన్నెల్లి

పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేసిన అవినీతి, అరాచకాలు, హింస అంతా ఇంతా కాదు. గత ఐదేళ్లలో తక్కువలో తక్కువ రూ.1000 కోట్ల వరకు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారిపై దాడులు చేయించి గ్రామాల నుంచి వెళ్లగొట్టారు. దుర్గి, వెల్దుర్తి మండలాల్లో పలు హత్యలకు సంబంధించి ఆయన అనుచరులపై ఆరోపణలు ఉన్నాయి. వెల్దుర్తి మండలంలో చంద్రయ్య, దుర్గి మండలంలో జల్లయ్య హత్యలు ఈ కోవకు చెందినవే. పిన్నెల్లి అరాచకాలను ప్రశ్నించేందుకు వచ్చిన టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమాలపై దాడి చేసిన తురకా కిషోర్‌కు మున్సిపల్ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. మాచర్ల పట్టణంలో టీడీపీ దివంగత నేత వీరమాచినేని సుభాష్ చంద్రబోస్‌కు చెందిన 10 సెంట్ల స్థలంలో గల ఇల్లు, పెట్రోలు బంకు, బంకు సమీపంలోని స్థలాలు, నెహ్రూనగర్‌లోని ఎకరం స్థలానికి అక్రమ దస్తావేజులు పుట్టించి కాజేశారు. వీటి విలువ సుమారు రూ.10 కోట్లపైనే ఉంటుంది. రింగురోడ్డులోని టీడీపీ నేత నిమ్మగడ్డ వాసుకు చెందిన హెచ్‌పీ పెట్రోల్ బంకును దౌర్జన్యంగా ఆక్రమించారు. కొత్తపల్లి జంక్షన్, స్టేడియం, రాయవరం జంక్షన్, వినాయకుని గుట్ట తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్లు వేయించి సొమ్ము చేసుకున్నారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో సుమారు 300 ఎకరాల ప్రభుత్వ భూమిని దస్తావేజులు పుట్టించి కాజేశారు. వెల్దుర్తి మండలంలో 500 ఎకరాలు, దుర్గి మండలం గజాపురం సమీపంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని మింగేశారు. బియ్యం, మద్యం, ఇసుక, గ్రానైట్, జగనన్న ఇళ్ల స్థలాలకు భూములు కొనుగోలు... ఇలా ప్రతి దాంట్లో వేలు పెట్టి ముడుపులు తీసుకున్నారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లను బెదిరించి 20-30 శాతం వరకు కమీషన్ దండుకున్నారు. పోలింగ్ రోజున పిన్నెల్లి అనుచరులు నానా బీభత్సం సృష్టించారు.

జడ్జి తల్లి భూమి కబ్జా



మాజీ మంత్రి జోగి రమేశ్ బినామీ జడ్జి తల్లి భూమినే కబ్జా చేశాడు. కృష్ణా జిల్లా పెడన మండలం కొంకేపూడి గ్రామంలో జడ్జి తిరుమలరావుకు 5.30 ఎకరాల పొలం ఉంది. ఆయన 2021లో కొవిడ్‌తో మరణించారు. ఆ తర్వాత తిరుమలరావు భార్యకు, తల్లికి ఈ భూమికి సంబంధించి వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో జోగి రమేశ్ అనుచరుడైన పామర్తి సాంబశివరావు అలియాస్ జొకోమో సాంబ ఈ వివాదంలో జోక్యం చేసుకుని 2022 డిసెంబరులో ఇందులో 1.30 ఎకరాల భూమిని తన తండ్రి అర్జునరావు పేరుతో రిజిస్టర్ చేయించుకున్నారు. ఇక జోగి రమేశ్ కుటుంబం విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో ఏకంగా సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రి గోల్డ్ భూములనే కబ్జా చేసేసింది.



బెదిరించి థియేటర్ సొంతానికి...

గుడివాడ పట్టణ నడిబొడ్డున ఉన్న శరత్ థియేటర్‌లో కేవలం ఒక వాటా కలిగి ఉన్న మాజీ మంత్రి కొడాలి నాని దాన్ని ఏకంగా సొంతం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు వాటాదారులను బెదిరించి దాదాపు పదేళ్లుగా తన ఆధీనంలో ఉంచుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల అసలు వాటాదారులు ముందుకొచ్చి తమ థియేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నియోజకవర్గంలో ఎన్నో ప్లాట్లు, భూములు ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గుడివాడలో స్థానిక టీచర్స్ కాలనీలోని అక్షర స్కూల్‌కు చెందిన 1,600 గజాల స్థలాన్ని సెటిల్‌మెంట్ పేరుతో ఆక్రమించుకున్నారు. దాన్ని నాని ముఖ్య అనుచరుడు కొల్లి విజయ్ పేరుతో ది గుడివాడ అర్బన్ బ్యాంకులో తనఖా పెట్టారు. నందివాడ మండలం పుట్టగుంట వద్ద పాఠశాలకు చెందిన ఖాళీస్థలంతో పాటు మరికొందరు వ్యక్తులకు చెందిన 7.75 ఎకరాల పొలాలను ఆక్రమించుకుని చెరువు తవ్వేశారు. కబ్జా చేసిన వాటిలో ఆలయాల భూములు కూడా ఉన్నాయి.

భూకబ్జాలపై జిల్లాల వారీగా ప్రత్యేక సెల్

- వైసీపీ నేతల బండారం బయటపడుతుంది
- శకుని మామ విజయసాయికి విలువల్లేవు
- సీఎంను దూషించినందుకు చర్యలు తప్పవు: అనిత

విశాఖపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణలు, కబ్జాలపై చర్యలు తీసుకునేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సెల్‌లు ఏర్పాటు చేయనున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. దీంతో వైసీపీ నేతల బండారం బయటపడుతుందని తెలిపారు. ఆదివారమిక్కడ విశాఖ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున భూకబ్జాలు, ఆక్రమణలు జరిగాయని.. విశాఖ భూకబ్జాలపై ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్ మాదిరిగానే అన్ని జిల్లాల్లోనూ ప్రారంభించాలని డీజీపీ ఆలోచన చేస్తున్నారని చెప్పారు. విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కబ్జాలను వెలికితీస్తే మరెంతో మంది బాధితులు బయటకు వస్తారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో కబ్జాల బాధితులు వినతులు అందజేస్తున్నారని, పోలీసు శాఖ కూడా దీనిలో భాగస్వామ్యం అవుతుంది కాబట్టి ఫిర్యాదులపై లోతైన విచారణ జరుగుతుందని చెప్పారు. కాకినాడ పోర్టును.. బెదిరించి, భయపెట్టి లాక్కున్న విషయం బయటపడ్డాక.. వైసీపీ నాయకులు చేసిన నేరాలు, ఘోరాలు, అందుకోసం అవలంబించిన విధానాలను చూసి.. ఇలా కూడా నేరాలు చేయవచ్చా అని పోలీసులే ఆశ్చర్యపోతున్నారని అన్నారు. రూ.6 వేల కోట్ల ఆస్తిని కేవలం రూ.590 కోట్లకు భయపెట్టి లాక్కొన్నారని ఆధారాలతో బయటపడడంతో.. దీని నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వైసీపీ నేతలు సీఎం చంద్రబాబును దూషిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు వయసు, హోదాను విస్మరించి ఎంపీ విజయసాయిరెడ్డి అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని, దీనిపై చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. 'విలువల్లేని శకుని మామ విజయసాయిరెడ్డి' అని అనిత విమర్శించారు.



విశాఖలో మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత. పక్కన డీజీపీ ద్వారకా తిరుమలరావు, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ఎన్నెన్నో అక్రమాలు

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేట పరిసరాల్లో వైసీపీ నేతలు పేదలను బెదిరించి వందలాది ఎకరాలు చేజిక్కించుకున్నారు. గెడ్డలు పూడ్చివేసి, కొండలు చదును చేశారు. ఎంపీ విజయసాయిరెడ్డి సన్నిహితుడు గోపినాథ్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న ఎష్యూర్ ఎల్ఎల్‌పీ సంస్థ విస్సన్నపేట లేఅవుట్‌లో 55 ఎకరాలు, కృష్ణా జిల్లాకు చెందిన మరో వైసీపీ నేత పేరుతో 200 ఎకరాల వరకూ కొనుగోలు చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మోసూరు పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 253పీలో వైసీపీ నాయకుడు గుండేపల్లి రాము సుమారు 50 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నట్టు ఆరోపణలున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం తోణాం పంచాయతీ పరిధిలో పూజారి మల్లేశ్వరికి చెందిన ఐదెకరాల భూమిని వైసీపీ నాయకురాలు డి.అనంతకుమారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి.

కురుపాం నియోజకవర్గంలో మాజీ మంత్రి పాముల పుష్పశ్రీవాణి ఐటీడీఏ నిధులతో తన ఇంటి చుట్టూ రక్షణ గోడను నిర్మించుకున్నారు.

పాలకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కళావతి సీతంపేట మండలంలో పేదల నుంచి అతిచౌకగా భూమిని కొనుగోలు చేసి ఫామ్ హౌస్ నిర్మించుకున్నారు. ప్రభుత్వ నిధులతో బీటీ రహదారిని ఏర్పాటు చేసుకున్నారు.

మదనపల్లె-పుంగనూరు జాతీయ రహదారికి ఆనుకుని బసినికొండ రెవెన్యూ గ్రామంలో వివాదాస్పద భూములను వైసీపీ నేతలు ఆక్రమించారు. కడప, పులివెందులకు చెందిన ముఠా సభ్యులను పిలిపించి దౌర్జన్యంగా సిమెంటు పలకలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. రూ.50 కోట్ల విలువ చేసే పదెకరాల భూమిని ఆక్రమించారు.

ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెలో రూ.30 కోట్లు విలువ చేసే 5 ఎకరాలు చర్చి భూమిని మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఆక్రమించారనే ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ సభ్యులపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

మైదుకూరు నియోజకవర్గం నంద్యాలంపేట సర్వే నెంబర్ 506బీ, 507లో 304 ఎకరాల అటవీ శాఖ భూమి ఉంది. వైసీపీ నేత ఆక్రమించి పండ్ల తోటలనే సుమారు 50 ఎకరాల్లో సాగు చేశారు.

బద్వేలులోని సర్వేనెంబర్ 1568, 69, 62లో 19 ఎకరాల భూములను గతంలో దళితులకు ఇచ్చారు. ఇక్కడ ఎకరం ధర రూ.3 కోట్లపైనే ఉంటుంది. వైసీపీ నేత, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గోపాలస్వామి వాటిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కలసపాడు రెవెన్యూ పొలంలో ముగ్గురు వైసీపీ నేతలు 75 ఎకరాలు ఆక్రమించారు.




అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం, విస్సన్నపేట ప్రాంతాల్లో వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న భూములు

డిస్టిలరీలు కబ్జా



మద్యపాన నిషేధం చేస్తామన్న జగన్ సీఎం కాగానే ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిపించారు. కప్పం కట్టని బ్రాండ్ కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేశారు. ముడుపులు ఇచ్చిన కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారు. రాష్ట్రంలోని డిస్టిలరీలను బలవంతంగా లాక్కొన్నారు. సొంత బ్రాండ్లను సృష్టించారు. మద్యం తయారీ నుంచి అమ్మకాల వరకూ అంతా తన గుప్పిట్లో పెట్టుకున్నారు. ప్రభుత్వ షాపుల్లో నాసిరకం బ్రాండ్లను అమ్మించి ప్రజల ఆరోగ్యంతో ఆడుకున్నారు. తాడేపల్లికి రూ.3100 కోట్లు ముడుపులు అందినట్టు ప్రభుత్వ ప్రాథమిక అంచనా. కూటమి ప్రభుత్వం రాగానే మద్యం పాలసీని మార్చేసిన సంగతి తెలిసిందే. గతంలో మాదిరి కప్పం కట్టాల్సిన పని లేకపోవడంతో మద్యం ధరలు తగ్గించడంతో పాటు మళ్లీ పాత బ్రాండ్లు వచ్చాయి.



సైబర్ నేరాలకు చెక్..!

గత ఆరేళ్లలో సైబర్ కేసులు

ఏడాది	సైబర్ నేరాలు
2019	1,866
2020	1,899
2021	1,875
2022	2,341
2023	2,144
2024	2,500

జిల్లాకో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు


- ఎస్పీల గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదుల పరిష్కారం
- ప్రజల్లో అవగాహనకు జిల్లాల వ్యాప్తంగా విస్తృత ప్రచారం
- ప్రభుత్వానికి పోలీస్ శాఖ ప్రతిపాదనలు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈడీ అధికారి పేరు చెప్పి ఒకడు కొరియర్ ఫ్రాడ్ అంటూ ఫోన్ చేస్తాడు.. సీబీఐ లోగో వెనుక పెట్టుకుని మరొకడు డిజిటల్ అరెస్టు అంటూ వీడియో కాల్‌లో బెదిరిస్తాడు. మనీలాండరింగ్ కేసులు మొదలు డ్రగ్స్, అక్రమ ఆయుధాల కేసులంటూ భయపెట్టి నిలువునా దోచేస్తారు. బ్యాంకుల పేరుతో కేవైసీ అడిగి, డెబిట్ కార్డుల అప్‌డేట్ పేరు చెప్పి మోసాలు చేస్తున్నారు. నకిలీ యాప్‌లు, మ్యాట్రిమోనీ మోసాలతోపాటు ఉపాధి, ఉద్యోగాల ఆశ చూపి భారీగా దోచేస్తున్నారు. ఇలా రోజుకో కొత్త మార్గంలో సవాల్ విసురుతున్న సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టేందుకు ఏపీ పోలీస్ శాఖ నడుం బిగించింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు ఒక సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రతి జిల్లా కేంద్రంలోనూ సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటుచేసి అందులో సాంకేతిక పరిజ్ఞానం, అనుభవం ఉన్న పోలీసుల్ని నియమిస్తే ఫలితం ఉంటుందని పేర్కొంది. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం లాంటి పెద్ద నగరాల్లో సైబర్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఇతర ప్రాంతాల బాధితులు ఫిర్యాదు చేయాలంటే మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఉన్న సైబర్ పోలీసు స్టేషనే దిక్కు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలోనూ సైబర్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసి.. బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీల గ్రీవెన్స్‌లో పరిష్కరించాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉందని ప్రతిపాదనల్లో పేర్కొన్నట్టు తెలిసింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కానిస్టేబుళ్లలో సైతం ఇంజనీరింగ్, కంప్యూటర్స్ చదివిన వారున్నందున బాధితులకు రక్షణ కల్పించే అవకాశం మెండుగా ఉంటుందని ఉన్నతస్థాయి పోలీసు అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

డీజీపీల సదస్సులో ప్రధాని వ్యాఖ్యలతో అలర్ట్

సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై బాధితులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా హెల్ప్‌లైన్ నంబర్ 1930ను అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్రం.. రాష్ట్రాలను అప్రమత్తం చేయడంతో ఏపీలోనూ అదే ప్రక్రియ మొదలైంది. ఈ నెల 2న భువనేశ్వర్‌లో డీజీపీల సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పెరుగుతున్న డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ టెక్నాలజీ, డీప్‌ఫేక్ వంటి వాటితో అలజడి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నిర్ణయాలకు అనుగుణంగా ఏపీ పోలీసుశాఖ... రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదన పంపినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

దందాల ద్వారంపూడి



ఐదేళ్లలో అడ్డగోలుగా అక్రమార్జన

- నాటి సీఎం జగన్ అండతో బరితెగింపు
- ఎన్నో బెదిరింపులు, దౌర్జన్యాలు, కబ్జాలు
- కాంట్రాక్టు పనుల్లో కోట్లు జేబులోకి
- బినామీని అద్దె అడిగినందుకు యజమాని నుంచే 3 కోట్లు వసూలు
- కాకినాడలో 100 కోట్ల విలువైన హోటల్ స్థలం రూ.12 కోట్లకే సొంతం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేరుకు మాత్రం ప్రజాప్రతినిధి.. చేసిందంతా దౌర్జన్యాలు, దందాలు, బెదిరింపులు, కబ్జాలు. దీనికి తోడు అడ్డగోలు తెంపరితనం. పైగా అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు అత్యంత సన్నిహితుడిననే తలపొగరు. వెరసి పెన్షనర్స్ ప్యారడైజ్‌గా పిలిచే కాకినాడలో కడప తరహా సంస్కృతి తీసుకువచ్చారు. ఆయనే.. కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి. గత ప్రభుత్వంలో ప్రజలను, వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేశారు. ప్రైవేటు ఆస్తుల నుంచి ప్రభుత్వ భూముల వరకు ఎన్నింటినో చెరబట్టారు. అడ్డుకోవడానికి చూసిన అధికారులను అప్పటి సీఎం పేషీలో తనకున్న బలంతో రాత్రికి రాత్రే బదిలీ చేయించారు. టెండర్ల దగ్గర నుంచి కాంట్రాక్టుల వరకు ప్రతిదీ తనదేనన్నట్లు చెలరేగిపోయారు. విదేశాలకు వేలకోట్ల రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిలో దిట్టగా పేరొందిన ఈయన కాకినాడ నగరాన్ని ఐదేళ్లలో లూటీ చేసేశారు. ఆయన అక్రమాల బాగోతం పెద్దదే.

అద్దె ఇవ్వకుండా తిరిగి వసూలు

కాకినాడ నగర నడిబొడ్డున భానుగుడి జంక్షన్‌లో ఓ ప్రముఖ స్వీట్‌స్టాల్ యజమాని ఖాళీగా ఉన్న తన భవనాన్ని ద్వారంపూడికి కుడిభుజంగా ఉన్న వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. అందులో సదరు చోటా నేత రెస్టారెంట్ ప్రారంభించగా కొన్నాళ్లకు నష్టం వచ్చింది. దీంతో ఏడాదిన్నర పాటు అద్దె కట్టలేదు. ఇదేంటని సదరు స్వీట్‌స్టాల్ యజమాని నిలదీస్తే... అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ద్వారంపూడితో ఒత్తిడి చేయించారు. సదరు యజమాని భయపడకుండా తన ఆస్తి అయిన హోటల్‌కు తాళాలు వేశారు. దీంతో ద్వారంపూడి జిల్లా ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులతో స్వీట్‌స్టాల్‌పై దాడి చేయించారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, రోడ్డుకు అడ్డంగా ఉందంటూ ఏకంగా దాన్ని తీసివేయించాలని కుట్రపన్నారు. అదే సమయంలో హోటల్ పెట్టుకున్న భవనం తమదేనని సదరు చోటానేత తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి ఆస్తి కొట్టేయడానికి సిద్ధపడ్డారు. దీంతో ఒక్కసారిగా బెదిరిపోయిన స్వీట్‌స్టాల్ యజమాని తిరిగి రూ.3 కోట్లు చదివించుకోవాల్సి వచ్చింది.

100 కోట్ల ఆస్తి 12 కోట్లకే

కాకినాడ నడిబొడ్డున ఐశ్వర్య గ్రాండ్ హోటల్ ఉండేది. అప్పుల్లో కూరుకుపోవడంతో యజమాని ఐపీ పెట్టేశారు. దీంతో బ్యాంకు హోటల్‌ను వేలం వేసింది. ఈలోపు ద్వారంపూడి రంగంలోకి దిగి ఆ యజమానికి అప్పులిచ్చిన తొమ్మిదిమందిని బెదిరించి బ్యాంకు వేలంలో పాల్గొనకుండా చేశారు. వారికి ఏదో కొంత డబ్బులు ఇచ్చి పంపేశారు. మార్కెట్లో రూ.100 కోట్ల విలువ చేసే ఆస్తిని రూ.12 కోట్లకే కొట్టేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ద్వారా ప్రత్యేక జీవో జారీ చేయించి.. కింద వాణిజ్య భవనం, పైన అల్లుడి కోసం ప్రైవేటు ఆస్పత్రి నిర్మాణానికి సిద్ధపడ్డారు.

పూడిక మట్టితో కోట్లు

కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలంలో వందల ఎకరాల అరట్లకట్ట మంచినీటి స్టోరేజీ ట్యాంకు చెరువులో పూడికతీసే టెండర్‌ను కాకినాడ కార్పొరేషన్ రూ.2 కోట్లతో పిలిచింది. ద్వారంపూడి ఎమ్మెల్యేగా చక్రం తిప్పి అందులో మట్టి ఉచితంగా అమ్ముకునేలా ఆదేశాలు జారీ చేయించారు. దీనికి ఎనిమిది మంది వరకు టెండర్లు వేయడానికి ముందుకు రాగా అందరినీ బెదిరించారు. టెండర్ వేస్తే కార్పొరేషన్‌లో ఏ పనీ రాకుండా చేస్తానని హెచ్చరించడంతో వారు వెనక్కు తగ్గారు. దీంతో తన అనుచరుడైన బినామీకి పని అప్పగించారు. ఈ కాంట్రాక్టులో ఒక్క పూడిక తీసిన మట్టి అమ్మకం ద్వారా ద్వారంపూడి రూ.4 కోట్లు సంపాదించారు. బిల్లు రూ.2 కోట్లు మంజూరైంది.

రొయ్యల ఫ్యాక్టరీకి వంతెన

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో ద్వారంపూడికి తన సోదరుడి పేరుతో వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ అనే రొయ్యల ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీకి వచ్చి వెళ్లే లారీలు, టిప్పర్లకు ప్రత్తిపాడు-లంపకలోవ మధ్యలో సుద్దగెడ్డ అనే వాగు అడ్డం వస్తుంది. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ వాగు పొంగిపొర్లుతుంది. దీంతో 2021లో అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి స్వయంగా వెళ్లి సుద్దగడ్డ వాగు పరిశీలించారు. 2021 మార్చి 25న రూ.2.70 కోట్లతో వంతెన నిర్మించేశారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని 20 ఏళ్ల నుంచీ పది గ్రామాలకు చెందిన 40 వేలమంది పోరాడినా అప్పటి వరకూ పట్టించుకోలేదు. ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీ నిర్మాణం తర్వాత ఆ కంపెనీ వాహనాలకు ఇబ్బంది లేకుండా రోడ్డు కమ్ వంతెన ఏర్పాటు చేశారు.



ఐశ్వర్య గ్రాండ్ హోటల్ స్థలం

ప్రభుత్వ భూములకు స్కెచ్

కాకినాడలో పాలిటెక్నిక్ కాలేజీ వెనుక ప్రభుత్వానికి చెందిన 3.5 ఎకరాల భూదాన్ భూములున్నాయి. వీటిని నకిలీ పత్రాలతో కాజేయడానికి ద్వారంపూడి స్కెచ్ వేశారు. కార్పొరేటర్లు అడ్డు తగలకుండా ఉండేందుకు, అందులో రూ.50 లక్షలు విలువ చేసే వందేసి గజాలు 20 మందికి ఉచితంగా ఇవ్వడానికి బేరం మాట్లాడారు. ఒక్కొక్కరి నుంచి ముందుగానే రిజిస్ట్రేషన్ చార్జీల కింద రూ.1.50 లక్షల చొప్పున లాగేశారు. ఆ తర్వాత ఈ దందా వెలుగులోకి రావడంతో నిలిచిపోయింది.

మడను మడతెట్టేసి...

2020లో కాకినాడ నగరంలో 31,505 మంది పేద లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల సేకరణకు దుమ్ములపేటలో కాకినాడ యాంకరేజ్ పోర్టుకు చెందిన భూములపై ద్వారంపూడి కన్నేశారు. వాటిని లాక్కునేందుకు ప్రయత్నించారు. తమ భవిష్యత్తు అవసరాలకు కావాలంటూ పోర్టు వ్యతిరేకించింది. దీంతో ద్వారంపూడి తనకున్న అధికార బలంతో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేయించి భూముల్ని ఇళ్ల స్థలాల పేరుతో లాగేసుకున్నారు. దుమ్ములపేటలో సర్వే నెంబర్లు 374, 376లో 116 ఎకరాలను అధికారులు సేకరించారు. అయితే అక్కడ మడ భూములున్నాయని, వాటిని ధ్వంసం చేస్తూ చదును చేస్తున్నారని పర్యావరణవేత్తలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఒక పక్క ఎన్జీటీలో కేసు నడుస్తున్నా ద్వారంపూడి ఒత్తిడితో అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి భూములు చదును చేయించేశారు. ఈ భూములు చిత్తడి నేలలు కావడం, భారీగా మడ అడవులున్న నేపథ్యంలో 116 ఎకరాలు చదును చేయడానికి రూ.25 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. కనీసం టెండర్ కూడా పిలవకుండా అరట్లకట్ట పనిచేసిన తన బినామీ వ్యాపారితో చదును పేరుతో కొంత పని చేసి రూ.16 కోట్లు బిల్లులు చేసుకున్నారు. ఆ తర్వాత 2020 మేలో ఎన్జీటీ ఆదేశాలతో పని ఆగిపోయింది. అయితే అప్పటికే డబ్బు ద్వారంపూడికి చేరిపోయింది. ఎన్జీటీ తీర్పుతో రాష్ట్రప్రభుత్వం రూ.5 కోట్ల జరిమానా చెల్లించాల్సి వచ్చింది.

ఎన్నో అక్రమాలు

1 కాకినాడ నగరంలో 11వ డివిజన్ పరిధిలో ఏకంగా 300 గజాల రహదారిని ద్వారంపూడి ఆక్రమించారు. ఆ తర్వాత దాన్ని తన వద్ద ఉండే ఓ రౌడీషీటర్‌తో పాటు మరోనేతకు కట్టబెట్టేశారు.

1 కాకినాడ రూరల్‌లోని జయలక్ష్మి సొసైటీ బ్యాంకు బోర్డు తిప్పేసి ఖాతాదారులకు వందల కోట్లు మోసం చేసింది. దీంతో బాధితులంతా ద్వారంపూడిని కలిసి న్యాయం చేయాలని కోరారు. వెంటనే సదరు బ్యాంకు డైరెక్టర్లను పిలిచి ఆస్తుల గురించి ఆరా తీశారు. ఎలాంటి చర్యలు లేకుండా చేయడానికి కాకినాడ నగరంలో బ్యాంకుకు చెందిన రూ.10 కోట్ల విలువైన భవనాన్ని తన ఐదుగురు అనుచరుల పేరుతో కోనసీమ జిల్లాలోని కొత్తపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారు.

1 వడ్డీ, అసలు కట్టడం లేదని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని ద్వారంపూడి కిడ్నాప్ చేయించారు.

1 దళిత డ్రైవర్ హత్య కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు పోలీసులకు దొరకకుండా ద్వారంపూడి సహకరించారు. తన ఇంటివద్ద నిందితుడిని ఉంచుకుని కాపాడాలని చూశారు.

చదును పేరిట కోట్లు కొట్టేశారు..

అప్పటి సీఎం జగన్ పేదల ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని పిఠాపురం నియోజవర్గం పరిధిలోని యు.కొత్తపల్లి మండలం కొమరగిరిలో ప్రారంభించారు. ఇక్కడ 250 ఎకరాలకు పైగా ప్రైవేటు భూములు సేకరించారు. ఇవన్నీ సముద్రానికి అతి సమీపంలో ఉన్నాయి. చిన్నపాటి వర్షాలకే ముంపునకు గురవుతాయి. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదును చేస్తే కానీ పంపిణీకి వీలు పడదు. సీఎం హోదాలో జగన్ వస్తున్నారన్న కారణంతో టెండర్ లేకుండా చదును చేసే కాంట్రాక్టును అప్పటి కలెక్టర్ మురళీధరరెడ్డి ద్వారంపూడికి కట్టబెట్టేశారు. ఈ పనిలో కోట్లు వెనకేసుకున్నట్టు ఆరోపణలున్నాయి.

రహదారులు రక్తసిక్తం





ప్రమాదానికి ముందు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం వద్ద దిగిన ఫొటో, చెట్టును ఢీకొని ధ్వంసమైన కారు ముందుభాగం

- రెండు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం
- పల్నాడు జిల్లాలో కారు చెట్టును ఢీకొని నలుగురు మృతి
- బాపట్ల జిల్లాలో స్కూటర్‌ను టిప్పర్ ఢీకొని ముగ్గురు మృత్యువాత

పిడుగురాళ్ల, కావలి రూరల్, పర్చూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం ఏడుగురు దుర్మరణం చెందారు. నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన 8 మంది కొత్త కారుకు తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేయించి తిరిగి వస్తుండగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామం మలుపు వద్ద కారు అతివేగంగా చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో సిరిపురం గ్రామానికి చెందిన తుళ్లూరి సురేశ్(35), ఆయన భార్య తుళ్లూరి వనిత(32), ఉప్పాళ్ల యోబులు(60), కావలి మండలం వైకుంఠపురానికి చెందిన తాతా పెద్ద తిరుపతి(60) అక్కడికక్కడే మృతి చెందారు. సిరిపురానికి చెందిన ఉప్పాళ్ల ప్రణయ్‌కుమార్, ఆయన తల్లి ఉప్పాళ్ల ఆదిలక్ష్మి, ఉప్పాళ్ల శ్రీను, తాతా కౌసల్య తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పిడుగురాళ్లలోని ప్రైవేటు ఆస్పత్రికి, అనంతరం కావలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. కౌసల్య పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైకి తీసుకెళ్లారు. తుళ్లూరి సురేశ్ కరెంటు పనులు చేస్తుంటారు. ప్రతి ఏటా ఆయన కుటుంబమంతా ఆంజనేయస్వామి మాల ధరించి తిరుమలలోని జాపాలి తీర్థానికి వెళ్లి మొక్కులు తీర్చుకునే వారు. ఈ ఏడాదీ ఆంజనేయస్వామి మాల వేశారు. కాగా, ప్రణయ్‌కుమార్ ఇటీవల కొత్తగా కారు కొన్నారు. కారుకు పూజలతోపాటు మొక్కులు తీర్చుకునేందుకు శుక్రవారం బంధువులతో కలిసి సిరిపురం నుంచి కొండగట్టుకు బయలుదేరారు. శనివారం మధ్యాహ్నం కొండగట్టులో కారుకు పూజలు చేయించారు. ఇక్కడే ఇరుముడులు చెల్లించి, తిరుగు ప్రయాణంలో దారిలోని దేవాలయాలను సందర్శిస్తున్నారు. శనివారం రాత్రికి యాదగిరిగుట్ట స్వామివారిని దర్శించుకుని కొద్దిసేపు విశ్రాంతి అనంతరం స్వగ్రామానికి బయల్దేరారు. ఉదయం 5.30 గంటల సమయంలో అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై బ్రాహ్మణపల్లి గ్రామం మలుపు వద్ద కారు అతివేగంతో హెచ్చరిక బోర్డును ఢీకొట్టి ఆ తర్వాత చెట్టును ఢీ కొట్టింది. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారు. సురేశ్, వనిత దంపతులు ప్రమాదంలో మరణించడంతో వారి ఇద్దరు చిన్న పిల్లలు అనాథలుగా మిగిలారు. కారును ప్రణయ్‌కుమార్ నడుపుతున్నారని, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని ఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక పోలీసులతో కలిస ఘటనా స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు.



బాపట్ల జిల్లా అన్నంబొట్లవారిపాలెం వద్ద మస్తాన్‌వలి, బుడెమ్మ మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మాల్యాద్రి

పుట్టినరోజున దూసుకొచ్చిన మృత్యువు



మస్తాన్‌వలి(ఫైల్)



బుడెమ్మ(ఫైల్)

బాపట్ల జిల్లా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం వద్ద పర్చూరు-వాడరేవు రోడ్డుపై ఆదివారం జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మృతులను కొరిశపాడు మండలం మేదరమెట్లకు చెందిన షేక్ మస్తాన్‌వలి(27), ఆయన భార్య అమీరున్(27), అత్త షేక్ బుడెమ్మ(45)గా గుర్తించారు. మేదరమెట్లకు చెందిన మస్తాన్‌వలి మోటరు మెకానిక్. ఆదివారం అమీరున్ పుట్టినరోజు కావడంతో దంపతులు కోనంకిలోని ఆమె పుట్టింటికి వెళ్లారు. అక్కడి నుంచి స్కూటర్‌పై మస్తాన్‌వలి, అమీరున్, బుడెమ్మ, అలాగే మస్తాన్‌వలి బావమరిది కుటుంబం మరో బైక్‌పై బయలుదేరారు. చీరాల మండలం వాడరేవు వద్ద సముద్ర స్నానం చేసి సరదాగా గడిపారు. తిరుగుప్రయాణంలో అన్నంబొట్లవారిపాలెం వద్ద వీరి స్కూటర్‌ను వెనుక నుంచి వేగంగా టిప్పర్ ఢీకొట్టింది. మస్తాన్‌వలి, బుడెమ్మ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, అమీరున్‌ను ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు విడిచారు. మస్తాన్‌వలి దంపతులకు మూడేళ్ల క్రితం వివాహమైంది. సంతానం లేరు.



విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుకు ఫిర్యాదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

విజయసాయిరెడ్డిపై కేసు పెట్టండి

- విజయవాడ సీపీకి బుద్దా వెంకన్న ఫిర్యాదు

విజయవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఇష్టానుసారంగా ఎక్స్‌లో ట్వీట్లు చేస్తున్న రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత బుద్దా వెంకన్న ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబును కోరారు. ఈ మేరకు విజయవాడ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆదివారం ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయం బయట మీడియాతో మాట్లాడారు. 'విజయసాయిరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు. నీకు సిగ్గు, శరం ఏమాత్రం ఉన్నా మనిషిగా వ్యవహరించు. మేము అధికారంలోకి రాగానే.. అప్పటికి చంద్రబాబు బతికుంటే జైల్లో వేస్తామని బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేస్తే భయపడిపోతారా? కాకినాడ పోర్టును జగన్ బలవంతంగా లాక్కున్నారనేది వాస్తవం కాదా? కేవీ రావు దగ్గర ఎలా తీసుకున్నారో చెప్పగలరా? 2019 నుంచి వైసీపీ నాయకులు చేసిన దాడులు, దారుణాలు అన్నీ ఇన్నీ కావు. ఎంతోమంది బాధితులు ఇప్పుడు పోలీసులకు, కలెక్టర్లకు ఫిర్యాదులు చేస్తున్నారు. కేవీ రావు ఇదే విధంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే కులాన్ని అంటగడతావా? జగన్ తప్పు చేయలేదని, కాకినాడ పోర్టులో వాటాలను లాక్కోలేదని నిరూపించే దమ్ము ఉందా? మీ తప్పులు, పాపాలను ఎత్తి చూపితే కులం పేరుతో కుట్రలు చేస్తారా' అని నిలదీశారు. గతంలో ఎక్స్‌లో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెట్టారని, ఇప్పటి వ్యాఖ్యలు విజయసాయిరెడ్డి ఉన్మాదానికి పరాకాష్ట అని మండిపడ్డారు. సీఎంగా ఉన్న చంద్రబాబును బెదిరించినందుకు విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పరువు నష్టం దావా వేయడానికి అసలు విజయసాయిరెడ్డికి పరువు ఉందా.. అని బుద్దా వెంకన్న ఎద్దేవా చేశారు. పోలీసులు చర్యలు తీసుకోని పక్షంలో న్యాయ పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

పోలవరం ప్రాజెక్టును చూడనివ్వండి..!

- సందర్శకులను అడ్డుకుంటున్న భద్రతా సిబ్బంది
- సమీపంలోని ఆలయాలకు వెళ్లాలన్నా ఆటంకాలు
- అనుమతించాలని కోరుతున్న పర్యాటకులు, భక్తులు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టును సందర్శిస్తున్న పర్యాటకులు (ఫైల్)

పోలవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టును సందర్శించేందుకు అనుమతించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టు సందర్శనకు రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం చాలామంది ప్రత్యేక వాహనాల్లో వస్తున్నప్పటికీ.. భద్రతా బలగాలు వారిని అనుమతించడం లేదు. దీంతో వచ్చినవాళ్లు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తీరును ప్రజలకు తెలపాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ ప్రభుత్వం బస్సు యాత్ర నిర్వహించింది. ప్రతి గ్రామం నుంచి బస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రాజెక్టును చూపించి, ఇంజనీరింగ్ అధికారులతో నిర్మాణ వివరాలు తెలిపి, భోజనాలు పెట్టించి మరీ పంపేవారు. ఈ బస్సు యాత్ర ద్వారా 2018 డిసెంబరు 31 నాటికి 4,36,933 మంది ప్రాజెక్టుని సందర్శించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు సందర్శనను అటకెక్కించింది. భద్రతపేరిట సందర్శకులను కట్టడి చేసింది. ప్రస్తుతం ప్రాజెక్టు ప్రాంతానికి మంత్రులు, వీఐపీలు వచ్చిన సందర్భాలలో మినహా మీడియాని కూడా రానివ్వడం లేదు. ప్రాజెక్టు ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోశమ్మ ఆలయానికి, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన ఉన్న మహానందీశ్వరస్వామి ఆలయానికి, పోలవరం గ్రామ సమీపంలోని పాండురంగడి ఆలయానికి నిత్యం అనేక మంది భక్తులు వస్తుంటారు. అయితే భద్రతా సిబ్బంది అభ్యంతరం తెలుపుతుండటంతో అసహనం వ్యక్తంచేస్తున్నారు. పాపికొండల సందర్శన కోసం గండి పోశమ్మ ఆలయ సమీపంలో ఉన్న టూరిజం బోటు పాయింట్ వద్దకు చేరుకోవడానికి వచ్చేవారికి కూడా ఇవే పరిస్థితులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి పోలవరం ప్రాజెక్టు, పాపికొండల సందర్శనకు, గండి పోశమ్మ, మహానందీశ్వర స్వామి ఆలయానికి ప్రాజెక్టు మీదుగా వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

భద్రతా కారణాల రీత్యానే..!

ప్రాజెక్టుకి ఉగ్రవాదులు, సంఘవిద్రోహ శక్తుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు పరిశీలనకు సీఎం తరచూ వచ్చే ప్రాంతం కావడంతో భద్రతా కారణాల రీత్యా సందర్శకులను నిలువరిస్తున్నామని ప్రత్యేక భద్రతా అధికారులు చెబుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.